RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:239 హైదరాబాద్, శుక్రవారం, 28 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00



## మేమూ అలా చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైల్లో ఉండేవారు: సీఎం



%హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి  కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ, డ్రోన్ ఎగరవేశారని ఒక ఎంపీ మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారు. రూ.500 జరిమానా వేసే కేసులో జైలులో పెట్టి వేధించారని సీఎం అన్నారు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను. నేను కూడా అలా ప్రతీకార రాజకీయాలు చేయదలిస్తే.. ఇప్పటికే కొందరు జైలులో ఉండేవారు. కేటీఆర్, కేసీఆర్‌ను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్షపూరిత రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు" అని రేవంత్ అన్నారు.

"భారాస మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసింది. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్లు మాఫీ చేశారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8,500 కోట్లకు పైగా అయ్యింది. మేం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.26వేల కోట్లు రుణమాఫీ చేశాం. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకొని రైతుబంధు కూడా వేయలేదు. భారాస ఎగవేసిన రైతుబంధు రూ. 7,625 కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని మాజీ సీఎం స్వయంగా బెదిరించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చాం" అని రేవంత్ తెలిపారు.

కమీషన్ల కోసం ప్రాజెక్టుల రీడిజైన్

ప్రాజెక్టుల కోసం పేదల భూములు తీసుకున్న కేసీఆర్.. వాళ్ల బంధువుల భూములు మాత్రం తప్పించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న రైతులు అందోళన చేయలేదా? అని ప్రశ్నించారు. 14 గ్రామాల ప్రజలను పోలీసులతో కొట్టించి బలవంతంగా భూసేకరణ చేశారన్నారు. "ప్రాజెక్టు వద్ద ఎవరికి భూములు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కాలువలు తీసినట్లు నిరూపిస్తాను. నేను భూసేకరణను వ్యతిరేకించలేదు.. పరిహారం చెల్లించాలని ధర్నాలు చేశాను. కమీషన్ల కోసం ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశారు. రూ.36వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి.. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం చేపట్టారు. కాళేశ్వరం అవినీతి విషయంలో త్వరలోనే వీళ్లు జైలుకు వెళ్తారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చింది" అని రేవంత్ అన్నారు.

## రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: ఉత్తమ్

దేవన్నపేట: రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ములుగు జిల్లా దేవన్నపేట పంపుహౌస్ వద్ద ఆయన దేవాదుల ప్రాజెక్టు పంపులను ప్రారంభించారు. ఒక మోటార్ ఆన్ చేసి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి గోదావరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేరుకున్నాయి. అనంతరం అక్కడ ఇద్దరు మంత్రులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 15 రోజుల్లో మరో మోటార్ ఆన్ చేస్తామన్నారు. గత ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని, ఈ ఏడాది చివరికల్లా దేవాదుల ప్రాజెక్టు అన్ని దశల పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



## మాకు వచ్చినవి సున్నా సీట్లే.. మరి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిందెంత?: కేటీఆర్

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ (లప్రశ్నించారు. ప్రతి పనిలోనూ గత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నవారు.. కేంద్రం తీరుపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.

"తెలంగాణకు మేలు జరగాలి. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. రాష్ట్రం బాగుండాలన్నదే మా సంకల్పం. పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడకపోవడం బాధేసింది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రథకాలను కేంద్రం అనుకరిస్తోంది. మనకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం ఎందుకు మాట్లాడటం లేదు?

పార్లమెంట్ ఎన్నికల్లో మాకు ఒక్క సీటు కూడా రాలేదని విమర్శిస్తున్నారు. మాకు వచ్చింది సున్నానే.. మరి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకి వచ్చింది గుండు సున్నా కాదా. కొట్లాడకపోతే కేంద్రం నిధులు ఇవ్వదు... పోరాడాల్సిందే. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు మేం కూడా మద్దతిస్తాం. సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. మేం కూడా అప్పట్లో కేంద్రంతో సఖ్యతతోనే ఉన్నాం. ఏమీ రాలేదు. తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు కేంద్రం ఒక్క రూపాయి అయినా ఇచ్చిందా? సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి. కుంభమేళాకు నిధులు ఇస్తున్న కేంద్రం.. సమ్మక్క-సారలమ్మ జాతరకు ఎందుకు ఇవ్వదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

స్థిరాస్తి రంగం కుప్పకూలింది

ఫార్మా సిటీపై ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. " ఒకసారి ఫ్యూచర్ సిటీ అంటారు. మరోసారి ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అంటారు. ఈ ప్రభుత్వ విధానాల వల్ల స్థిరాస్తి రంగం కుప్పకూలింది. వ్యాపారం జరగక స్థిరాస్తి వ్యాపారులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ తన సొంత అవసరాల కోసం నిర్మించలేదు. కాళేశ్వరం



కూలిపోతే.. మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తీసుకువస్తారు?

తులం బంగారం ఎక్కడ?

అద్దెలు చెల్లించకపోవడంతో గురుకుల భవనాలకు తాళాలు వేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే మేం కూడా చెల్లించాం. ఈ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చింది 11 వేల ఉద్యోగాలు మాత్రమే. మేం పరీక్షలు నిర్వహించిన వాటికే వీళ్లు నియామకపత్రాలు ఇచ్చారు. గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తామన్నారు.. చేయలేదు. కోటి మంది మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం కోసం ఎదురు చూస్తున్నారు.

పేరుకు ప్రజా పాలన.. చేసేది ప్రజా పీడన. విఫల పాలనకు విజయోత్సవాలు చేస్తున్నారు. ప్రజలు గోల్డ్ అని వీళ్లకు ఓట్లేశారు. కానీ, రోల్డ్ గోల్డ్ అని తేలింది. రేవంత్‌రెడ్డి ఎందుకు జైలుకెళ్లారు? స్వాతంత్ర్య పోరాటం చేసి ఆయన జైలుకు వెళ్లారా? మీ ఇంటిపై డ్రోన్ ఎగరేస్తే మీరు ఊరుకుంటారా? కుటుంబాలు మీకే ఉంటాయా.. మాకు ఉండవా? నేను కూడా తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ జైలుకు వెళ్లా" అని కేటీఆర్ అన్నారు.

## దళిత యువతిపై అత్యాచారం కేసు.. నిందితుడికి 27 ఏళ్లు జైలు శిక్ష

నల్గొండ: అత్యాచారం కేసులో నల్గొండ జిల్లా అదనపు సెషన్స్ ఎస్సీ, ఎస్టీ కోర్టు నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. ఒకే కేసులో వివిధ అంశాల ఆధారంగా 27 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. నిందితుడు.. దళిత యువతిని పెళ్లి పేరిట నమ్మించి అత్యాచారం చేశాడు. ఇందుకు పదేళ్లు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించింది. దళిత యువతిని మోసగించినందుకుగానూ మరో పదేళ్ల జైలు శిక్ష విధించింది. పెళ్లి పేరుతో మోసగించినందుకు మరో ఏడేళ్లు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది. మొత్తంగా 27 ఏళ్ల పాటు జైలు శిక్షను ఖరారు చేస్తూ నల్గొండ జిల్లా అదనపు సెషన్స్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు.



## రూ.10లక్షల కోట్లతో.. 25వేల కి.మీ రోడ్లు నాలుగు లైన్లుగా..: గడ్కరీ

దేశంలో 25 వేల కిలోమీటర్ల మేర రెండు లైన్ల జాతీయ రహదారులను (%చీఫ్అశీఖ్రీ ఎఅస్త్రష్ట్రఖ్రుఎం%) నాలుగు లైన్లుగా మారుస్తామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ (%చీఁఅఅ +ఖుఎఖ్రుతీఅ%) పేర్కొన్నారు. రూ.10 లక్షల కోట్ల వ్యయంతో ఈ పనులు చేపడతామని, తద్వారా రోడ్డు ప్రమాదాలు (%=శీఖుఎ ఖఎఎఅఎవత్ం%) గణనీయంగా తగ్గుముఖం పడతాయన్నారు. లోక్‌సభలో మాట్లాడుతూ.. రూ.6లక్షల కోట్లతో 16వేల కి.మీ జాతీయ రహదారులను ఆరు లైన్లుగా మార్చుతామన్నారు.

"రూ.10లక్షల కోట్లతో 25వేల కి.మీ మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వీటికి సంబంధించి డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. రెండేళ్లలో పనులు పూర్తవుతాయని భావిస్తున్నాం" అని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అవి పూర్తైన తర్వాత రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు.

మరోవైపు దేశంలో ఏటా 4.8లక్షల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి గడ్కరీ ఇటీవల వెల్లడించారు. వీటిలో 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన 1.88లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ ప్రమాదాల కారణంగా దేశ జీడీపీ ఏటా 3శాతం నష్టపోతోందన్నారు. 2030 నాటికి ఈ ప్రమాదాల సంఖ్యను సగానికి తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.



## భారత్.. అలాంటి వారికి ధర్మశాల కాదు: అమిత్ షా హెచ్చరిక

దిల్లీ: ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు- 2025కు ( లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడారు. విద్యా, వ్యాపార పరంగా భారత్‌లోకి విదేశీయులను ఆహ్వానిస్తామని అన్నారు. కానీ, దురుద్దేశంతో దేశంలోకి ప్రవేశించే వారి పట్ల కఠిన వైఖరితో ఉంటామని హెచ్చరించారు.

"విద్యా, వైద్యం, పర్యాటకం, వ్యాపారం చేయాలనుకునే విదేశీయులకు భారత్ రావాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుంది. దేశాభివృద్ధికి సహకరించే వారికి మేము ఎల్లప్పుడు సహకరిస్తాం. కానీ, దురాలోచనతో దేశంలోకి ప్రవేశించి.. హాని కలిగించాలనుకునే వారి పట్ల మోదీ సర్కారు కఠిన వైఖరి అవలంబిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని దేశంలో అడుగు పెట్టనివ్వం. అలాంటి వారికి మా దేశం ధర్మశాల కాదని గుర్తు పెట్టుకోవాలి" అని అమిత్ షా హెచ్చరించారు.

ఈ బిల్లు భారత్ సందర్శించే ప్రతి విదేశీయుడి గురించిన మొత్తం సమాచారాన్ని స్వీకరిస్తుందని షా తెలిపారు. అక్రమంగా మయన్మార్ నుంచి దేశంలోకి వచ్చే రోహింగ్యాలు, బంగ్లా దేశీయుల సంఖ్య పెరిగిపోయిందని.. వ్యక్తిగత ప్రయోజనాలతో లోనికి రానిస్తే అది భారత్‌కు సురక్షితం కాదని హితవు పలికారు.



భారతశక్తి
VOICE OF INDIAN

## జమిలీకి జై కొట్టేస్తున్నారు...

దేశంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చింది భారతీయ జనతా పార్టీ. 2014, 2019, 2024 ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టింది. అటు చాలా రాష్ట్రాల్లో సైతం రాగలిగింది. ఇంకొన్ని రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కలిసి అధికారాన్ని పంచుకుంటుంది. ఎలా చూసినా బిజెపి బలమైన శక్తిగా ఉంది. అందుకే ఈ శక్తిని పదిల పరుచుకునేందుకు బిజెపి సరికొత్త ప్రయోగం 'జమిలి' వైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ మాట చాలా రోజులుగా వినిపిస్తోంది. తెర వెనుక కార్యాచరణ జరుగుతోంది. అయితే తాజా పరిస్థితులను చూస్తుంటే మాత్రం బిజెపి జమిలి వైపేనని తేలిపోతోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ఆశించిన ఫలితాలు రాలేదు. బిజెపి సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ దాటుతుందని అంతా అంచనా వేశారు. కానీ జనాలు అవకాశం ఇవ్వలేదు. మ్యాజిక్ ఫిగర్ కు 40 సీట్లు దూరంగా బిజెపి ఉండిపోయింది. అటువంటి సమయంలోనే తెలుగుదేశం పార్టీతోపాటు నితీష్ పార్టీ అండగా నిలిచింది. అప్పుడే జమిలీ ఎన్నికల ఆలోచనకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. జమ్మూ కాశ్మీర్ తో పాటు ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురయ్యేసరికి జమిలి అంశం పక్కన పెట్టింది బిజెపి. తర్వాత మహారాష్ట్ర, 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రావడంతో జమిలిపై కదలిక వచ్చింది. వచ్చే ఎన్నికల్లో కూడా సత్తా చాటాలని బిజెపి భావిస్తోంది. తద్వారా కాంగ్రెస్ పార్టీకి ఉన్న రికార్డులను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇప్పుడు బిజెపి పరిస్థితి బాగుంది. ఆ పార్టీపై పాజిటివ్ ప్రచారం ఉంది. అందుకే ఇటువంటి సమయంలో జమిలి ఎన్నికల ద్వారా అనుకున్నది సాధించాలని చూస్తోంది. ఇప్పటికే జమిలి బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. ఆరు నెలల పాటు అధ్యయనం కూడా ముగిసింది. బిజెపి పాలిత రాష్ట్రాలే ఇప్పుడు ఎక్కువగా ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో బలమైన మిత్రపక్షాలు కూడా కొనసాగుతున్నాయి. అందుకే జమిలీపై ఏకాభిప్రాయానికి వచ్చి.. ముందస్తు ఎన్నికలకు సిద్ధపడుతోంది బీజేపీ. మరి కాషాయ దళం ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి. ప్రస్తుతం కేంద్రంలో పాలుపంచుకుంటున్న కీలక నేత చంద్రబాబు సైతం జమిలి కి జై కొట్టారు. అన్ని ఎన్నికలు ఒకేసారి జరిగితే ఖర్చు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. ఇది దేశానికి అవసరం కూడా అన్నారు. అయితే బిల్లు ప్రకారం, దేశంలో జమిలి ఎన్నికలు 2034 నుంచి జరిగే అవకాశముంది. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్టరూపం సంతరించుకున్నాక జరిగే సాధారణ ఎన్నికల అనంతరం ఏర్పడే లోక్‌సభ తొలి సిటింగ్ డేకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అపాయింటెడ్ డేగా పిలిచే ఆ రోజు తర్వాత ఏర్పడిన అన్ని అసెంబ్లీలు కూడా లోక్‌సభ కాలపరిమితితోపాటే ముగుస్తాయి. ఆ తర్వాత నుంచి లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలన్నీ ఏకకాలంలో జరుగుతాయి. లోక్‌సభగానీ, అసెంబ్లీగానీ పూర్తికాలం ముగియక ముందే రద్దయితే వాటికి 5 ఏళ్ల కాలంలో మిగిలిన సమయానికే ఎన్నికలు జరుగుతాయని బిల్లు పేర్కొంది. అందువల్ల జమిలి విధానం 2029 సార్వత్రిక ఎన్నికల తర్వాతే ఆచరణలోకి వస్తుంది. ఉదాహరణకు 2029 మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన అనంతరం ఏర్పడే 19వ లోక్‌సభ మొదటి సిటింగ్ తేదీని రాష్ట్రపతి జూన్ 1గా నిర్ధరిస్తే ఆ తర్వాత ఏర్పడే అసెంబ్లీలన్నీ ఆ లోక్‌సభతోపాటే ముగుస్తాయి. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. 2004 నుంచి కూడా వాటి ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటే జరుగుతున్నందున 2029, 2034లోనూ అదే విధానం కొనసాగుతుంది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు తదుపరి అసెంబ్లీ ఎన్నిక 2028 నవంబరు- డిసెంబరులో జరిగి 2033 నవంబరు వరకూ మనుగడలో ఉంటాయి. 2029లో ఏర్పడే 19వ లోక్‌సభ కాలపరిమితి 2034 మేలో ముగియనున్నందున 2033లో జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు, 2034 లోక్‌సభ ఎన్నికలకు మధ్య ఏర్పడే 6 నెలల వ్యవధికి రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. 2028 మే, జూన్ నెలల్లో జరిగే కర్ణాటక, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ లాంటి రాష్ట్రాల అసెంబ్లీలు 2033 మే, జూన్‌లలో ముగుస్తాయి. 2034తో జరిగే లోక్‌సభ ఎన్నికలతో వీటికి ఏడాది వ్యవధి ఉంటుంది కాబట్టి ఆ ఏడాదికే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా లేదంటే వాటికీ రాష్ట్రపతి పాలన అమలు చేస్తారా అన్నది చూడాలి. మిగిలిన రాష్ట్రాల్లోనూ ముందూ వెనుకా ఎన్నికలు ఉండటంతో ఏం చేస్తారన్నది వేచి చూడాలి. మరోవైపు బీహార్ లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. అక్కడ ఎన్డిఏ భాగస్వామ్య పక్షం అధికారంలో ఉంది. ఆ అసెంబ్లీ ఎన్నికలతో పాటు జమిలి జరిగితే తప్పకుండా సీఎం నితీష్ కుమార్ ఆహ్వానిస్తారు. అయితే ఈ విషయంలో పక్కా ఆలోచనతో అడుగులు వేస్తోంది భారతీయ జనతా పార్టీ. జమిలి ద్వారా సరికొత్త రికార్డులను క్రియేట్ చేయాలని చూస్తోంది.

# పోలవరం బనకచర్ల ప్రాజెక్టు అడుగులు

ఒంగోలు, మార్చి 27,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్న పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుల అనుసంధానానికి 81,900 కోట్లు ఖర్చు అవుతుందని లెక్కలు తేల్చింది ప్రభుత్వం. అయితే ఈ భారం రాష్ట్ర ఖజానాపై పడకుండా "ఆపరేషన్ మోడల్"లో అనుసంధానాన్ని పూర్తి చేయనుంది. దీనికి సంబంధించిన ఒక రూట్ మ్యాప్‌ని రెడీ చేస్తోంది ఏపీ ప్రభుత్వం. దీనికి సంబంధించిన అన్ని అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. గోదావరి జలాలను పోలవరం నుంచి లిఫ్టుల ద్వారా తరలించేందుకు అయ్యే విద్యుత్ వినియోగాన్ని ప్రాజెక్టు ప్రాంతంలోనే పంప్డ్ స్టోరేజ్, సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పడం ద్వారా ఉత్పత్తి చేసి భారం తగ్గించవచ్చని చెప్పారు. దీనిపై సోమవారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుల అనుసంధానానికి సంబంధించి డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఈ ఏడాది జూన్ 20 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదే ఏడాది అక్టోబర్ 20 కల్లా ప్రాజెక్టుకు సీడబ్ల్యుసీ ఆమోదం పొందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు. పర్యావరణ అనుమతులు కూడా పొంది, త్వరగా పనులు ప్రారంభించాలని చెప్పారు. పోలవరం-బనకచర్ల అనుసంధానానికి మొత్తం రూ.81,900 కోట్లు ఖర్చుకానుంది. ఈ అనుసంధానం ద్వారా రోజుకు 2 టీఎంసీలు డిశ్చార్జ్ అవుతుంది. 368.60 కిలోమీటర్లు ఓపెన్ కెనాల్ ద్వారా నీరు తరలిస్తారు. మెయిన్ టన్నెల్ 20.50 కిలోమీటర్లు ఉండగా, సిద్ధాపురం ట్విన్ టన్నెల్స్ 6.60 కిలోమీటర్లు, పైపులైను 17 కిలోమీటర్ల వరకు నిర్మిస్తారు. దీని కోసం మొత్తం 9 లిఫ్టులు వినియోగిస్తారు. 3,377 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు 15,300 ఎకరాల అటవీ భూమితో కలిపి మొత్తం 54,000 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. అలాగే బొల్లాపల్లి రిజర్వాయర్ కోసం 5 గ్రామాల్లో 18 నివాస ప్రాంతాల వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. ఈ అనుసంధాన ప్రక్రియను ప్రభుత్వం మొత్తం 3 సెగ్మెంట్లుగా చేపట్టనుంది. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజ్ దిగువన ఉన్న పవిత్ర సంగమం వరకు తాడిపూడి వరద కాలువ ద్వారా 175 కిలోమీటర్ల వరకు 18,000 క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తరలిస్తారు. దీనికి 1,401 ఎకరాల భూమి అవసరం అవుతుంది. దీని కోసం రూ.13,800 కోట్లు ఖర్చు కానుంది. వైకుంఠపురం నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు 23,000 క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తీసుకువెళ్తారు. ఇందుకు ఓపెన్ కెనాల్ 83.40 కిలోమీటర్లు, 12.05 కిలోమీటర్లు పైపులైన్, 6 లిఫ్టులు నిర్మిస్తారు. 2,493 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తారు. 230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ సెగ్మెంట్‌లోని బొల్లాపల్లి రిజర్వాయర్‌కు 152 టీఎంసీల లైవ్ స్టోరేజ్ సామర్థ్యం ఉంటుంది. ఇందుకు రూ.35,750 కోట్ల వ్యయం అవుతుంది. బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు 23,000 క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తరలిస్తారు. ఇందుకు ఓపెన్ కెనాల్ 109.80 కిలోమీటర్లు, పైపులైన్ 5.7 కిలోమీటర్లు, మెయిన్ టన్నెల్, సిద్ధాపురం ట్విన్ టన్నెల్స్ నిర్మిస్తారు. దీనికి రూ.32,350 కోట్ల ఖర్చు అవుతుంది. పోలవరం-బనకచర్ల అనుసంధానం పూర్తైతే రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలు ఇవే. మొత్తం 12.4 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుంది. కాలువ ప్రవహించే సుమారు 400 కిలోమీటర్లు పొడవునా ఉన్న గ్రామాలకు తాగునీటి సమస్య తీరడంతోపాటు భూగర్భ జలాలు పెరుగుతాయి. అలాగే 430 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. బొల్లాపల్లి రిజర్వాయర్‌లో మత్స్యసంపద... ఇలా వివిధ మార్గాల్లో ఏడాదికి రూ.12,294 కోట్ల సంపద సృష్టి జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. మరి ఏపీ ప్రభుత్వం వేస్తున్న ఈ అంచనాలు ఏ మేరకు సాకారం అవుతాయో చూడాలి

# లిక్కర్ స్కామ్ డొంక కదులుతోంది...

రాజమండ్రి, మార్చి 27,

వైసీపీ అధినేత జగన్ కు లిక్కర్ స్కామ్ మెడకు చుట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. లిక్కర్ స్కామ్ లో దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల మేరకు కుంభకోణం జరిగినట్లు నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు లోక్ సభలో ప్రస్తావించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ స్కామ్ పై వేగంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. లిక్కర్ స్కామ్ పై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరాలా? లేక సిట్ ను ఏర్పాటు చేసి విచారణ చేయించాలా? అన్న దానిపై చంద్రబాబు నేడో, రేపో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఈరోజు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి చర్చించడం కూడా దీనికి ప్రాధాన్యత లభించింది. గత జగన్ హయాంలో వైసీపీ ప్రభుత్వమే లిక్కర్ షాపులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించింది. లిక్కర్ షాపులను నిర్వహించడమే కాకుండా కేవలం నగదు లావాదేవీలను మాత్రమే



అనుమతించింది. ఐదేళ్ల పాటు డిజిటల్ లావాదేవీలను అనుమతించకపోవడంతో అప్పటి కూటమి పార్టీల నేతలు కూడా లిక్కర్ లో భారీగా స్కామ్ జరిగినట్లు ఆరోపించారు. ఎన్నికలకు ముందు విమర్శలు చేశారు. నగదును మందుబాబుల నుంచి వసూలు చేసి వైసీపీ అగ్రనేతల ఇళ్లకు వెళ్లాయన్న ఆరోపణలు కూడా చేశారు. ఇదే సమయంలో లిక్కర్ దుకాణంలో అప్పుడు ప్రయివేటు సిబ్బందిని నియమించడంతో పాటు వారు వసూలు చేసిన డబ్బులు ఎక్కడకు వెళ్లాయన్న దానిపై విచారణ ప్రారంభం కానుంది. అయితే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాత్రం దుబాయ్ కు నాలుగు వేల కోట్ల రూపాయలు మద్యం ద్వారా వచ్చిన డబ్బులు పంపారని, మనీలాండరింగ్ కు పాల్పడ్డారంటూ ఆరోపణలు చేయడమే కాకుండా కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలసి ఈడీ దర్యాప్తునకు ఆదేశించాలని ఆయన కోరడంతో ఇప్పుడు ఈడీ, సీబీఐ చేత దర్యాప్తు చేయించుతారా? లేక రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేకంగా సిట్ ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టి చర్యలు చేపడుతుందా? అన్నది నిర్ణయం జరగకపోయినా రెండు మూడు రోజుల్లోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ మద్యం స్కామ్ లో ఉన్న సునీల్ రెడ్డి కోసం కూడా గాలింపు చర్యలు చేపట్టాని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ప్రముఖ బ్రాండ్లను తొలగించడం, నాసిరకం బ్రాండ్లను పెట్టడంతో పాటు 20,356 కోట్ల విలువైన మద్యం అమ్మకాలను గోప్యంగా నిర్వహించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిస్టలరీ కంపెనీల వద్ద నుంచి పెద్దయెత్తున ముడుపులు స్వీకరించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అతి పెద్ద కుంభకోణమని టీడీపీ నేతలు పదే పదే చెబుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వమే ఈ దర్యాప్తు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. సీబీఐ అంటే మళ్లీ జాప్యం జరిగే అవకాశముందని భావించి రాష్ట్ర ప్రభుత్వమే స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసి జగన్ ను అరెస్ట్ చేయడానికి అవసరమైన అన్ని దారులు వెతుకుతున్నట్లే కనిపిస్తుంది. దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించే పనిలో అధికారులున్నట్లు తెలిసింది.

# ప్రవీణ్ మృతికి ఆ రెడ్ కారే కారణమా...

రాజమండ్రి, మార్చి 27

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వద్ద వద్ద పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ చనిపోయి కనిపించడం తెలుగు రాష్ట్రాలను షేక్ చేస్తోంది. ప్రవీణ్‌ది రోడ్డు ప్రమాదమని అనుకున్నప్పటికీ పాస్టర్లు మాత్రం ఇది హత్యగా అనుమానిస్తున్నారు. అందుకే ఈ కేసు చాలా సీరియస్ అయింది. ప్రభుత్వం కూడా సమగ్ర విచారణకు ఆదేశించింది. ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్న పోలీసులు వివిధ కోణాల్లో కేసు విచారణ చేస్తున్నారు. అర్ధరాత్రి వేల చనిపోయినట్టు గుర్తించిన పోలీసు?ల ఆ టైంలో ఏం జరిగిందో తెలుసుకుంటున్నారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ నేతృత్వంలో ఇద్దరు సీఐలు, ఎస్సైలతో కూడిన టీం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. ఇప్పటి వరకు జరిగిన విచారణలో కీలకమైన ఆధారాలు సేకరించారు. ఇంకా ఎవరి వద్దైనా ఆధారాలు ఉంటే పోలీసులకు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. కొవ్వూరు టోల్ గేట్ సమీపంలో ప్రవీణ్ టూవీలర్‌పై వెళ్తున్న సీసీటీవీ ఫుటేజ్ లభించింది. వాటి ఆధారంగా కేసును ఎనలైజ్ చేసిన పోలీసులు రాత్రి సోమవారం రాత్రి 11.43 గంటలకు ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నారు. టోల్ గేట్ నుంచి 11.31 నిమిషాలకు బయల్దేరిన తర్వాత ప్రమాదం జరిగిన 11. 43 నిమిషాల మధ్య ఏం జరిగిందనేది ఇప్పుడు కేసులో కీలకం. ఈ టోల్‌గేట్‌ను దాటుకొని ప్రవీణ్ వెళ్లిన వాహనంతోపాటు మరికొన్ని వాహనాలు అదే టైంలో అటుగా వెళ్లాయి. ఐదు వాహనాల్లో ఓ రెడ్ కలర్ కారు కూడా ఉంది. అది ప్రవీణ్ టూతోపాటే ముందుకు మూవ్ అయింది. ఇప్పుడు పోలీసులు ఆ కారుపై కూడా ఫోకస్ పెట్టారు. ఆ కారులో ఎవరు ప్రయాణించారు. మిగతా వాహనాలపై కూడా దృష్టి పెట్టారు. ప్రవీణ్ కుమార్ ఫోన్ కాల్‌డేటాను కూడా పోలీసులు ఎనాలసిస్ చేస్తున్నారు. ఆఖరి కాల్ రామ్మోహన్ ఆర్‌జేవైకి వెళ్లిందని పోలీసులు చెప్పారు. డెడ్‌బాడీ గురించి తెలిసిన తర్వాత ఆఖరి ఫోన్‌కాల్ చేసిన వ్యక్తికే ఫోన్ చేసి రప్పించారు. రామ్మోహన్ అతని భార్య వచ్చారు. వచ్చిన తర్వాత డెడ్‌బాడీ ప్రవీణ?కుమార్‌ది అని అన్నారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు. హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్‌కుమార్ తెలుగు రాష్ట్రాల్లోనే పెను సంచలనంగా మారింది. హైదరాబాద్ నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు అనుమాస్పద మృతిగా కేసు పెట్టారు. ఓవైపు కుటుంబ సభ్యులు, మరోవైపు పాస్టర్ల డిమాండ్‌తో ఈ కేసులో సమగ్ర దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. కుటుంబ సభ్యుల సమక్షంలోనే పోస్టుమార్టం కూడా పూర్తి చేశారు. ప్రస్తుతానికి పోలీసులు విచారిస్తున్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ మేజిజస్ట్రేట్‌తో దర్యాప్తు చేయనున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. మృతదేహం తీసుకెళ్లకుండానే పాస్టర్లు ఆందోళన చేపట్టారు. దీనిపై చాలా అనుమానాలు ఉన్నాయని ప్రభుత్వం, అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న వారిని, కుటుంబ సభ్యులను ఒప్పించి డెడ్‌బాడీని హైదరాబాద్‌కు తరలించారు. ప్రవీణ్ మరణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనితగ్ర్భాంతి వ్యక్తం చేశారు. కచ్చితంగా ఇది హత్య అయితే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# మైనింగ్ అక్రమాలపై 76 పేజీల నివేదిక

కర్నూలు, మార్చి 27,

వైసీపీ హయంలో ఆంధ్రప్రదేవ్ డిజిటల్ కార్పొరేషన్‌లో భారీగా అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ శాఖ విచారణలో గుర్తించారు. దర్యాప్తు నివేదిక ప్రభుత్వానికి చేరింది. అక్రమాలకు



బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. వైసీపీ ప్రభుత్వ హయంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరింది. నాటి వీసీ ఎండీ వాసుదేవరెడ్డితో పాటు అక్రమాలకు బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వానికి నష్టం కలిగించిన వారిపై న్యాయపరమైన చర్యలతో పాటు క్రమశిక్షణ చర్యలకు కమిషన్ సిఫార్సు చేసింది. ఏపీ డిజిటల్ కార్పోరేషన్‌లో లేని ఉద్యోగులకు జీతాల చెల్లింపు మొదలుకుని ప్రతి వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ గుర్తించింది. ఫలితంగా నాలుగేళ్లలో దాదాపు రూ.171 కోట్ల రుపాయల దుర్వినియోగం అయ్యాయని వాటిలో రూ.139 కోట్ల రుపాయలు ఇప్పటికే చెల్లింపులు జరిపినట్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సీఐడీ, ఏసీబీతో దర్యాప్తు జరపాలని విజిలెన్స్ నివేదిక పేర్కొంది. ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో కోట్లాది రుపాయల దుర్వినియోగమైనట్టు తేలడంతో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ వీసీ ఎండీగా వ్యవహరించిన చిన్న వాసుదేవరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా విజిలెన్స్ సిఫార్సు చేసింది. వీడియో కంటెంట్ తయారీ పేరుతో భారీగా డబ్బు దుర్వినియోగం చేశారని ఇందుకు బాధ్యులైన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. డేటా మోటిఫ్ డిజిటల్ మీడియా, జిపిఆర్ పబ్లికేషన్స్, డెక్కన్ మీడియా, సాయి నందిని టెక్నో క్రియేషన్స్, షాలోక్ ఎంటర్‌టైన్‌మెంట్స్, అవిసా మీడియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సాయి అడ్వర్‌టైజింగ్, ఆర్ఆర్ మీడియా అడ్వర్‌టైజింగ్, త్రీ అటమ్ లీవ్స్ సంస్థలు మోస పూరితంగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా చేశారని విజిలెన్స్ నివేదిక ఆరోపించింది. డెక్కన్ మీడియా, త్రీ అటమ్ లీవ్స్ స్టోరీ టెల్లింగ్ సంస్థలు జిఎస్టీ ఎగవేతలకు పాల్పడ్డారని, నగదు చెల్లింపుల్లో జరిగిన అక్రమాలను సరి చేయాలని విజిలెన్స్ నివేదికలో సిఫార్సు చేశారు. ఏపీడీసీ కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో సీఐడీ, ఏసీబీ దర్యాప్తు జరపాలని విజిలెన్స్ నివేదిక అభిప్రాయపడింది. ఏపీడీసీలో జరిగిన అక్రమాలకు అప్పటి వీసీ ఎండీ చిన్న వాసుదేవరెడ్డి బాధ్యుడని విజిలెన్స్ నివేదిక పేర్కొంది. ఐ డ్రీమ్ వ్యవస్థాపకుడైన చిన వాసుదేవరెడ్డి ఐపాక్, ఐ డ్రీమ్ ఉద్యోగులను ఏపీడీసీలో ఉద్యోగులుగా చూపినట్టు విజిలెన్స్ నివేదిక పేర్కొంది. అనుభవం, అర్హతలు లేని వారిని ఉద్యోగులుగా నియమించడంలో వాసుదేవ రెడ్డి కీలకంగా వ్యవహరించారని విజిలెన్స్ ఆరోపించింది. లేని సంస్థలకు చెల్లింపులు జరపడం ద్వారా రూ. 37.20కోట్లను ఖర్చు చేసి ప్రభుత్వానికి నష్టం కలిగించారని పేర్కొంది. డేటా మోటిఫ్, జిపిఆర్ పబ్లికేషన్స్, డెక్కన్ మీడియా, సాయి నందిని క్రియేషన్స్, త్రీ ఆటమ్ లీవ్స్, అవిసా మీడియా, సాయి అడ్వర్టైజింగ్, షాలోక్ ఎంటర్‌టైన్‌మెంట?, ఆర్ఆర్ మీడియా సంస్థలకు లబ్ది చేకూర్చినట్టు పేర్కొన్నారు. ఏపీడీసీలో అక్రమాలను చూసి చూడనట్టు వదిలేసినందుకు, అర్హత లేని వారిని ఉద్యోగాల్లో నియమించినందుకు.. సెలక్షన్ కమిటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై లీగల్ యాక్షన్‌తో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. వీరిలో ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ సభ్యుడు ఐఆర్ఏఎస్ అధికారి మధుసూదన్ రెడ్డి, కె.హేమచంద్రారెడ్డి, పి.ప్రతాప్, ఐ అండ్ పీఆర్ సీఈ ఓ.మధుసూదన, చీఫ్ డిజిటల్ డైరెక్టర్ బ్రహ్మానంద పాత్ర, ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఉద్యోగి మోతీలాల్ నాయక్, బి.నాగేశ్వరరావు. రాధాకృష్ణ, రామసుబ్బయ్య, జి.వి రామకృష్ణారావు, ఏవీసుబ్బారెడ్డి, భూమిరెడ్డి శ్రీ వర్ధన్ రెడ్డి, పాలేశ్వరరావు, గంగవరపు సుధీర్ కుమార్, దీపిక పొన్నకంటి, శశికృష్ణ పొన్నకంటి, తాడుక అరవింద్, చెన్ను మౌనిక, నాగ భూషన్ రెడ్డి, త్రీ అటామ్ లీవ్స్ సంస్థలపై న్యాయపరమైన చర్యలకు సిఫార్సు చేశారు.

76 పేజీల నివేదిక?

డిజిటల్ కార్పోరేషన్ పేరుతో రూ.171.9 కోట్లను ఖర్చు చేయగా వాటిలో రూ.139.28కోట్లను విడుదల చేశారు. ఏపీడీసీలో జరిగిన అక్రమాలపై 76 పేజీల నివేదికను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ప్రభుత్వానికి అందచేసింది. యాత్ర 2 సినిమాలో నటించిన మళయాళ నటుడు మమ్ముట్టికి కూడా రూ.50లక్షల రుపాయలు ఏపీడీసీ నుంచి చెల్లింపులు జరిపినట్టు విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. వీడియో కంటెంట్ తయారీ పేరుతో భారీగా నిధులను మళ్ళించారు. తాత్కలిక ఉద్యోగులుగా చేరిన వారిలో కొందరికి అనూహ్య ప్రయోజనాలు చేకూర్చినట్టు నివేదిక పేర్కొంది. న్యాయమూర్తులను దూషించిన కేసులో సీబీఐ అరెస్ట్ చేసిన నిందితులకు కూడా ఏపీడీసీలో ఉద్యోగులుగా కొనసాగినట్టు విజిలెన్స్ గుర్తించింది.

# కాకాణికి బిగిస్తున్న ఉచ్చు

నెల్లూరు, మార్చి 27,

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వరుసగా కేసుల్లో ఇరుక్కుంటున్నారు.. నెల్లూరు జిల్లా వైసీపీలో అంతో ఇంతో యాక్టివ్‌గా ఉన్న కాకాణి చుట్టూ ఉచ్చు బిగుస్తుండటం పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతోంది.. తాజాగా క్వార్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో మాజీ మంత్రిపై కేసు నమోదు చేశారు. మరోవైపు ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఎంపీ సంతకాల ఫోర్జరీ కేసులో సైతం కాకాణిని నిందితుడిగా చేర్చే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ కుంభకోణం వెనుక కూడా కాకాణి హస్తం ఉన్నట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ పరిణామాలతో కాకాణికి కష్టకాలం తప్పదంటున్నారు.మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టుకు రంగం సిద్దమైనట్లు జరుగుతున్న ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది . ఇప్పటివరకు జిల్లాలో ఇద్దరూ మాజీ మంత్రులు కాకాణి, సోమిరెడ్డిల మధ్య కొనసాగుతున్న మాటల యుద్దం పోలీసుల రికార్డులకు ఎక్కింది. ఓ మైన్ ని కొల్లగొట్టి అక్రమంగా 250 కోట్ల రూపాయలకు పైగా దోచేసినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపణలు మేరకు మైనింగ్, పోలీసు అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఈ అభియోగంపై కేసులు కూడా నమోదు చేశారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈ కేసులో నాలుగో నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టు త్వరలోనే ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.వైసీపీ ప్రభుత్వ హయాంలో సైదాపురం మండలం పరిధిలో ఉన్న మైన్లలో భారీగా తవ్వకాలు జరిగాయి. ఆ క్రమంలోనే పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్జ్ ఖనిజం కొల్లగొట్టినట్లు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. అక్కడ కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద రాష్ట్ర సరిహద్దులు దాటింది. ఇతర దేశాల్లో ఆ ఖనిజానికి డిమాండ్ బాగా ఉండటంతో ధర కూడా బాగానే పలికిందంట. దాంతో మైనింగ్ నిర్వహించిన వారు కోట్లకు పడగలెత్తారు.అదంతా అక్రమమని గతంలోనే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్ర మైనింగ్ శాఖతో పాటు కేంద్ర మైనింగ్ శాఖలకు కూడా ఫిర్యాదు చేశారు. 250 కోట్ల విలువైన ఖనిజ సంపాదన దోచుకున్నారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. అప్పట్లో ప్రభుత్వం వైసీపీది ఉండడంతో కాకాని గోవర్ధన్ రెడ్డి పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వైసిపి ప్రభుత్వంలో ఇదే రుస్తుం మైన్స్ వద్ద సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి క్వార్జ్ ఖనిజం అక్రమంగా తరలిపోతుందని మూడురోజులపాటు సత్యాగ్రహ దీక్ష కూడా చేశారు. మైనింగ్ లోడ్లతో రవాణాకు సిద్ధంగా ఉన్న 40 లారీలను టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. అప్పట్లో అది పెద్ద కలకలమే రేపింది.వైసీపీ ప్రభుత్వంలో న్యాయం జరగదని భావించిన సోమిరెడ్డి కేంద్ర మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేశారు. కేంద్రం



ఆదేశాలకు తోడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ కేసుకు ప్రాణం వచ్చింది. ఇటీవల ఇదే అంశాన్ని ఆయన అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. తనపై హిజ్రాలతో దాడి చేపించారని చెప్పుకొచ్చారు. ఆ క్రమంలో తాజాగా ఈ మైన్స్ నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టి దోచుకున్నారంటూ మైన్స్ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు.అప్పటి వరకు ఆ క్వారీ వైపు కన్నెత్తి కూడా చూడని మైనింగ్ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి దోచుకుపోయిన క్వార్జ్ విలువ రూ.250 కోట్లకు పైగా ఉంటుందని లెక్కలు కట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మొదట ముగ్గరిపై కేసు కట్టారు. కాకాణి ప్రధాన అనుచరులు ముగ్గరి పేర్లతో తొలుత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఈ ముగ్గరు పోలీసులు తమ వద్దకు రాకముందే హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. తాజాగా మరో ఏడుగురిని ఈ కేసులో చేర్చారు.ప్రస్తుతం ఈ అంశం నెల్లూరు జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా వైసీపీ నేతలు అరెస్ట్ అవుతున్న నేపథ్యంలో కాకాణి అరెస్టు ఖాయమన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంతో కాకాణి ముందు వరుసలో ఉంటున్నారు. అందుకే కూటమి ప్రభుత్వం ఆయనపైన దృష్టి పెట్టిందంటున్నారు. మరోవైపు ఈ కేసు పై కాకాని గోవర్ధన్ రెడ్డి స్పందిస్తూ.. కేసుల నమోదు కొత్త విషయం ఏమి కాదని.. కేసులు పెట్టి బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదంటుండటం విశేషం.ఈ అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని కాకాణి స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే మాజీ మంత్రి కాకాణి చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఎంపీ సంతకాల ఫోర్జరీ కేసులో సైతం కాకాణిని నిందితుడిగా చేర్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ గమనిస్తే గత ప్రభుత్వంలో మంత్రిగా నెల్లూరు జిల్లాలో చక్రం తిప్పిన కాకాణికి జైలు గండం పొంచి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# భద్రాచలం భవనం కూలిన ఘటనలో ఒక కార్మికుడు మృతి

భద్రాచలం

భద్రచలంలో ఒక భవనం కూలిన ఘటనలో కార్మికుడు మృతి చెందాడు. దాదాపు పదకొండున్నర గంటల పాటు శిథిలాల కింద చిక్కుకొని, కామేష్ మృత్యువుతో పోరాడాడు. రెస్క్యూ చేసి కాపాడిన 10 నిమిషాలకే కామేష్ మృతి చెందాడు. భవన శిథిలాల కింద నుంచి రక్షించి, హుటాహుటిన భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించగాఅక్కడ కామేష్ మృతి చెందాడు. శిథిలాల కింద మరొకరు చిక్కుకున్నట్టు సమాచారం. మొదట ఆరుగురు మృతి చెందినట్లు వార్తలు వచ్చినా.. ఇద్దరు మాత్రమే చిక్కుకున్నారని, అందులో ఒకరు మృతి చెందారని అధికారులు నిర్ధారించారు.

# రాగి పాత్రల్లో నీళ్లు తాగితే ఎంతో ఆరోగ్యం

రాగి పాత్ర... అంటే ఏంటి అని అడిగే వాళ్ళు కూడా ఉంటారు ఈ రోజుల్లో. ఎందుకంటే... ఇపుడంతా ప్లాస్టిక్, గాజు గ్లాసులే ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. వీలైతే పేపర్ గ్లాసులు కూడా వాడేస్తున్నారు. కానీ, రాగి పాత్రలో మంచినీళ్ళు తాగితే ఎంత మంచిదో తెలుసా? ఇది బ్యాక్టీరియాను అరికడుతుందని పరిశోధనలో తేలింది.రాబ్ రీడ్ అనే మైక్రో బయాలజిస్ట్ ప్లాస్టిక్, మట్టి, రాగి పాత్రలలో విరోచనాకారి అయిన బాక్టీరియాతో కూడిన నీటిని వాటిలో ఉంచి, 48 గంటల తరువాత ఆ నీటిపై పరిశీలన చేశాడు. రాగి పాత్రలో ఉంచిన నీళ్ళలో బాక్టీరియా శాతం తగ్గింది. అదే ప్లాస్టిక్, మట్టి పాత్రలో ఉన్న బాక్టీరియా శాతం రెండింతలు అయ్యింది.

రాగి పాత్ర వల్ల ఉపయోగాలు:జీర్ణ వ్యవస్థకు మంచిది: రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అసిడిటీ, గ్యాస్, అజీర్ణం వంటివి తగ్గడమే కాకుండా, కడుపుకి హాయి కలిగించి, ప్రాణాంతకరమైన బాక్టీరియాను కూడా నిర్మూలిస్తుంది. కిడ్నీ, లివర్ చురుకుగా పనిచేయడంలో తోడ్పడుతుంది.

బరువు తగ్గిస్తుంది: మనం అధిక బరువు తగ్గడానికి రకరకాల పండ్లు, కూరగాయలు వంటివి తింటూ ఉంటాం. కాని వాటివల్ల వచ్చే ప్రయోజనాల కన్నా, వాటికి ఖర్చుపెట్టిన డబ్బు వ్యర్థం అయిందన్న దిగులే ఎక్కువ. రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అది జీర్ణ వ్యవస్థను సరైన మార్గంలో నడిచేలా చేసి, కొవ్వు మరియు ఇతర చెడు బాక్టీరియాను శరీరం నుండి తీసేస్తుంది.

గాయాలను త్వరగా నయం చేస్తుంది: రాగిలో ఉండే యాంటి-బాక్టీరియాతత్వం శరీరంలోని అనేక గాయాలను వేగంగా నయం చేయడంతోపాటు రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరిచి, శరీరంపై ఉన్న గాయాలనే కాకుండా లోపల ఉన్న గాయాలను, ముఖ్యంగా కడుపులో ఉన్న గాయాలను కూడా తగ్గించడంలో సహాయం చేస్తుంది.

వయసును దాచేస్తుంది: కొంతమంది ఆరోగ్యపరంగా ఎంత చురుకుగా ఉన్నా వారి వయసుకు మించి కనిపిస్తూ ఉంటారు. ఈ సమస్య నుంచి బాధపడేవారు చాలామంది ఉన్నారు. ఇలాంటి వారు రాగి నుండి ఉత్పత్తి అయ్యే ప్రయోజనాలతో వారి సమస్య నుండి విముక్తి లభిస్తుంది. ముఖంపై ఉన్న మచ్చలు, ముడతలు వంటివి రాగి తగ్గిస్తుంది. క్యాన్సర్ వ్యాధి నుండి పోరాడుతుంది: రాగిలో ఉండే యాంటి-ఆక్సిడెంట్స్ క్యాన్సర్ వంటి ప్రాణాంతకరమైన రోగాల నుండి కాపాడుతాయి. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వారు చేసిన పరిశోధనాల ప్రకారం రాగి క్యాన్సర్‌ను ఎలా రానివ్వకుండా చేస్తుందో కనుగొనలేకపోయారు. కాని రాగి నిరంతరం క్యాన్సర్ వ్యాపింపజేసే వైరస్‌ను అడ్డుకోవడంలో తోడ్పడుతుందని ఆ పరిశోధనల్లో తేలిం మెదడును మెరుగుపరుస్తుంది: మన శరీర భాగంలో అతి ముఖ్యమైన అవయవాల్లో ఒకటి మెదడు. మనిషి శరీరంలో ప్రతీ ఒక్క భాగానికి మెదడుతో సంబంధాలు కలిగి ఉంటాయి. మెదడు నుండి ఆయా భాగాలకు న్యూరాన్ల ద్వారా సంకేతాలు అందుతాయి. ఈ న్యూరాన్లను మైలిన్ తొడుగు కాపాడుతుంది. రాగిలో ఉండే విలువైన పదార్థాలు ఈ మైలిన్ తొడుగును కపాడంతోపాటు, మెదడును చురుకుగా, యవ్వనంగా తయారుచేస్తుంది. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ వారి ప్రకారం రాగిని రోజుకు 12మి.గ్రా కన్నా ఎక్కువ తీసుకునే అవసరం లేదు అంటే రాగి పాత్రలో కనీసం 8 గంటలు ఉంచిన మంచి నీటిని రోజుకి 3 నుంచి 4 సార్లు తీసుకుంటే సరిపోతుంది. అలాగే రాగి పాత్రని సబ్బుతో కాకుండా సగం కోసిన నిమ్మ చెక్కతో లేదా వంట సోడాతో రుద్ది నీటితో కడిగితే సరిపోతుంది.

# అఘోరీతో బీటెక్ యువతి జంప్

విజయవాడ, మార్చి 27

తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరీ గురించి తెలియని వారు ఉండరు. ఆ మధ్య ఆమె వరుసగా ఆలయాలకు వెళ్లి అక్కడ నానా హంగామా చేసింది. అయితే కొద్దిరోజులుగా ఆమె పెద్దగా కనిపించడం లేదు. అయితే తాజాగా గుంటూరు జిల్లా మంగళగిరిలో బిటెక్ చదువుతున్న విద్యార్థిని అఘోరీగా మారటానికి ఇంటిలో నుంచి వెళ్ళిపోవడం కలకలం రేపుతోంది. ప్రియదర్శిని కాలేజ్ లో బిటెక్ చదివిన విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం మంగళగిరికి వచ్చిన లేడీ అఘోరీతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత కొద్దీ రోజుల పాటు విద్యార్థిని ఇంట్లోనే అఘోరీ బస చేసింది. ఆ క్రమంలో అఘోరికీ, యువతికి మధ్య సాన్నిహిత్యం పెరిగింది.రెండు రోజుల క్రితం మేజర్ అయిన యువతి తాను అఘోరీగా మారటానికి హైదరాబాద్ వెలుతున్నట్లు పోలీసులకు చెప్పి వెళ్ళింది. తాను మేజర్‌ను అని, అయితే తన తల్లిదండ్రులకు తాను అఘోరీగా మారటం ఇష్టం లేదని దీంతో ఇల్లు విడిచి వెళ్ళిపోతున్నట్లు చెప్పింది యువతి తండ్రి కోటయ్య పోలీసులను ఆశ్రయించాడు. తన కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే అంతకుముందే ఆ యువతి పోలీసులకు తాను వెళ్ళిపోతున్నట్లు చెప్పడంతో అదే విషయాన్ని పోలీసులు తల్లిదండ్రులుకు చెప్పారు. దీంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తమ కూతూరిని అఘోరి వశపరుచుకుందని ఆరోపించారు. అఘోరి చెర నుంచి తమ కూతురును విడిపించి తమకు అప్పగించాలని వేడుకుంటున్నారుఅఘోరీ తమ కూతురిని కిడ్నాప్ చేసిందని పేరెంట్స్ ఆరోపించారు. గత కొన్ని రోజులుగా శ్రీ వర్షిణి అఘోరీతోనే ఉంటోందని.. తన కూతురికి మత్తు మందు ఇచ్చి అఘోరీ తన వశం చేసుకుందని తండ్రి కోటయ్య ఆరోపిస్తున్నారు. లేడీ అఘోరీ తమ కూతురిని కిడ్నాప్ చేసిందని.. తమ మాట వినడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యల పరిష్కారానికే పబ్లిక్ గ్రీవెన్స్ నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలో పలు స్థలా వివాదాలు పై రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా,చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే వీటి పై విచారణ చేసి,కబ్జాకు పాల్పడిన వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్లు,రేషనకార్డులతో ప్రజలు అధిక సంఖ్యలో వినతులు అందించారు. ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు విన్నవించారు.కొన్ని సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అక్కడిక్కడే పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీ నేతల భూ అక్రమాలు భారీగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. వారి పై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం ప్రజలకోసం ఆలోచిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందన్నారు. కళ్లుండి చూడలేని నాయకుడు జగన్మోహనరెడ్డి అన్నారు. సంక్షేమమే అభివృద్ధిగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి - సిపిఎం

తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ లెక్క దాకల సర్వే నెంబర్ 398/12లో 0.05 సెంట్లు దళితుల భూమిని కొందరు అధికార పార్టీ కి చెందిన స్థానిక నాయకులు దళితులపై రాడ్లతో దాడి చేసి రక్తం వచ్చేలా కొట్టి ఆ భూమిలో నిర్మాణం చేపడుతున్నరు

# ఇంటర్ పరీక్షా విధానంలో మార్పులు

విజయవాడ, మార్చి 27

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్ష విధానంలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. వీటిని 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు. మొదటిసారిగా ఇంటర్ విద్యలో ఒక్క మార్కు ప్రశ్నలను ప్రవేశపెడుతున్నారు. ఈ మేరకు ఇంటర్ సిలబస్, ప్రశ్నపత్రాల నమూనాలో ఇంటర్మీడియట్ బోర్డు పలు మార్పులు చేసింది. ఈ మార్పుల వివరాలను తాజాగా జూనియర్ కళాశాలలకు పంపింది. ఇంటర్ మొదటి ఏడాదిలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశపెడుతున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్ తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని వచ్చే ఏడాదికి ఇంటర్మీడియట్‌కు పొడిగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇప్పటివరకు ఇంటర్ గణితంలో ఏ, బీ పేపర్లు ఉండగా 75 మార్కుల చొప్పున 150 మార్కులకు నిర్వహిస్తున్నారు. ఇకపై పబ్లిక్ పరీక్షల్లో ఈ రెండూ కలిపి ఒక్క పేపర్‌గానే ఇవ్వనున్నారు. మార్కులు సైతం వందకు కుదిస్తున్నారు. దీంతో వచ్చే ఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులందరూ మ్యాథమెటిక్స్ ఒక్క పేపర్ వంద మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది.అలాగే భౌతిక, రసాయనశాస్త్రాలు ఇప్పటివరకు 60 మార్కుల చొప్పున ఉండగా.. ఈ మార్కులు 85కి పెరిగాయి. మొదటి ఏడాదిలోని 15 మార్కులు, రెండో ఏడాదిలోని 15 మార్కులు కలిపి 30 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. బైపీసీలోని వృక్ష, జంతుశాస్త్ర సబ్జెక్టులు రెండింటిని కలిపి ఒకే పేపర్‌గా ఇవ్వనున్నారు. దీనిని జీవశాస్త్రంగా పిలుస్తారు. ఇందులో 43 మార్కులకు వృక్ష శాస్త్రం, 42 మార్కులకు జంతుశాస్త్రం ఉంటుంది. మొత్తం 85 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. సీఈసీ గ్రూపులో కామర్స్, అకౌంటెన్సీ కలిపి 50 మార్కుల చొప్పున ఒక పేపర్ ఉంటుంది. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం సబ్జెక్టులకు ఎలాంటి మార్పు చేయలేదు. ఆంగ్లం, కామర్స్‌లో అకౌంటెన్సీ మినహా మిగతా అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రాల్లోనూ నాలుగు సెక్షన్లు ఉంటాయి. సైన్సు గ్రూపుల్లో ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి. అన్ని పేపర్లలోనూ ఒక్క మార్కు ప్రశ్నలు ఉంటాయి. సీబీఎస్ఈ విధానంలో వీటిని ప్రవేశపెట్టారు.వచ్చే విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొత్తం పనిదినాలు 314 ఉన్నాయి. ఇందులో 79 సెలవులు ఉన్నాయి. మిగతా 235 రోజులు తరగతులు కొనసాగుతాయి. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు చేస్తున్నందున విద్యా సంవత్సరంలోనూ మార్పు చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి ఇంటర్ విద్యార్థులకు క్లాసులు పునఃప్రారంభమవుతాయి. ఏప్రిల్ 23 వరకు తరగతులు నిర్వహించి, 24 నుంచి జూన్ ఒకటి వరకు సెలవులు ఇస్తారు. దసరా సెలవులు సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5 వరకు, సంక్రాంతి సెలవులు జనవరి 10 నుంచి 18 వరకు ఉంటాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరిలో, పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చిలో ఉంటాయి.

# దుర్గగుడి భూముల లీజ్ పై నివేదిక

విజయవాడ, మార్చి 27,

వందల కోట్ల ఖరీదు చేసే విజయవాడ దుర్గగుడి భూముల లీజు పొడిగింపు వ్యవహారంలో దేవాదాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు ఆరు ఎకరాల భూమి లీజు పొడిగింపుకు ముందే దుర్గగుడి భూముల ప్రస్తుత స్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఆ శాఖ కార్యదర్శి ఆదేశించారు. వందల కోట్ల ఖరీదు చేసే విజయవాడ దుర్గగుడి భూముల్ని యాభై ఏళ్లకు లీజు పొడిగించాలనే ప్రతిపాదనలు వెలుగులోకి రావడంతో దేవాదాయ శాఖ చర్యలు చేపట్టింది. విజయవాడ పటమట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో సర్వే నంబర్ 17లో ఉన్న 5 ఎకరాల 98 సెంట్ల భూముల ప్రస్తుత స్థితిపై సమగ్ర నివేదికను సమర్పించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఆ శాఖ కార్యదర్శి ఆదేశించారు.విజయవాడ నగరం మధ్యలో దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానానికి ఉన్న భూముల్ని పలు సంస్థలకు లీజుకు ఇచ్చారు. ఈ క్రమంలో సిద్ధార్థ అకాడమికి ఇచ్చిన 5.98 ఎకరాల భూమి లీజు పొడిగింపుపై ఆ శాఖ కమిషనర్ ఫిబ్రవరి 5వ తేదీన దేవాదాయ శాఖలో ప్రతిపాదించారు. దీనిపై అభ్యంతరాలు లేవనెత్తుతూ దేవాదాయశాఖ ఫిబ్రవరి 17 కమిషనర్‌కు మెమో పంపింది. ఆ తర్వాత ఫిబ్రవరి 17, 19 తేదీల్లో లీజు వ్యవహారంపై కమిషనర్ వివరణలు ఇచ్చారు.భూములపై కమిషనర్ ఇచ్చిన వివరణలతో సంతృప్తి చెందని దేవాదాయ శాఖ కార్యదర్శి వాటిపై పలు కొర్రీలు వేశారు. భూమి వాస్తవ స్థితితో పాటు దాని సరిహద్దుల్ని ఖరారు చేసి రీ సర్వే చేయడంతో పాటు వాటిని డిజిటలైజ్ చేయాలని సూచించారు. దుర్గ గుడికి చెందిన భూమి లీజుకు సంబంధించిన అసలు ప్రతులను జత చేయాలని, లీజు నియమ నిబంధనలు అమలు చేస్తున్నారో లేదో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు.విజయవాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్‌లకు అనుగుణంగా భూమి వినియోగాన్ని నిర్ధారించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ అండ్ హిందూ ధార్మిక సంస్థలు, దేవాదాయ శాఖ చట్టం 2003కు అనుగుణంగా నిబంధనలు అమలవుతున్నాయెా లేదో స్పష్టం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.1978 డిసెంబర్ 6వ తేదీన జరిగిన దుర్గగుడి భూముల లీజ్ అగ్రిమెంట్ నిబంధనల అమలు స్థితిని తెలియచేయాలని, లీజుదారులు నిబంధనలు అమలు చేసిన తీరుపై సమగ్ర వివరాలు తెలియచేయాలని, అద్దె చెల్లింపులు, బకాయిల వివరాలను తెలియచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దుర్గ మల్లేశ్వర దేవస్థానం విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో జరిగే అన్ని పరిణామాలను బేరీజు వేసుకుని లీజు ధరను ఖరారు చేయాలని, దీనిపై అత్యవసరంగా నివేదికను సమర్పించాలని దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేశారు.విజయవాడ నగరం మధ్యలో వందల కోట్ల ఖరీదు భూముల్లో నలభై ఐదు ఏళ్ల క్రితం విద్యా సంస్థల్ని ఏర్పాటు చేశారు. సిద్ధార్థ అకాడమీ పేరుతో జరిగిన ఈ భూముల లీజు గడువు ముగియడంతో వాటిని పొడిగించాలనే ప్రతిపాదనలు దేవాదాయ శాఖకు చేరాయి. లీజు గడువును యాభై ఏళ్లకు పొడిగించడంతో పాటు నామమాత్రపు రుసుము చెల్లించాలనే ప్రతిపాదనపై దేవాదాయశాఖ ఎస్టేట్స్ విభాగం అభ్యంతరం తెలిపింది. ఈ తరహా ప్రతిపాదనలు దేవస్థానం ప్రయోజనాలకు నష్టం కలిగిస్తాయని, యాభై ఏళ్ల తర్వాత భూముల పరిస్థితిని ఇప్పుడే నిర్ధారించడం సాధ్యం కాదని పేర్కొన్నారు.విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం భూముల్లో ఉన్న లీజుల్ని పొడిగించాలని ప్రభుత్వ స్థాయిలో ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందడంతో దేవాదాయ శాఖ అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఏడాదికి రూ.10లక్షల రుపాయల లీజుతో యాభై ఏళ్ల పాటు ఈ లీజును పొడిగించాలనే ప్రతిపాదనలు ఆ శాఖకు చేరాయి. విజయవాడ నగరం మధ్యలో ఉన్న ఖరీదైన భూములు కావడం, లీజు ద్వారా వచ్చే ఆదాయం భూముల విలువకు తగినట్టు లేకపోవడంతో ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకోవడానికి దేవాదాయ శాఖ కార్యదర్శి సుముఖత చూపలేదు.విజయవాడ నగరంలో విద్యా సంస్థకు యాభై ఏళ్ల పాటు ఆరెకరాల లీజును పొడిగించాలనే ప్రతిపాదనలకు దేవాదాయ శాఖ అభ్యంతరం తెలిపింది. యాభై ఏళ్ల తర్వాత భూముల స్వాధీనత సాధ్యపడదని, ఇప్పటికే యాభై ఏళ్లుగా లీజులో ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేసినట్టు దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. లీజును పొడిగించాలంటే మూడేళ్లకోసారి మాత్రమే పొడిగించాలని ఒకేసారి యాభై ఏళ్ల పాటు లీజు పొడిగించడం సరికాదనే అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.దుర్గగుడికి చెందిన భూముల లీజు పొడిగింపుపై సీఎంఓలో అధికారుల నుంచి దేవాదాయశాఖపై ఒత్తిడి పెరగడంతో భూముల వాస్తవ పరిస్థితిపై సమగ్ర సర్వే చేపట్టాలని దేవాదాయశాఖ కార్యదర్శి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దేవాదాయ భూముల వివరాలను డిజిటలైజ్ చేయాలని, లీజుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా సమగ్ర డేటా రూపొందించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఆ శాఖ కార్యదర్శి ఆదేశించినట్టు తెలుస్తోంది. అయితే అవి అమలు కాలేదు.విజయవాడ దుర్గగుడి భూముల లీజు వ్యవహారం వెలుగు చూడటంతో దుర్గగుడి భూములపై సమగ్ర నివేదిక సమర్పించాలని దేవాదాయశాఖ కార్యదర్శి కమిషనర్‌ను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత పదేళ్ల కాలంలో వందల కోట్ల దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతమైనట్టు ఫిర్యాదులు అందడంతో సమగ్ర సర్వే చేపట్టాలని ఆ శాఖ భావిస్తోంది.విజయవాడ దుర్గగుడితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానమైన ఆలయాలకు దాతలు ఇచ్చిన భూములు అన్యాక్రాంతం కావడానికి రాజకీయ నాయకులే కారణమని చెబుతున్నారు. లీజుల ద్వారా ప్రభుత్వానికి మార్కెట్ ధరల ప్రకారం రావాల్సిన ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరించడంపై ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలనే డిమాండ్ వినిపిస్తోంది.మరోవైపు దేవాదాయ శాఖలో విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం కమిషనర్‌లకు ఉంటుంది. వాటిని అమోదించడం వరకే సెక్రటరీ బాధ్యత కావడంతో వివాదాస్పద నిర్ణయాలకు అమోదించడానికి వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. న్యాయస్థానాల్లో కేసులు నమోదైతే సెక్రటరీలు బాధ్యత వహించాల్సి వస్తుందనే కారణంతోనే లీజుల వ్యవహారానికి సుముఖత చూపడం లేదు.

# ఏపీని నెంబర్ వన్ చేయడమే చంద్రబాబు లక్ష్యం

కుప్పం:", మార్చి 27,

ఏపీని నెంబర్ వన్ చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని నారా భువనేశ్వరి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రజలే కుటుంబసభ్యులు, ఆయన నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తారన్నారు. కుప్పంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ లో బుధవారం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. పేదరికం లేని సమాజం స్థాపించాలని చంద్రబాబు అనునిత్యం తపిస్తారని చెప్పారు. స్వర్ణాంధ్ర - విజన్ 2047 లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, ఒక్కోసారి ఆయన రాత్రి 12 గంటల వరకూ పనిచేస్తారని, అయినా ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి యోగా చేస్తారని వివరించారు. తనకు చిన్న వయసులోనే వివాహమైందని, రాజకీయాల గురించి అప్పట్లో తనకు తెలీదన్నారు. తాను హెరిటేజ్ వ్యవహారాలు, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చూసుకునేదాన్ని, చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని చెప్పారు. వారిని చూస్తే తనకు గర్వంగా అనిపిస్తుందన్నారు. యువత బాగా చదువుకోవాలని, ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించాలని పిలుపు ఇచ్చారు. టెక్నాలజీ మీద అవగాహన పెంచుకోవాలని, యువత క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని భువనేశ్వరి చెప్పారు.

## మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం

నరసరావుపేట, మార్చి 27,

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో మాదకద్రవ్యాల వినియోగం మరియు వ్యాపారాన్ని నిరోధించేందుకు పోలీస్ శాఖ నిశ్చయంగా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా, ఏ మ్ రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నరసరావుపేట ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో "డ్రగ్స్ వద్దు బ్రో " అనే నినాదంతో మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నరసరావుపేట పట్టణంలోని నాలుగు ముఖ్య కేంద్రాల్లో నిర్వహించబడింది. ముఖ్యంగా పల్నాడు బస్టాండ్, మార్ సెంటర్, రిక్షా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ లలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ అధికారులు కలిసి రోడ్డు నాటకాలు, ర్యాలీలు, స్పెషల్ క్యాంపెయిన్‌లు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా, కుటుంబపరంగా ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో ప్రజలకు వివరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట వన్ టౌన్ సిఐ ఎం వి చరణ్ పాల్గొని మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం అనేది యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రధాన సమస్య. పోలీస్ శాఖ కఠినంగా చర్యలు తీసుకుంటుంది. న్యాయపరంగా మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం, సరఫరా పై చట్టపరమైన గట్టి చర్యలు ఉంటాయి అని ప్రజలకు హెచ్చరించారు. పోలీస్ శాఖ మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అవగాహన కార్యక్రమాలతో పాటు, ఎవరైనా డ్రగ్స్ విక్రయం లేదా వినియోగంలో పాలుపంచుకున్నట్లు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎం. వి.చరణ్ స్పష్టం చేశారు. పోలీస్ శాఖకు 100 నంబర్, మరియు 1973 ద్వారా లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించవచ్చు అని అన్నారు. పోలీసులు, విద్యార్థులు, స్థానికులు కలిసి "డ్రగ్స్ వద్దు బ్రో " అనే నినాదాన్ని నమ్మకంగా ముందుకు తీసుకువెళ్లాలని, మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

## ఫ్లైట్లో వస్తారు .. ఏటీఎం కట్ చేసి లక్షలు దోచుకెళ్లిపోతారు

హైదరాబాద్, మార్చి 27

ఉత్తరాదిలో కొన్ని గ్రామాల నుంచి డ్యూటీలకు వచ్చినట్టుగా దక్షిణాదికి వచ్చి దోపిడీలు చేసి మళ్లీ తమ స్వగ్రామాలకు వెళ్లిపోయే ముఠాలు చాలా ఉంటాయి. అలాంటి ముఠాల్లో ఒకటి హైదరాబాద్ పోలీసులకు చిక్కింది.

మహేశ్వరం, రావిర్యాల్లో మార్చి ఒకటో తేదీన రెండు ఏటీఎంలలో డబ్బులు దోచుకెళ్లారు. ఏటీఎంలను కట్ చేసి.. చాలా నేర్పుగా లక్షలు కొట్టేసి వెళ్లిపోయారు. పోలీసులు ఈ పని ఎవరు చేశారో పూర్తి స్థాయిలో ఆరా తీశారు. కొన్ని వందల సీసీఫుటేజీలు గుర్తించారు. ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన తర్వాత వారికి అసలు క్లారిటీ వచ్చింది. వారి కోసం హర్యానాకు వెళ్లి ఖాకీ సినిమాలో ఛేజ్ చేసినట్లుగా చేసి.. నిందితుల్ని అరెస్టు చేసి తీసుకొచ్చారు. కేవలం మూడు అంటే 3 నిమిషాల్లో ఏటీఎం లో ఉన్న 29 లక్షలు కాజేసిన ఈ దొంగలను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. గతంలో కుషాయిగూడ, ఆజ నాగర్, ఒడిశా లో ఏటీఎం లను కొల్లగొట్టారని పోలీసులు తెలిపారు. ఇంకా ఈశా, ఇంకా ఏటీఎం ల చోరీ కేస్ చేదించేందుకు చాలా కష్టపడ్డామని కమిషనర్ తెలిపారు. నిందితులు మొత్తం ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువ కానీ.. హైదరాబాద్ కు చెందిన రాహుల్ అనే వ్యక్తి కీలక సూత్రధారిగా గుర్తించామన్నారు. హర్యానా లో ఉన్న ఒక గ్రామానికి చెందిన నిందితులు .. నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న ఏటీఎం లే వీరి టార్గెట్ చేసుకుంటారని పోలీసులుతెలిపారు. రావిర్యాల్ తో పాటు వరపర్తి, మైలార్దేవ్ పల్లి కొంగరకలాన్ వెళ్లారు అక్కడ కూడా రెక్కి చేసి మార్చ్ 1 న రావిర్యాల లో ఏటీఎం లో ఉన్న 29.60 లక్షలు ఎత్తుకెళ్లారు.

# చిరంజీవి పేరుతోనే రావిపూడి అనిల్ సినిమా

హైదరాబాద్, మార్చి 27,

మెగాస్టార్ చిరంజీవి నెక్స్ట్ మూవీ మీద అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మాస్ ప్రేక్షకులను అలరించే అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా, ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ దశ పూర్తయిందని దర్శకుడు అనిల్ రావిపూడి స్వయంగా సోషల్ మీడియాలో ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవితో కథా చర్చలు పూర్తి కావడం, ఆయన సానుకూలంగా స్పందించడంతో చిత్ర యూనిట్ ఉత్సాహంగా ఉంది. అనిల్ రావిపూడి తన ట్వీట్‌లో, చిరంజీవి గారికి సినిమాలో తన పాత్ర అయిన 'శంకర్ వరప్రసాద్'ను పరిచయం చేశానని, ఆయన కథను ప్రేమగా స్వీకరించి ఆసక్తిగా విన్నారని తెలిపారు. త్వరలోనే ముహూర్తం ఖరారు చేసి, చిరునవ్వుల పండుగను ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాకు 'చిరు అనిల్' ప్రాజెక్ట్ అనే పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. స్క్రిప్ట్ ఫైనల్ కావడంతో మెగా అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. సినిమాలో చిరంజీవి అసలు పేరు 'శంకర వర ప్రసాద్'ను ప్రముఖంగా చూపిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో 'శంకర్ దాదా ఓంబీ'లో కూడా ఇదే పేరుతో ఆయన అలరించారు. ఈ చిత్రం చిరంజీవిని మళ్లీ పూర్తి స్థాయి మాస్, ఫన్ అవతారంలో చూడాలని ఎదురుచూస్తున్న అభిమానులకు ఒక ట్రీట్‌గా ఉండనుంది. అనిల్ రావిపూడి మార్క్ కామెడీ .. చిరంజీవి స్పెషల్ మేనరిజమ్స్ కలగలిస్తే తెరపై ఎలాంటి వినోదం పండుతుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా భీమ్స్ సిసిరోలియో ఖరారు అయిన సంగతి తెలిసిందే. మ్యూజిక్ కు సంబంధించిన పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. నాలుగు పాటలు ఇప్పటికే కంపోజ్ అయ్యాయని సమాచారం. చిత్ర బృందం ప్రీ-ప్రొడక్షన్ పనులను ఎక్కడా ఆలస్యం చేయకుండా పూర్తి చేస్తోంది. మెగాస్టార్ తదుపరి చిత్రం 'విశ్వంభర' విడుదలైన వెంటనే ఈ కొత్త ప్రాజెక్ట్‌పై పూర్తి దృష్టి సారించేలా మే నుంచి షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను తక్కువ సమయంలో పూర్తి చేసి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని నిర్మాతలు టార్గెట్ గా పెట్టుకున్నారు. సంక్రాంతి సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని, అనిల్ రావిపూడి మెగాస్టార్‌తో కలిసి మరోసారి విజయాన్ని అందుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఎంపిక చేసేందుకు ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఉగాది పండుగ రోజున పూజా కార్యక్రమాలతో ఈ సినిమా లాంచ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తానికి, మెగాస్టార్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి ఒక పెద్ద వినోదాల విందును అందించడానికి రెడీ అవుతుంది

# టెస్లాకు వరుస షాకులు

న్యూఢిల్లీ, మార్చి 27,

చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం బీవైడీ ఇదివరకే ఎలన్ మస్క్, టెస్లా ఆధిపత్యానికి సవాల్ విసురుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు, యూరప్‌కు చెందిన మరో రెండు ప్రముఖ కార్ల తయారీ సంస్థలు బీఎండబ్ల్యూ , ఫోక్స్‌వ్యాగన్ కూడా అమ్మకాల విషయంలో టెస్లాను వెనక్కి నెట్టాయి. టెస్లాకు చైనా, అమెరికా తర్వాత యూరప్ అతిపెద్ద మార్కెట్. కానీ ఇక్కడ కూడా చైనాకు చెందిన బీవైడీ.. టెస్లాకు గట్టి పోటీ ఇస్తుంది. అంతేకాకుండా, యూరప్‌కు చెందిన ఫోక్స్‌వ్యాగన్, బీఎండబ్ల్యూ గ్రూప్ ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు యూరోపియన్ మార్కెట్‌లో గణనీయంగా పెరిగాయి. దీని ప్రభావం టెస్లా అమ్మకాలపై స్పష్టంగా కనిపిస్తోంది. యూరోపియన్ మార్కెట్‌లో ఫిబ్రవరి నెల టెస్లాకు అంతలా కలిసి రాలేదు. రాయిటర్స్ వార్తా సంస్థ కథనం ప్రకారం, జాటో డైనమిక్స్ అనే రీసెర్చ్ ప్లాట్ ఫామ్ విడుదల చేసిన డేటా ప్రకారం ఫిబ్రవరిలో యూరప్‌లో టెస్లా అమ్మకాలు భారీగా పడిపోయాయి. యూరోపియన్ యూనియన్‌లోని 25 దేశాలు, బ్రిటన్, నార్వే, స్విట్జర్లాండ్‌లను కలిపి యూరోపియన్ మార్కెట్‌లో ఫిబ్రవరిలో టెస్లా అమ్మకాలు 44 శాతం తగ్గాయి. దీంతో కంపెనీ మార్కెట్ వాటా కూడా 9.6శాతానికి పడిపోయింది. ఈ నెలలో కంపెనీ కేవలం 16వేల యూనిట్ల కార్లను మాత్రమే విక్రయించగలిగింది. గత ఐదేళ్లలో ఫిబ్రవరి నెలలో ఇదే అత్యల్ప మార్కెట్ వాటా ఇదే కావడం గమనార్హం. సమయంలో ఫోక్స్‌వ్యాగన్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఏకంగా 180శాతం మేర పెరిగాయి. కంపెనీ మొత్తం 20వేల కార్లను విక్రయించింది. మరోవైపు బీఎండబ్ల్యూ, దాని అనుబంధ సంస్థ మినీ బ్రాండ్ కలిపి ఫిబ్రవరిలో 19వేల యూనిట్ల కార్లను విక్రయించాయి. యూరప్‌లో



చైనా ఎలక్ట్రిక్ కార్ల బ్రాండ్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి. బీవైడీ అమ్మకాలు 94 శాతం పెరిగి 4వేల యూనిట్లకు చేరుకోగా, పోల్‌స్టార్ అమ్మకాలు 84 శాతం పెరిగి 2వేల యూనిట్లుగా నమోదయ్యాయి. అలాగే, ఎక్స్‌పెంగ్ వెయ్యి కార్లను, లీప్‌మోటార్ 900 కార్లను విక్రయించాయి. విశేషం ఏమిటంటే.. చైనాకు చెందిన అన్ని కంపెనీల మొత్తం అమ్మకాలు టెస్లా కంటే ఎక్కువగా ఉన్నాయి. కార్ల అమ్మకాల పరంగా చూస్తే 2024లో టెస్లా 17.7 లక్షల కార్లను ఉత్పత్తి చేసింది. అదే సమయంలో బీవైడీ ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 17.6 లక్షలుగా ఉన్నాయి. ఇందులో బీవైడీ హైబ్రిడ్ కార్ల అమ్మకాలు కూడా కలిపితే ఆ సంఖ్య 42.5 లక్షలకు చేరుకుంటుంది.

# జేఈఈ డ్రెస్ కోడ్...

హైదరాబాద్, మార్చి 27,

దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ తుది విడత పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో పరీక్షల నిర్వాహణకు ఎన్‌టీఏ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 2, 3, 4, 7, 8, 9 తేదీల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. రోజుకు రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో షిఫ్టు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 8వ తేదీన పరీక్ష మొదటి షిఫ్టులో మాత్రమే జరగనుంది. అలాగే ఏప్రిల్ 9న పేపర్ 2ఏ (బీఆర్క్), పేపర్-2బి (బీప్లానింగ్, పేపర్ 2ఎ, బి (బీఆర్క్, బి ప్లానింగ్) పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనుంది. ఇక ఇప్పటికే సిటీ ఇంటిమేషన్ స్లిప్పులు ఇప్పటికే అందుబాటులో తీసుకురాగా.. తాజాగా జేఈఈ మెయిన్ సెషన్ 2 అడ్మిట్ కార్డులు కూడా ఎన్టీఏ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పరీక్ష రాసే అభ్యర్థులకు పలు ముఖ్య సూచనలు జారీ చేసింది. విద్యార్థుల డ్రెస్ కోడ్‌పై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ప్రతి తప్పు ప్రశ్నకు నెగెటివ్ మార్కులు ఉంటాయి. అందుకే ఈ విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండి జవాబులు గుర్తించాలి.

జేఈఈ అభ్యర్థులు తీసుకోవల్సిన జాగ్రత్తలు ఇవే..

పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం సెషన్‌లో 8.30, మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటలకే గేట్లు మూసి వేస్తారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరు. ఉదయం 7.30 నుంచి 8.30, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల మధ్య పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

ఎట్టిపరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. ఆధార్, పాస్‌పోర్ట్, రేషన్ కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు (ఐడెంటిటీ) కార్డు పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి. రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ట్రాన్స్‌పరెంట్ పెన్ను, అడ్మిట్ కార్డును మాత్రమే అనుమతిస్తారు. బీఆర్క్ పరీక్షకైతే పెన్సిల్, స్కేల్, రబ్బర్, జామెంట్రీ బాక్స్ తీసుకెళ్లవచ్చు.

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు స్కార్ఫ్‌లు, మఫ్లర్‌లు, స్టోల్స్, షాల్స్, టోపీలు, రంగుల కళ్లద్దాలు ధరించరాదు. పాకెట్స్ లేకుండా వదులుగా ఉండే దుస్తులు మాత్రమే ధరించాలి. దుస్తులపై మెటాలిక్స్ అలంకారాలు ఉంటే అనుమతించరు. బూట్లు, మందమున్న చెప్పులు వేసుకోకూడదు. లోహాలతో కూడిన వస్తువులు, ఆభరణాలు, నగలు లేకుండా చూసుకోవాలి. ఉంగరాలు, గాజులు వేసుకోకుంటే మంచిది.

# కేసుల ఉచ్చులో మాజీలు

హైదరాబాద్, మార్చి 27

కేసులు.. బెయిల్‌లు.. కోర్టులు.. పిటీషన్లు.. ఇప్పుడు బీఆర్ఎస్ లో ఎవరినీ కదిలించినా ఇవే మాటలు. పార్టీ అగ్రనాయకులైన కేసీఆర్, కేటీఆర్ అరెస్టు తప్పదని కాంగ్రెస్ నేతలతో పాటు ప్రభుత్వంలోని పెద్దలు తరచూ ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవిత జైలు జీవితాన్ని గడిపి బెయిల్ పై బయటికి వచ్చారు. ఆ పార్టీకి, ఆ కుటుంబానికి ఎంతో దగ్గరగా ఉన్న నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేల అరెస్టు, ఆస్తుల జప్తుపై ఇప్పుడు జోరుగా ప్రచారం జరుగుతోంది. సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్లించి పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు బోధన్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై రెవెన్యూ రికవరీ యాక్టు నమోదు అయింది. నేడో రేపో ఆయన ఆస్తులను అటాచ్ చేసుకునే అవకాశం ఉందట. ఇప్పటికే షకీల్ పరారీలో ఉన్నారు. సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించారని 2024 ఫిబ్రవరి లో ఆయనపై కోటగిరి పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదైంది. ఆ కేసు విచారణ జరగకముందే షకీల్ దుబాయికి చెక్కేశారు. ఆ తరువాత అతడి కొడుకు రాహేల్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో హిట్ అండ్ రన్ కేసు నమోదు కాగా, కేసును తారుమారు చేసేందుకు యత్నించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ కేసు విచారణ జరుగుతుండగానే రాహేల్ కూడా గల్ఫ్ పరారయ్యాడు. ఆర్మూర్‌కి ప్రాతినిధ్యం వహించిన మరో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి జైలుకు వెళ్లకతప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోందట. రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో 20 ఎకరాల భూ ఆక్రమణకు సంబంధించిన కేసులో జీవన్ రెడ్డి తల్లి రాజుబాయి, భార్య రజితకు హై కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయగా, జీవన్ రెడ్డి బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే దామోదర్ రెడ్డి అనే వ్యక్తి తన భూమిని జీవన్ రెడ్డి ఆక్రమించారని కేసు పెట్టారు. తాను నిర్మించిన ఫంక్షన్ హాలును కూల్చివేశారని, తనను ఆయుధాలతో బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మారిన తరువాత ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డికి చెందిన జీవన్ మాల్‌ను సైతం అధికారులు సీజ్ చేశారు. భారీ మొత్తంలో బకాయిలు పడి, చెల్లించడం లేదని విద్యుత్ తదితర శాఖల అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన బీఆర్ఎస్ నేతలు అక్రమ దందాలకు పాల్పడటం తీవ్ర విమర్శల పాలవుతోంది. గత ప్రభుత్వ హయంలో ఏం చేసినా నడుస్తుందిలే అన్నట్లు కొందరు నాయకులు వ్యవహరించారు. ఉన్న పదవి కోల్పోయి పార్టీ అధికారం కోల్పోయే సరికి మాజీ ఎమ్మెల్యేల బాధితులు న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. వారి వల్ల ఆపద ఉందని తమ కంప్లైంట్లలో పేర్కొంటున్నారు. దాంతో గులాబీ నేతలకు వరుసగా కేసుల చట్రం బిగుసుకుంటోందిప్పుడు.

## సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు

పత్తికొండ", మార్చి 27 నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు బుధవారం రోజున బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పత్తికొండ నియోజకవర్గంలోని సుమారు 14 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 10 లక్షల 93,600 రూపాయలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు స్థానిక టీడీపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ బాబు మాట్లాడుతూ కష్టకాలంలో కుటుంబానికి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నారని, పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. తుగ్గలి మండలం రామలింగాయపల్లి గ్రామానికి చెందిన మహానంది కు 50,000 రూపాయలు, తుగ్గలి మండలం రామకొండ గ్రామానికి చెందిన కే.సుజాత కు 49620 రూపాయలు, తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన కడిమెట్ల హనుమత్ రెడ్డికు 20000, తుగ్గలి మండలం గుత్తి ఎర్రగుడి గ్రామానికి చెందిన హోసూరు చరణ్ తేజ కు 53150 రూపాయలు, తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డికు 201153 రూపాయలు, మద్దికేర మండలం ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన జి.జయశ్రీ కు 31112 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్యాంబాబు పంపిణీ చేశారు.

# పోలీసులకు చిక్కిన లేడీ డాన్

హైదరాబాద్, మార్చి 27,

గంజాయిని సరఫరా చేస్తూ ఒక లేడీ డాన్ మూడు రాష్ట్రాలను ముప్పుతిప్పలు పెడుతుంది. చివరకు హైదరాబాద్ ఎక్సైజ్ పోలీసులు లేడీ డాన్ సంగీత సాహును అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన సంగీత సాహు గంజాయిని అనేక మందికి సరఫరా చేస్తూ లక్షల రూపాయలను ఆర్జించారు. నాలుగేళ్ల నుంచి ఈ గంజాయి వ్యాపారంలోకి దిగిన లేడీ డాన్ సంగీత సాహు ఒడిశాతో పాటు తెలంగాణ రాష్ట్రాల్లో అనేక మందికి గంజాయిని సరఫరా చేస్తుంది. రెండు చేతులా సంపాదిస్తుంది. పోలీసులకు చిక్కకుండా ఇన్నాళ్లు తప్పించుకుంది. గతంలో అనేక సార్లు సంగీత సాహు పోలీసులకు రికార్డులకు ఎక్కినప్పటికీ ఆమెపై పోలీసులు ఒక కన్నేశారు. ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని గంజాయి వ్యాపారులతో టచ్ లో ఉండి వారికి సరఫరా చేస్తూ లక్షలు సంపాదిస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటుపడింది. ఒడిశా రాష్ట్రంలోని కుర్ధా జిల్లాలోని కాలికోట్ గ్రామానికి చెందిన సంగీత సాహు భువనేశ్వర్ కు దగ్గరగా ఉండటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులతో సులువుగా గంజాయి వ్యాపారాలను యథేచ్ఛగా నిర్వహిస్తుంది. పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుతిరుగుతూ వారిని ముప్పు తిప్పలు పెడుతుంది. అనేక మార్గాల ద్వారా గంజాయిని సరఫరా చేస్తూ వెంటనే తన అనుచరుల ద్వారా డబ్బును తెప్పించుకోవడం సంగీత సాహుకు అలవాటు. ఈ విషయం తెలిసిన పోలీసులు, ఎక్సైజ్ శాఖ పోలీసులు సాహు కార్యకలాపాలపై ఒక కన్నేసి ఉంచారు. వివిధ రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో ఫోన్ లోనే బేరాలు మాట్లాడుకుని వారికి యథేచ్ఛగా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు అయితే తాజాగా హైదరాబాద్ లోని ధూల్ పేట్ లో గంజాయి వ్యాపారులకు 41.3 కేజీల గంజాయిని సరఫరా చేస్తూ సంగీత సాహు పట్టుబడటంతో ఈమె వెలుగులోకి వచ్చింది. ధూల్ పేట్ లో కొందరు వ్యాపారులకు గంజాయిని సరఫరా చేసినట్లు తెలియడంతో పాటు గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే సంగీత సాహుపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఇక మిగిలిన రాష్ట్రాల్లో కూడా అనేక కేసులున్నాయి. అయితే సంగీత సాహును అరెస్ట్ చేయడానికి ఒడిశాకు వెళ్లిన ఎక్సైజ్ శాఖ పోలీసులు అక్కడి పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసి నగరానికి తీసుకు వచ్చారు. సోషల్ మీడియాలో వీడియోలు పోస్టులు చేస్తూ గంజాయి వ్యాపారాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్న ఈ కిలాడీ లేడీ ఎట్టకేలకు కటకటాలపాలయింది.

# భద్రాచలం కొత్త డిజైన్స్ రెడీ...

ఖమ్మం, మార్చి 27

భద్రాచలం ఆలయ నూతన డిజైన్లు విడుదల అయ్యాయి. ఈ డిజైన్లు ఆకట్టుకునేలా ఉన్నాయని భక్తులు అంటున్నారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి గత బీఆర్ఎస్ సర్కార్ మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఆనంద్‌సాయి కొన్ని డిజైన్లను రూపొందించారు. ఆలయ అభివృద్ధిపై ఈ కొత్త డిజైన్లను ప్రభుత్వం విడుదల చేసింది.మాడ వీధుల విస్తరణ, ఇతర పనులకు ప్రభుత్వం రూ.60 కోట్లను మంజూరు చేసింది. మాడ వీధుల విస్తరణలో భాగంగా ఇళ్లు, భూములను కోల్పోతున్న వారిని రెవెన్యూ, దేవస్థానం అధికారులు గుర్తించగా.. 45 మందికి రూ.34 కోట్లు పరిహారం అందించాల్సి ఉంది.సీతారాముల కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను అధికారులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా భూసేకరణ, సర్వే వివరాల గురించి సీఎం రేవంత్ ఆరా తీశారు. నష్టపరిహారం విడుదల కావాల్సి ఉందని మంత్రి తుమ్మల చెప్పారు. ఇటీవల భద్రాచలం పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి సైతం.. రెండు, మూడు రోజుల్లో భూ నిర్వాసితుల పరిహారం అందుతుందని ప్రకటించారు. మంగళవారం రూ.34 కోట్లు విడుదల చేయగా.. ఏళ్ల తరబడి స్థానికులు, భక్తులు ఎదురుచూస్తున్న భద్రగిరి అభివృద్ధికి తొలి అడుగు పడినట్లయింది. ఈ మేరకు 45 మంది నిర్వాసితులతో ఆర్డీవో సమావేశమై నిరభ్యంతర పత్రాలు స్వీకరించారు.వీరికి బుధవారం నష్టపరిహారం చెక్కులను ఇచ్చే అవకాశముంది. శ్రీరామనవమి రోజు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిపించేలా సన్నాహాలు చేస్తున్నారు అధికారులు.

# కాకినాడ రూరల్ ఎంపిపిగా అనంతలక్ష్మి

కాకినాడ మార్చి 27, (

కాకినాడ రూరల్ ఎంపీపీ ఎన్నికను ఎనిమిది మంది వైసీపీ ఎంపీటీసీ లు బహిష్కరించారు. గురువారం నాడు ఎమ్మెల్యే నానాజీ వైసీపీ నుంచి జనసేనలో చేరిన ఏడుగురు ఎంపీటీసీ లు, తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలతో కలిసి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. కాకినాడ రూరల్ లో ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నికలు జరిగాయి. జనసేన ఎంపీటీసీ అనంతలక్ష్మి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

# మాకు దిష్టి తగిలింది - మల్లారెడ్డి

హైదరాబాద్

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గురువారం శాసనసభలో మాట్లాడారు. మల్లారెడ్డి మాట్లాడుతూ మా మేడ్చల్ నియోజవర్గానికి దిష్టి తగిలినట్లుంది. 61 గ్రామాలు పోయి అన్నీ మున్సిపాలిటీలు అయినయి. సేమ్ రిజర్వేషన్ ఉండాలి. దయచేసి మమ్మల్ని జీహెచ్ఎంసి లో కలపొద్దు అన్నారు.

# పాత ఇందిరానగర్ లో ప్రజలకు తాగునీటి కటకట

ఎమ్మిగనూరు మార్చి 27

పట్టణంలో పాత ఇందిరానగర్ నందు ప్రజలకు తాగునీరు తక్షణమే కల్పించాలని సిపిఎం డిమాండ్ ప్రస్తుత పరిస్థితుల్లో ఇంద్రానగర్ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సిపిఎం పట్టణ నాయకులు బి రాముడు తెలిపారు ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో అత్యధికంగా వ్యవసాయ కూలీలు నివసిస్తున్నారు వారు పనులు పోయే సమయములో తాగునీరు రావడం లేదు అధికారులు పర్యవేక్షణ అంతంతమాత్రాన ఉన్నదని తెలిపారు ఈ ప్రాంత ప్రజలకు కనీసం తాగునీరు సౌకర్యం కల్పించాలని మున్సిపల్ అధికారులు కోరారు వేలాదిమంది వ్యవసాయ కూలీలు జీవనం చేస్తున్నారని ఇక్కడి ప్రజలకు తాగునీరు రానందున అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన ఎత్తు పరిచారు తాగునీటి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను సిపిఎం నాయకులు కోరారు నిర్లక్ష్యం చేస్తే మున్సిపల్ ఆఫీసు ముట్టడి చేస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు

మల్కాజ్ గిరి

మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ పార్టీ అహర్నిశలు పనిచేస్తుందని బిఆర్ఎస్ నాయకులు విలేకర్ల సమావేశంలో తెలిపారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిత్యం ప్రజలలో ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతుంటే ఓర్వలేక కొందరు అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ నాయకులు మల్కాజిగిరి నియోజకవర్గం లో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. నియోజకవర్గంలోని ఆర్కే పురం ఫ్లైఓవర్ నూతనంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కూరగా దీనిపై ప్రభుత్వం స్పందించి వెంటనే నూతన ఫ్లైఓవర్ కోసం మార్గదర్శకాలు విడుదల చేసిందని, మల్కాజిగిరి నియోజకవర్గం లోని పలు రైల్వే క్రాసింగ్ వద్ద ఆర్ యు బి నిర్మాణం కోసం శాంక్షన్స్ చేపించామని తెలిపారు.

========================

# కల్లలవుతున్న డాలర్ డ్రీమ్స్...

హైదరాబాద్, మార్చి 27,

కల్లలవుతున్న డాలర్ డ్రీమ్స్.. ఏ క్షణాన్నయినా ఏ కార్డయినా.. రద్దయే ప్రమాదం..! ఎఫ్1 వీసాదారుల కష్టాలు ఇలా ఉంటే.. ఉద్యోగం చేస్తూ ఊ1ః వీసాలు తీసుకుని స్థిరపడ్డ తెలుగోళ్ల పరిస్థితి మరింత అగమ్యగోచరం. అమెరికాలో జారీ అయ్యే హెచ్1బీ వీసాల్లో 78 శాతం మనోళ్లవే. తర్వాత గ్రీన్‌కార్డు తెచ్చుకోడానికి దీన్ని ప్రధాన ఆధారంగా వాడుకుంటారు. ప్రస్తుతం 3 లక్షల 20 వేల మంది భారతీయులు హెచ్1బీ వీసాతో అమెరికాలో ఉంటున్నారు. కానీ.. ట్రంప్ సెకండ్ టర్మ్ స్టార్టయ్యాక వీళ్లక్కూడా సినిమా కష్టాలు స్టార్టయ్యాయి. ఉద్యోగాలకు భద్రతన్నదే కరువైపోయింది.ఇమ్మిగ్రేషన్ చట్టాలు కఠినతరం, ఊడుతున్న ఉద్యోగాలు, అక్రమ వలసదారుల ఏరివేత, ప్రత్యేక విమానాల్లో పంపివేత, అమెరికా సరిహద్దు గోడ దూకుతూ భారతీయుడి మృతి..! అగ్రరాజ్యంలో మనోళ్ల సినిమా కష్టాలపై ఇలా వరుసబెట్టి వస్తున్న వార్తలకు పరాకాష్ట ఏంటంటే.. అమెరికాలో అప్పుల బాధ తట్టుకోలేక, మానసిక ఒత్తిడి భరించలేక గుడివాడ విద్యార్థి ఆత్మహత్య. మనోళ్ల డాలర్ డ్రీమ్స్ బద్దలైపోతున్నాయనడానికి ఇంతకంటే లైవ్ ఎగ్జాంపుల్ ఇంకేం కావాలి? టౌన్ పక్కకెళ్లొద్దురా.. డౌనైపోతావురా అని నెత్తీనోరూ బాదుకున్నా ఎవ్వరి చెవికీ ఎక్కలేదు. ఏ బంగారు సామీ విన్న పాపాన పోలేదు. మెరికాలో డొనాల్డ్ ట్రంప్ 2.0 పాలనలో దూకుడు, స్పీడ్‌తో ప్రపంచ దేశాలతోపాటు అమెరికన్లు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఖర్చు తగ్గింపు పేరుతో అమెరికన్లను, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ పేరుతో విదేశీయులను ఇబ్బంది పెడుతున్నాడు. అక్రమ వలసదారులను దేశం దాటిస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలు కఠినతరం చేశారు. ఇక ఇప్పుడు వీసాల్లో కోత పెడుతున్నారు. తాజాగా విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనే కల చాలామంది విద్యార్థుల సొంతం. అందులోనూ అమెరికా వంటి అగ్రరాజ్యంలో చదువుకోవాలని ఆశపడేవారు ఎక్కువ. ఏటా ప్రపంచవ్యాప్తంగా



లక్షలాది మంది విద్యార్థులు ఈ లక్ష్యంతో అమెరికా బాట పడుతుంటారు. అయితే, గత కొంతకాలంగా అమెరికా ప్రభుత్వం విద్యార్థి వీసాలు (ఈ?1)పై కఠిన వైఖరి అవలంబిస్తూ వీసా జారీల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తోంది. 2023?24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41% వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి, ఇది గత దశాబ్దంతో పోలిస్తే దాదాపు రెట్టింపు.అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం, 2023?24లో 6.79 లక్షల ఈ?1 వీసా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2.79 లక్షలు (41%) తిరస్కరించబడ్డాయి. 2022?23లో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షలు (36%) ఆమోదం పొందలేదు. దీనికి భిన్నంగా, 2013?14లో 7.69 లక్షల దరఖాస్తుల్లో 1.73 లక్షలు (23%) మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. ఈ గణాంకాలు వీసా తిరస్కరణ రేటు గత పదేళ్లలో రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిందని స్పష్టం చేస్తున్నాయి.భారతీయ విద్యార్థుల విషయంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. 2024 తొలి 9 నెలల్లో ఈ?1 వీసాల జారీ 38% తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జనవరి నుంచి సెప్టెంబరు వరకు కేవలం 64 వేల మందికి వీసాలు మంజూరయ్యాయి, అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉంది. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఇంతగా తగ్గడం ఇదే మొదటిసారి.

ఈ?1 వీసా అంటే ఏమిటి?

ఇది నాన్?ఇమిగ్రెంట్ వీసా, అమెరికాలో ఫుల్?టైమ్ విద్య కోసం విదేశీ విద్యార్థులకు అనుమతినిస్తుంది. అమెరికా విద్యాసంస్థలు ఏటా రెండు సెమిస్టర్లలో (ఆగస్టు?డిసెంబర్, జనవరి?మే) ప్రవేశాలు కల్పిస్తాయి. భారతీయ విద్యార్థులు ఎక్కువగా ఆగస్టు సెమిస్టర్‌లో వెళ్తారు. అయితే, కఠిన వీసా విధానాలతో ఈ కలలు కల్లలవుతున్నాయి. ఈ తిరస్కరణల వెనుక అక్రమ వలసలను అరికట్టడం, వీసా నిబంధనలను కఠినతరం చేయడం వంటి కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో, విద్యార్థులు ఆర్థిక స్థిరత్వం, సరైన డాక్యుమెంటేషన్, చదువు తర్వాత స్వదేశం తిరిగి వెళ్లే హామీని స్పష్టంగా చూపించాల్సి వస్తోంది.అమెరికా టౌన్ మీద మోజు పెంచుకుని.. చదివితే అక్కడే చదవాలని ఉద్యోగం చేస్తే అక్కడే చెయ్యాలని అప్పుడు కన్న డాలర్ డ్రీమ్స్ ఇప్పుడు ఒక్కటొక్కటిగా బద్దలైపోతున్నాయి. ఎదర బతుకంతా చిందరబందరే అని జ్ఞానోదయాలయ్యాక నిద్ర మత్తు వదిలించుకుని కొద్దికొద్దిగా రియాలిటీలోకి వస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాల్ని చించిపారేసి కొత్తకొత్త రూళ్ల కర్రతో బాదేస్తున్న ట్రంప్ ఐడియాలజీ మనోళ్ల ప్రాణాల మీదికొస్తోంది. అమెరికా ఆశల్లో తేలియాడిన లక్షలాదిమంది భారతీయులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. బెటర్ ఎడ్యుకేషన్, బెటర్ లివింగ్ కండిషన్లు, బెటర్ మనీ, బెటర్ ఆపర్చునిటీస్ కోసం మనోళ్లు ఆశగా చూసే దేశాలు యూకే, యూఎస్. ఆస్ట్రేలియా, కెనడా. ఏటా 13 లక్షల మంది భారతీయులు విదేశాలకు వెళ్తుంటే.. అందులో మన తెలుగువాళ్లే ఎక్కువ. ఆ తెలుగువాళ్లలో కూడా అమెరికా టూరేసేవాళ్లే ఎక్కువ. ఇప్పుడు అమెరికాలోనే వీళ్ల ఆశలన్నీ అడ్డం..

# క్షుద్రపూజల కలకలం

వరంగల్, మార్చి 27, (

మంత్రాలకు చింతకాయలు రాలవు అని కొందరు అంటారు కదా.. ఎందుకు రాలవో చూస్తామంటున్నారు కొందరు మాయగాళ్లు. ప్రజలను నమ్మించి, మాటల్తో మాయ చేసి ఓం భీమ్ భుష్ అని మంత్రాలు మాత్రం మారడం లేదు.

ప్రస్తుతం అంతరిక్షంలో రాకెట్లు దూసుకెళుతున్నాయి. అరచేతిలోనే ప్రపంచాన్ని చూడగలుగుతున్నారు. సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కానీ ఇలాంటి మూఢ నమ్మకాలు రాజ్యం



ఏలుతున్నాయి. చేతబడి, క్షుద్రపూజల పేరుతో జనాలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. తాజాగా జనగామ జిల్లాలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ఏకంగా యువతి లోదుస్తులు క్షుద్ర పూజలలో కనిపించడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.పాలకుర్తి గ్రామ శివారు దర్దపల్లి వాగులో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. కోడిని బలిచ్చి, పసుపు, కుంకుమ నిమ్మకాయలతో పూజలు చేసినట్లు అనవాళ్లు ఉన్నాయి. క్షుద్రపూజలు చేసిన స్థలంలో యువతి లోదుస్తులు లభించాయి. యువతికి చేతబడి చేసినట్లుగా స్థానికులు అనుమానిస్తున్నారు.అయితే అర్ధరాత్రి సమయంలో మంత్రాల శబ్దాలు విని కొందరు రైతులు.. ఘటనా స్థలానికి చేరుకున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అక్కడ రైతులను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు వారు తెలిపారు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దీని వెనుక ఎవరున్నారు. ఆ ముగ్గులో ఉన్న దుస్తులు ఎవరివి అన్న కోణంలో పరిశీలిస్తున్నారు. ఎవరైనా యువకులు కావాలనే వశీకరణం పేరుతో ఇలాంటి చర్యలకు పాల్పడవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారుఎవరు చేశారో ఎందుకు చేశారో తెలీదు. కానీ రోడ్లపై ఇలా భయంకరమైన పద్ధతిలో పూజలు చేయడం గ్రామాల్లో సంచలనంగా మారింది. స్త్రీ ఆకారంలో ముగ్గు వేయడం.. అందులో ఓ యువతి లో దుస్తులు ఉండటం చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సైకో పూజలు చేస్తుంది ఎవరు? చేయిస్తుంది ఎవరు పట్టుకుని జైల్లో వేస్తే.. వీళ్ల పవర్ ఏంటో తెలుస్తుందని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.మంత్రాల శబ్ధం వస్తున్న వైపు నెమ్మదిగా.. అడుగుల శబ్దం రాకుండా జాగ్రత్తగా వెళ్తున్నారు. ముందుకు వెళ్తున్నా కొద్దీ మంత్రాలు మరింత గట్టిగా వినిపిస్తున్నాయి. స్టెతస్కోప్ అవసరం లేకుండానే.. వాళ్ల గుండె చప్పుడు వాళ్లకే వినిపించేంతగా భయం పెరుగుతోంది. అయినా సరే.. వెనక్కి వెళ్లకుండా ఈ మంత్రాల సంగతేంటో తెలుసుకోవాలని నిర్ణయించుకుని ముందుకే సాగారు. కాస్త దూరం వెళ్లిన తర్వాత ఓ పొలం దగ్గర.. ముగ్గురు వ్యక్తులు కూర్చుకుని కనిపించారు. వాళ్లు అక్కడ ఏం చేస్తున్నారో తెలుసుకునేందుకు కాస్త వేగంగా అడుగులు వేసేసరికి.. ఆ అలజడి విన్న ముగ్గురు రైతులను చూశారు. ఇంకేముంది.. అన్నీ అక్కడే వదిలేసి మెరుపు వేగంతో అక్కడి నుంచి పారిపోయారు. వాళ్లను పట్టుకునేందుకు రైతులు కూడా ప్రయత్నించారు కానీ.. ఫలితం లేకపోయిందిఅప్పటివరకు ఆ ముగ్గురు కూర్చున్న దగ్గరి సన్నివేశం చూసి.. రైతులకు గుండెలు కడుపులోకి జారిపోయాయి. అక్కడ ఆ ముగ్గురు చేసింది.. మీరనుకున్నట్టుగానే క్షుద్రపూజే. అచ్చంగా పొలిమేర సినిమాలో చేసినట్టుగానే.. పసుపు, కుంకుమ, గులాల్‌తో ముగ్గేసి.. అందులో నిమ్మకాయలు పెట్టి, కోడిని కూడా బలిచ్చారు. అవన్నీ చూసి రైతులు భయపడగా.. అక్కడున్న మరో ఐటమ్ చూసి ఆశ్చర్యం కలిగింది. అదే.. అమ్మాయి లోదుస్తులు. అక్కడ క్షుద్రపూజ చేస్తున్నారు అందులో అమ్మాయికి చెందిన లోదుస్తులు ఉన్నాయంటే.. వాళ్లు ఎవరో యువతి మీద ఈ బ్లాక్ మ్యాజిక్ ప్రయోగిస్తున్నారని రైతులకు అర్థమైంది.గుండెలు గులాబ్ జాములయ్యే ఈ ఘటన.. జనగామ జిల్లాలోని పాలకుర్తి గ్రామ శివారు దర్ధపల్లి వాగులో చోటుచేసుకుంది. ఈ క్షుద్ర పూజల విషయం గ్రామంలో తెలియటంతో.. గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అసలు ఆ క్షుద్రపూజలు చేసిన ముగ్గురు వ్యక్తులు ఎవరూ..? వాళ్లు ఏ అమ్మాయి మీద బ్లాక్ మ్యాజిక్ చేశారన్నది.. ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ప్రపంచమంతా విజ్ఞానంతో అంతరిక్షంలోకి వెళ్తుంటే.. మన వాళ్లు మాత్రం ఇప్పటికీ పసుపు, కుంకుము, నిమ్మకాయలు, నల్లకోడి, వెంట్రుకలు అంటూ క్షుద్రపూజలు, బ్లాక్ మ్యాజిక్ అంటూ ఇంకా అర్ధరాత్రులు భయపెట్టే విన్యాసాలు చేస్తూనే ఉన్నారు. వాటిని చూస్తూ జనాలు భయపడుతూనే ఉన్నారు. అందులోనూ.. ఈ తాజా ఘటనలో ఓ అమ్మాయికి చెందిన లోదుస్తులతో క్షుద్రపూజలు చేస్తున్నారంటే.. ఎంతకు దిగజారిపోయారన్నది అర్థం చేసుకోవచ్చుముగ్గులు, నిమ్మకాయలు వేసి క్షుద్ర పూజలు చేయడం ఇటీవల ఎక్కడ బడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఓ పెద్ద మూఢ నమ్మకం అని వివరించనా.. కొంత మంది మాత్రం మూర్ఖంగా వ్యవహరిస్తూ.. ఇలాంటి పూజలు నిర్వహిస్తున్నారు. గుప్త నిధుల కోసం, ప్రత్యర్థులను నాశనం చేయడం కోసం క్షుద్రపూజలకు పాల్పడుతున్నారు కొందరు మూర్ఖులు.

# ఆస్తి పన్నుదారులకు తీపి కబురు

హైదరాబాద్, మార్చి 27

తెలంగాణ ప్రభుత్వం నగర, పట్టణ వాసులకు శుభవార్త చెప్పింది. జీహెచ్ఎంసీ పరిధిలో మాదిరిగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపులపై భారీ రాయితీని ప్రకటించింది. 90 శాతం వడ్డీ మాఫీతో ఒకేసారి పన్ను బకాయిలు చెల్లించుకునే అవకాశం కల్పించింది.గృహ వినియోగదారులకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్తి పన్ను చెల్లింపులకు భారీ రాయితీని ప్రకటించింది. ఏపీలో 50 శాతం కాగా, తెలంగాణ 90శాతం వరకు ఆఫర్ ఇచ్చింది. తెలంగాణలో అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీ వాసులకు శుభవార్త. ఆస్తి పన్ను బకాయిలను క్లియర్ చేయడానికి వన్ టైమ్ స్కీమ్ ప్రకటించింది.2024-25 ఏడాదికి 90 శాతం వడ్డీ మాఫీతో ఒకేసారి పన్ను బకాయిలు చెల్లించుకునే ఛాన్స్ కల్పించింది. ఈ పద్ధతి ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రమే అమలు చేస్తోంది. ఈ అవకాశ ఇక అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్నుపై 90 శాతం బకాయి వడ్డీని మాఫీ చేయనుంది.మార్చి 31 వరకు ఆస్తి పన్నుతోపాటు వడ్డీ కేవలం 10 శాతం చెల్లించే వారికి ఈ నిర్ణయం వర్తిస్తుందని ఆదేశాల్లో పేర్కొంది. జీహెచ్ఎంసీ తరహాలో అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 90 శాతం బకాయి వడ్డీని మాఫీ చేసే అవకాశాన్ని కల్పిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్-అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని గృహ వినియోగదారులు ఉపయోగించుకోవాలని కోరింది.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటీఎస్ స్కీమ్ అమల్లో ఉంది. చాలామంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఆపై పన్నులు చెల్లిస్తున్నారు కూడా. గతేడాది ఓటీఎస్ స్కీమ్‌ను తీసుకొచ్చింది ప్రభుత్వం. దీనివల్ల ఎంతో మంది ఆస్తి పన్ను చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఈసారీ సిటీ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెబుతున్నారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సర్కార్ ఆస్తి పన్ను బకాయి దారులకు శుభవార్త చెప్పింది.

# ముగ్గురు పిల్లలు ఉన్నా పోటీకి అర్హత

వరంగల్, మార్చి 27,

తెలంగాణ పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మె?దలైంది. గ్రామాల్లో ఏ నలుగురు ఓ చూట గూమి కూడినా ఎన్నికల గురించే చర్చించుకుంటున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు పలువురు ఆశావాహులు సిద్ధమయ్యారు. నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని వారు ఎదురు చూస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రచారం కూడా మె?దలుపెట్టారు. కొన్ని గ్రామాల్లో అయితే ప్రత్యేక మేనిఫెస్టోలు, సర్పంచ్ పదవి వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీగా పోటీ చేయాలనుకుంటున్న వారు పల్లెల్లోనే మకాం వేసి ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో మంచి, చెడులతో సంబంధం లేకుండా ప్రతి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమవుతున్నారు.అయితే ప్రస్తుతం ముగ్గురు పిల్లు ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీ చేయటానికి అవకాశం లేదు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం.. 1995 తర్వాత ముగ్గురు పిల్లలు ఉంటే స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు అనర్హులు. ఈ నిబంధన చాలా మంది ఆశావాహుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేయాలనుకుంటున్న నాయకులకు ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ముగ్గురు పిల్లలు ఉన్నా.. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించడంపై తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సైతం ప్రతిపాదనలు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు.ముగ్గురు పిల్లలు ఉన్నవారికి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. ఈ నిబంధనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బుధవారం అసెంబ్లీలో వెల్లడించారు. శాసనమండలిలో మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఆమోదించారు. గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క వెల్లడించారు. పట్టణ ప్రణాళిక కోసమే గ్రామాలను విలీనం చేస్తున్నామని చెప్పారు. ప్రజల అభిప్రాయం మేరకు కలెక్టర్లు పంపించిన ప్రతిపాదనల ఆధారంగా గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నామని సీతక్క వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో విలీనమైన గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం గురించి కూడా ఆమె మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా వేరే పథకం అమలు చేస్తామని చెప్పారు. దీనిపై ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు.కాగా, తెలంగాణలో మె?త్తం 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. 1,14,620 వార్డులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలను నిర్వహించనుంది. అందుకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే ఎస్ఈసీకి సమర్పించింది. గతేడాది ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం, జులైలో ఎంపీటీసీల పదవీకాలం ముగియగా.. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాలనను సాగిస్తున్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు తర్వాత నోటిఫికేషన్ రిలీజ్ అయ్యే ఛాన్సుంది.

## జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసిన జేఏసీ నాయకులు

కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):రాష్ట్ర టీజీఈ జేఏసీ పిలుపుమేరకు జిల్లా టిజిఇజేఏసీ స్టీరింగ్ కమిటీ జెఏసి చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ ల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేల సత్పతినీ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల సాధనకు సహకారం అందించాలని కోరడం జరిగిందనీ చెప్పారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి జేఏసీ నాయకులను పరిచయం చేస్తూ, ఉద్యోగులకు ఉన్నటువంటి సమస్యలపై ప్రభుత్వ ఉద్యోగులుగా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు పరుస్తామని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో ముందుండి తాము కూడా భాగస్వాములు అవుతామని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేస్తూ సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లా పాలన యంత్రాంగానికి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. మా ఉద్యోగులందరికీ పెద్ద దిక్కు ,మా చీఫ్ ఆఫ్ సర్వీసెస్ జిల్లా కలెక్టర్ గారేనని, విధి నిర్వహణలో మాకు ఏమైనా ఆటంకాలు ఏర్పడితే మా ఉద్యోగుల న్యాయపరమైన చిన్న చిన్న సమస్యలు తమరి దృష్టికి తీసుకువస్తామని అన్నారు.ఆ క్రమంలో జిల్లా కలెక్టర్



సానుకూలంగా స్పందించిందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగుల నరసింహస్వామి, జేఏసీ కమిటీ కో చైర్మన్ లు కరుణాకర్ రెడ్డి, పి ఆర్ టియుకట్టా రవీంద్రా చారి, ఎస్టీయూ తూముల తిరుపతి, నాయకులు పెద్ది విజయ్, ముల్కలకుమార్, శశిధర్ శర్మ, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కోటా రామస్వామి, సునీత, విజయలక్ష్మి, స్వరూప, భాగ్యలక్ష్మి, భూపేందర్ కౌర్, కిరణ్ కుమార్ రెడ్డి, సర్దార్ హర్మేందర్ సింగ్, మారుపాక రాజేష్, జేఏసి నాయకులు పాల్గొన్నారు.

## రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బాగం ఎన్నిక


### -రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 27:తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులుగా తిరిగి బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. నిజామాబాద్లో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో హేమంతరావును తిరిగి రెండవ సారి రాష్ట్ర అధ్యక్షునిగా మహాసభఎన్నుకుంది. నేలకొండపల్లి మండలం ముటాపురం గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన హేమంతరావు విద్యార్థి, యువజన ఉద్యమాలలో చురుకైన పాత్ర నిర్వహించారు.

విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షునిగా, కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేసిన హేమంతరావు సుదీర్ఘ కాలం సిపిఐ ఉమ్మడిజిల్లా కార్యదర్శిగా అవశేష ఖమ్మంజిల్లా కార్యదర్శిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, జాతీయ సమితి సభ్యులుగా పనిచేస్తున్నారు. రైతాంగ సమస్యలపై ప్రత్యేకించి వ్యవసాయ రంగంపై పూర్తి అవగాహన కలిగిన హేమంతరావు రైతు సంఘం అధ్యక్షునిగా ఎన్నిక కావడం అభినందనీయం. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పక్షాన రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామన్నారు. మోడీ పాలనలో వ్యవసాయ రంగం వివక్షకు గురైందని రైతాంగ ఉద్యమాలను అణిచివేసేందుకు తప్ప సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం లేదని ఆయన ఆరోపించారు. వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు గిట్టుబాటు ధర కోసం వ్యవసాయోత్పత్తులకు మార్కెటింగ్ కల్పన కోసం వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నేతృత్వంలో పోరాడతామని హేమంతరావు తెలిపారు. ఖమ్మంజిల్లా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు దొండపాటి రమేష్ మిడికంటి వెంకట రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## సిఎం సభ ప్రాంగణాన్ని పరిశీలించి,పలు సూచనలు చేసిన మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 27:హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి విచ్చేసి ఉగాది (మార్చి 30)రోజు ప్రతి ఒక్కరికి ఆరు కేజీల సన్నం బియ్యం పంపిణీ ప్రారంభించేందుకు విచ్చేస్తున్న సందర్భంగా గురువారం సభ ఏర్పాట్లను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి ఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సభకి వచ్చే ప్రజలకి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ ఉండేలా హ్యాంగర్స్ ఏర్పాటు చేయాలని, త్రాగు నీరు, చల్లని త్రాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు.అధికంగా వాహనాలు వస్తాయి కాబట్టి ట్రాఫిక్ ని నియంత్రించాలని పార్కింగ్ స్థలాలకి అప్రోచ్ రోడ్లు రేపటిలోగా పూర్తి చేయాలని తెలిపారు.తదుపరి మంత్రి ల క్యాంప్ ఆఫిస్ నందు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో అధికారులకు పలుసూచనలు చేశారు సన్నబియ్యం పంపిణి కోరకు లబ్ధిదారుల ఎంపిక చేసి సిద్ధంగా ఉండాలన్నారు. లీడ్ స్క్రీన్ ప్రజలు తిలంకించె ప్రాంతాలలో పేట్టాలన్నారు,ప్రజలకు మజ్జిగ, చల్లని త్రాగునీరు అందుబాటులో ఉండాలన్నారు.పోలీసు బందోబస్త్,ట్రాఫిక్ నియంత్రణ చాల ముఖ్యమన్నారు.ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రజలకి కేజీకి 40 రూపాయల చొప్పున కొని దొడ్డు బియ్యం పంపిణి చేయటం వల్ల 8 వేల కోట్లు ఖర్చుపెట్టిన వాటిని ప్రజలు తినకుండా దుర్వినియోగం అయ్యాయని అందుకే ముఖ్యమంత్రి తో కలిసి మాట్లాడి సన్న బియ్యం పంపిణి చేస్తే తింటారని అలోచించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.సన్నబియ్యం పంపిణి వల్ల తెలంగాణ రాష్ట్రములో 84 శాతం మందికి లబ్ది చేకూరుతుందని ప్రతి ఒక్కరు సన్నబియ్యం తింటారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజలు అధికసంఖ్యలో పాల్గోని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పి నరసింహ,అదనపు కలెక్టర్ పి రాంబాబు, ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, వేణుమాధవరావు,డి ఎస్ ఓ రాజేశ్వర్, డి ఎం ప్రసాద్, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ డీఆర్డిఓకు "స్త్రీనిధి"లో రాష్ట్ర స్థాయి అవార్డు: అభినందించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):స్త్రీనిధి కార్యక్రమ అమలులో కరీంనగర్ డిఆర్డిఓకు రాష్ట్రస్థాయి మూడవ అవార్డు వచ్చిందనీ, 12 వ సర్వసభ్య సమావేశం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియం గచ్చిబౌలిలో జరిగింది. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి రాష్ట్ర స్థాయి మూడవ స్థానం పొందగా అవార్డును ప్రదానం చేశారు. స్త్రీనిధిలో గత ఆర్థిక సంవత్సరంలో 115 శాతం రుణ పంపిణీ, 90 శాతం రికవరీ చేసినందుకు గాను డి ఆర్ డి ఓ కు అవార్డు వచ్చింది. పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా కరీంనగర్ జిల్లా అదనపు డీ ఆర్డి ఓ సునీత అవార్డు అందుకున్నారు. అవార్డ్ అందుకోవడం పట్ల జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి డిఆర్డిఓను, సిబ్బందిని అభినందించారు. పేద మహిళలకు స్త్రీనిధి మరిన్ని సేవలు అందించాలని అన్నారు. సంస్థ అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి పొందాలని అన్నారు. తద్వారా



ఆర్థిక సాధికారత సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీ ఆర్ డివో శ్రీధర్, అపిడి సునీత, స్త్రీనిధి ఆర్ ఎం మధార్, మెప్మా పిడి వేణు మాధవ్ పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసిన పాస్టర్లు

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి27:హుజూర్ నగర్ పట్టణంలోని వర్తక సంఘం భవనంలో గురువారం పాస్టర్ల ఆధ్వర్యంలో ఆత్మీయ క్షేమాభివృద్ధి కూడిక నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ నియోజక వర్గ క్రిస్టియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ శామ్యూల్ గుండు అధ్యక్షతన నిర్వహించగా సుమారు 300 మంది పాస్టర్లు పాల్గొని ప్రముఖ క్రైస్తవ ప్రబోధకడు గ్రంథాల వక్త పాస్టర్ ప్రవీణ్ పగడాల రాజమండ్రి సమీపంలో అనుమానస్పదముగా మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని మరియు వారి కుటుంబమునకు ఆదరణ కలగాలని హుజూర్ నగర్ క్రైస్తవ పాస్టర్లు ప్రార్థనలు చేశారు.ముఖ్య అతిథులుగా పాస్టర్ సిల్వి సిలోయం పాల్గొని పాస్టర్ ప్రవీణ్ పగడాల



ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసి ప్ల కార్డ్స్ తో నివాళులు అర్పించారు. పాస్టర్ యెహెూషాపాతు, పాస్టర్ శ్రీను నండిపాటి,పాస్టర్ జాన్ పాల్ రామినేని, పాస్టర్ జీవన్ కుమార్,పాస్టర్ ప్రసాద్ సంద్రపంగు, పాస్టర్ పాల్ రాజు,పాస్టర్ రూబెన్ సన్,అభిషేక్, ఇస్సాకు మరియు తదితర పాస్టర్లు విశ్వాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కి రుణపడి ఉంటాం.



మందమర్రి టౌన్, మార్చి 27(భారత శక్తి): చెన్నూరు ఎమ్మెల్యే వివేక వెంకట స్వామికి రుణపడి ఉంటామని అభయ ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ యాదవ సంఘం నాయకులు బండి సదానందం యాదవ్ తెలిపారు. గురువారం పాత బస్టాండ్ లోని మారుతి నగర్ అభయాంజనేయ స్వామి ఆలయం లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ తరపున భక్తుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు మందమరి పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే వివేక్ కు ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఆలయానికి వెళ్లే దారిలో చెట్లు వృక్షాలు పెరిగి పెద్దవి కావడంతో ఇబ్బందిగా మారిందని ఎమ్మెల్యే చెప్పడంతోనే వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ కు చర్యలు చెప్పటి భక్తులకు ఇబ్బంది కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారని వెంటనే వాహనాలు వెళ్లే విధంగా ర్యాంపు కూడా ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు.

చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారనిఏ మ్మెల్యేను ఎవరు విమర్శలు చేసిన సహించేది లేదని హెచ్చరించారు. ఎంపీగా గడ్డం వంశీకృష్ణ ఎమ్మెల్యేగా వివేక్ నిరంతరం ఈ ప్రాంత అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 6న జరిగే శ్రీరామనవమి కి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కల్యాణాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ చేసినపర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి )మార్చి 27:సూర్యాపేట నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు 36వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ ఫారుక్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా 120 నిరుపేద కుటుంబాలకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి చేతుల మీదుగా రంజాన్ తోఫా అందించారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూమహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిన రంజాన్ మాసంలో నెల రోజులపాటు ఎంతో నియమనిష్ఠలతో ముస్లిం సోదరులు కఠిన ఉపవాస దీక్ష ఆచరించి అల్లాహ్ కృపకు పాత్రులవుతారన్నారు. ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో వారు అనేక దైవకార్యాలు చేస్తారని, ప్రతిరోజూ ఐదు సార్లు ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారని, ఈ నెలలోనే అల్లా దైవదూత ద్వారా ఖురాన్ను ఆకాశం నుంచి నేల మీదకు పంపించారని ముస్లింల ఈ నమ్మకమని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ హెూదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## స్టిచ్చింగ్ కేంద్రాలు ప్రైవేటుకు ఆర్డర్లు ఇవ్వాలి

### సెర్ఫ్ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేష్ కుమార్

### పాల్గొన్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతీ

కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):సెర్ఫ్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదటమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, సెర్ఫ్



కార్యక్రమాల పై సెర్ఫ్ సీఈఓ డి. దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ లో సెర్ఫ్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గతంలో కరీంనగర్ జిల్లాలో 49 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత యాసంగి సీజన్ లో సుమారు 150 కేంద్రాల వరకు పెంచనున్నామని అన్నారు. యూడిఐడి కార్డుల మంజూరు ప్రక్రియలో భాగంగా దివ్యాంగులను నిర్ధారించేందుకు అవసరమైన పరికరాలు ఆసుపత్రిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దివ్యాంగులకు ఇదివరకే సమావేశం నిర్వహించి యు డి ఐ డి కార్డులపై అవగాహన కల్పించామని చెప్పారు. ఆప్తమాలజీ, ఈ.ఎన్.టి టెక్నీషియన్ల కోసం ప్రతిపాదనలు పంపామని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ శ్రీధర్ పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య కు నిరసనగా భారీ నిరసన ర్యాలీ

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 27:సూర్యాపేట ఖమ్మం రోడ్డు లోని అంబేద్కర్ బొమ్మ సెంటర్ లో గురువారం సూర్యాపేట నియోజకవర్గ మరియు పట్టణ పాస్టర్స్ ఫెలోషిఫ్, రీచ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య పై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో తెలంగాణా మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు ఇరుగు సంసోను, ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల క్రైస్తవ నాయకులను హత్య చేసిన దుండగులు ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని,న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం చేస్తామని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్,వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రదర్ బొజ్జ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల హత్య ను తీవ్రంగా



ఖండిస్తున్నామని, ఇది హేయమైన పిరికి పంద చర్య అనీ అన్నారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రదర్ బొల్లు జాన్ పాల్,రెవ పంది మార్క్,పట్టణ కోశాధికారి పాస్టర్ స్పర్జన్ రాజు, పాల్వాయి అజయ్ పాస్టర్ సామెల్ 100 మంది పైగా పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 27: నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయితీ రాజ్ అధికారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. వివిధ జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలంతా అన్ని పండుగలను కలిసికట్టుగా సహోదర భావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని మతాల సారం ఒకటేనని, ప్రజలంతా కలిసికట్టుగా ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు.

సమాజ సేవ, దయాగుణం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖలో బయోమెట్రిక్ హాజరు అమలు!



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 27: నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల లో బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. గతంలోనే అన్ని ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా హాజరును పర్యవేక్షించడం జరిగిందని అయితే సాంకేతిక ఇబ్బందుల వల్ల బయోమెట్రిక్ మరమ్మత్తుల వల్ల కొంతకాలంగా కొన్ని ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ పనిచేయలేదని తెలిపారు. వాటన్నిటిని కూడా మరమ్మత్తులు చేయించి అవసరమైన చోట కొత్త వాటిని బిగించి ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ హాజరును రేపటి నుంచి అమలు చేస్తున్నట్టు తెలిపారు.

# ఉన్నత స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్






ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 27: తనికెళ్ళలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి అధికారి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళల పట్ల చిన్న చూపు ఉన్న దశలో ఎలాంటి చర్చ లేకుండానే మహిళలకు ఓటు హక్కును మన భారత దేశం కల్పించిందని అన్నారు. ఆర్థికంగా బలోపేతం కాక పోవడమే మహిళల పట్ల ఉన్న వివక్షకు కారణమని గమనించిన ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు ప్రారంభించిందని అన్నారు. చదువులో బాలుర కంటే అధికంగా బాలికలు రాణిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఆడపిల్ల పుడితే గర్వ కారణం అని చాటి చెప్పేందుకు జిల్లాలో గర్ల్ ఫ్రైడ్లి అనే వినూత్న కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, జిల్లాలో ఎక్కడ ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారి స్వీట్ బాక్స్ తో వెళ్ళి ఆ కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం సంక్షేమ హాస్టల్లో ఉన్న బాలికలకు అధిక బాధ్యత ఉందని, మిమ్మల్ని ఆదర్శంగా తీసుకునేందుకు చాలామంది ఎదురు చూస్తున్నారని, మీరు రాణించి అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకొని నలుగురికి ఆదర్శం కావాలని కలెక్టర్ తెలిపారు. గత తరాల మహిళలకు చదువుకునేందుకు అవకాశాలు లభించలేదని, తన అమ్మమ్మ పెళ్లి తర్వాత చదువుకున్నారని, ప్రస్తుతం తమ కుటుంబం అంతా చదువుకొని మంచి స్థానంలో ఉండేందుకు అమ్మమ్మ కారణమని, తన భార్య కూడా యూపిఎస్సి రాసి ఢిల్లీలో ఉన్నత బాధ్యతలో ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు ధైర్యం కల్పించి ఎన్నికల విధులు కేటాయిస్తే చిత్తశుద్ధితో నిర్వహించి నాలుగు కోట్ల నగదు, మద్యం, బంగారం జప్తు చేసి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణలో కీలకమైన పాత్ర పోషించారని కలెక్టర్ తెలిపారు. మహిళలకు చేయలేని పని అంటూ ఏదీ ఉండదని, మనలో ఉన్న సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవాలని అన్నారు. మన జీవితంలో ధైర్యం చేస్తేనే పైకి ఎదుగుతామని, ఇతరుల మాటలు పట్టుకుంటే ఏమీ సాధించలేమని అన్నారు. ప్రతి రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని ప్రతి మహిళ నిర్దేశించుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉత్తమమైన ప్రతిభ కలిగిన విద్యార్థినులు ఉన్నారని, వీరికి ప్రైవేట్ కంపెనీలోఅవకాశం కల్పిస్తే తప్పనిసరిగా రాణిస్తారని, కంపెనీలకు విశ్వాసంగా ఉంటూ వాటి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు. చిన్నతనంలో 7వ తరగతి చదివే సమయంలో విజయలక్ష్మి మేడం అనే టీచర్ బోధన పద్ధతులు మార్చి తనపై తీసుకున్న శ్రద్ధ కారణంగానే తాను నేడు కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని అన్నారు. టీచర్ల విలువ ఎప్పటికీ మర్చిపోవద్దని, వారి శ్రమ ఫలితం వృధా కాకుండా ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత మనం మరో నలుగురికి సహాయం చేయాలని, సమాజంలో ఇతరుల అభివృద్ధికి మనం తోడ్పాటు అందిస్తే వచ్చే సంతృప్తి మరో కార్యక్రమంలో ఉండదని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మాట్లాడుతూ మా పాప మా ఇంటి మణి దీపం అనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. చదువు మాత్రమే మనల్ని కాపాడుతుందని, ఈ అంశం ప్రతి మహిళ గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రస్తుత జాబ్ మేళాలో మనకు వచ్చేది మొదటి అవకాశం మాత్రమేనని, హైదరాబాద్, బేంగళూరు వంటి నగరాల్లో అనేక అవకాశాలు వస్తాయని, మన ప్రతిభను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలించారు. అంతకు ముందు ప్రిన్సిపాల్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురుకులం నిర్వహణ, అభివృద్ధి పనులపై సమీక్షించారు. జాబ్ మేళాలో వచ్చిన కంపెనీలు, ఉపాధి అవకాశాల గురించి చర్చించారు. జాబ్ మేళాలో ఎంపికైన మహిళలకు ఫైనాన్షియల్ ప్లానింగ్ పై శిక్షణ అందించాలని అన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చాలా ముఖ్యమని అన్నారు. ప్రస్తుతం వచ్చే జాబ్స్ ఎలా ఉంటాయ్, భవిష్యత్తులో ఎటువంటి అవకాశాలు వస్తాయి, ఎటువంటి కోర్సులు నేర్చుకోవాలి, రాబోయే రోజుల్లో మరో డిగ్రీ ఎలా పొందాలి వంటి అంశాలను ప్లాన్ చేసుకునేలా మహిళలను సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. గురుకుల హాస్టల్ లో ఫర్నిచర్, బుక్స్ కోసం ప్రతిపాదనలు అందించాలని అన్నారు. మార్చి లోపు గ్రౌండ్ చేసేందుకు ఆస్కారం ఉన్న ప్రతిపాదనలు మాత్రమే పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. రజిత, ఉపాధ్యాయులు, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థినులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు: జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల







భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 27: నిర్మల్ జిల్లాలోని ముస్లిం సోదరులకు మరియు వారి కుటుంబ సభ్యులకు పవిత్ర "రంజాన్" (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా ముందస్తుగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్ పట్టణంలో పనిచేస్తున్న ముస్లిం సోదరులకు రంజాన్ మాస ఉపవాసాల సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 రోజులు నమాజ్ మరియు ఉపవాస దీక్షలు పూర్తి చేసుకొంటూ మరియు తమ విదులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీస్ అధికారులు అందరూ సహకరించినందుకు ధన్యవాదలు. రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 02 నుండి ప్రారంబం అయ్యాయి , ఒక నెల పాటు ఉపవాసం ఉంది అల్లా ను ప్రార్ధిస్తారు. రంజాన్ మాసం లో ముస్లిం సోదరులు ఎక్కువ సమయం ప్రార్ధనలు చేస్తారు . ఇస్లాం యొక్క అయిదు సూత్రాలలో ఉపవాసం ఒకటి. కుటుంబం మరియు స్నేహితులతో కలసి భోజనం చేస్తారు . ఏదయినా తప్పులు జరిగితే క్షమించమని అల్లాహ్ ను ప్రార్ధిస్తారు. సాయత్రం ఉపవసనికి ముగించటానికి చేసేది ఇఫ్తార్ . ఈ ఇఫ్తార్ విందులో పోల్గోన్నదుకు అందరికి కృతజ్ఞతలు. ఈ కార్యక్రమలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్ , రాజేష్ మీన, ఏ.ఒ యునుస్ అలి, ఇన్స్పెక్టర్ లు అజయ్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, సైలు, గోపినాథ్, ప్రేమ్ కుమార్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, మల్లేష్, సమ్మయ్య, ఆర్ ఐ లు రాం నిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేష్, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్.ఎచ్.ఓ లు, ఆర్ఎస్ఐ లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పండుగ వాతావరణం లో సన్న బియ్యం పంపిణి చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 27:రేషన్ షాప్ లలో మామిడి తోరణాలు, పూల దండలు కట్టి పండుగ వాతావరణం లో సన్నబియ్యం పంపిణి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సన్న బియ్యం పంపిణి గురించి రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉగాది రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హుజూర్ నగర్ లో సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఏప్రియల్ 1 నుండి ప్రతి రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిణి చేయాలని సూచించారు. సూర్యాపేట రైతులు పండించిన పంట మిల్లులో మర ఆడించి సన్నబియ్యం ను సూర్యాపేట పేదలకి పంపిణి చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో తినడానికి ఆహారం లేక ఇతర దేశాల నుండి మనం ధాన్యాలు దిగుమతి చేసుకున్నాం కానీ నేడు మన జిల్లా నుండి 10 నుండి 15 రకాల సన్న దొడ్డు రకం వడ్లను పండించి ఇతర జిల్లాలకి, రాష్ట్రాలకి ఎగుమతి చేసే స్థాయి కి ఎదిగామని ఇది విప్లవాత్మక మార్పు అని కలెక్టర్ అన్నారు. దొడ్డుబియ్యం చాలా మంది తినకుండా వివిధ మార్గాలలో దుర్వినియోగం అయినాయనితెలంగాణలో ప్రజలు సన్నబియ్యం ఎక్కువ తింటారు కాబట్టి ప్రభుత్వం పేదలందరికీ సన్నబియ్యం ఉచితంగా పంపిణి చేసి ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం ఇస్తుందని ఎట్టి పరిస్థితిల్లో సన్నబియ్యం స్థానం లో దొడ్డుబియ్యం ఇవ్వకూడదని సన్నబియ్యంలో ఎఫ్ ఆర్ కె(ఫోర్ట్ ఫైడ్ రైస్ కేర్నల్స్) పోషకాలతో కూడిన గుళికలు ఉంటాయని అవి ప్లాస్టిక్ బియ్యం కావని ప్రజలకి డీలర్లు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ -పాస్ మిషన్ ద్వారా రేషన్ కార్డులో ఎంతమంది ఉంటే అంతమందికి మనిషికి 6 కేజీ ల చొప్పున ఉచితంగా పంపిణి చేయాలని, తూకంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని అన్నారు. ఏప్రియల్ 1 వ తేదీనాడు జిల్లాలోని 610 షాప్ లు తప్పకుండా ఉదయం 8 గంటల నుండి బియ్యం పంపిణి ప్రారంభించాలని జనాలు ఎక్కువ వస్తారు కాబట్టి ఏర్పాట్లు చేసుకోవాలని రేషన్ షాప్ లను సివిల్ సప్లై అధికారులు పరిశీలించాలని, %వ% పాస్ మిషన్ లో ఏమైనా సమస్య ఏర్పడితే పై అధికారులకి తెలియపర్చాలని అన్నారు. తదుపరి జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం పంపిణి చేస్తుందని, అన్ని దానాలలో అన్నదానం గొప్పది కాబట్టి పేదవాడి ఆకలి తీర్చే సన్నబియ్యం పంపిణి మహోత్మక కార్యక్రమంలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషించి ఎలాంటి సమస్య లేకుండా పేదలకు బియ్యం పంపిణి చేయాలని ఏప్రియల్ 1 నుండి 15 వ తారీఖు వరకు ఉదయం 8 నుండి 11 వరకు సాయంత్రం 5 నుండి 8 వరకు సమయపాలన పాటిస్తూ వందశాతం పంపిణి చేయాలని తెలిపారు. సన్నబియ్యం లో ఎలాంటి అవకతవకలు జరిగితే డిపార్ట్మెంటల్ చర్యలతో పాటు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. రేషన్ షాప్ లను తహసీల్దార్ లు, డి టి లు, విజిలెన్స్ అధికారులు, టాస్క్ పోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ లు చేస్తారని తెలిపారు. రేషన్ షాప్ లలో ప్రస్తుతం ఉన్న దొడ్డు బియ్యంను కమిషనర్ తదుపరి సూచనలు వచ్చేంత వరకు భద్రపర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో డి ఎస్ ఓ రాజేశ్వర్, డి ఎం ప్రసాద్, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ లు, డి టి లు, రేషన్ డీలర్ల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హామీలు అమలు చేయాలి: టీయూడబ్ల్యూజే, ఐజేయూ

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 27: గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ నిర్మల్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంక గారి భూమయ్య డిమాండ్ చేశారు. ముఖ్యంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ ఎమ్మెల్యేలకు తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకాశం కల్పించాలని వారు సూచించారు. గతంలో నియోజకవర్గ ఎమ్మెల్యేలు గెలిస్తే ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం కల్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, గృహనిర్మాణానికి ఎమ్మెల్యేలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

::మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్లు జర్నలిస్టులకు అందించాలి.:

జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతల నిమిత్తం నిరంతరం గ్రామాలు, మండలాల్లో తిరుగుతూ, ప్రభుత్వం - ప్రజల మధ్య వారధిగా పని చేస్తుంటారని, వారి వసతి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.



మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్లలో కొన్ని గృహాలను జర్నలిస్టులకు కేటాయించడం ప్రజా ప్రతినిధులకు పెద్ద సమస్య కాకూడదని, స్థానికంగా అందుబాటులో ఉన్న ఇళ్లను వారికి కేటాయించాలని కోరారు. జర్నలిస్టులు తమ సొంత గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నా, వాటిని ప్రత్యేకంగా పరిశీలించి అనుమతించాలన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్‌తో చర్చించి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

# 2నుంచి గ్రామ గ్రామాన ప్రజా చైతన్య యాత్ర ముఖ్యకార్యకర్తల సమావేశంలో పురుమల్ల



కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):ఏప్రిల్ 2నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రజా చైతన్య యాత్రను చేపట్టాలని అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల పిలుపునిచ్చారు... "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమాన్ని.. పురస్కరించుకొని గురువారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ పురుమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండల, టౌన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రా హోం శాఖా మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానపరిచేలా చేసిన వాఖ్యలకు నిరసనగా ఎఐసీసీ పిలుపుమేరకు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఏప్రిల్ 2వ తేదీ నుండి 10 వ తేదీ వరకు "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ప్రజా చైతన్య యాత్ర చేపట్టాలని చెప్పారు.

ప్రతీ కార్యకర్త పాల్గొని ప్రతి గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిని తిరుపతి, కొత్తపల్లి మండల అధ్యక్షులు పంజాల స్వామి గౌడ్, కొత్తపల్లి టౌన్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షులు కాం రెడ్డి రాం రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు సిరిపురం నాగ ప్రసాద్, నగర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, 19డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలబద్రి శంకర్, జిల్లా నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి, కొత్తపల్లి మండల గ్రామాల అధ్యక్షులు, కొత్తపల్లి డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియార్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జడ్పీ చైర్మన్ గా ఎన్నికైన వైఎస్ఆర్సిపి పార్టీ అభ్యర్థి ముత్యాల రామగోవింద రెడ్డి

## -ప్రకటించిన జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి శ్రీధర్ చెరుకూరి











వైయస్సార్ జిల్లా, మార్చి 27(భారత శక్తి ): కడప జిల్లా జడ్పీ చైర్మన్ గా వైయస్సార్సీపీ బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి సభ్యులు రామ గోవిందరెడ్డి ఎన్నికయ్యారు.గురువారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎన్నిక ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నేతృత్వంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ, ఎన్నికల అధికారి ఓబులమ్మ పాల్గొన్నారు.ముందుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కడప జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పదవి కి అభ్యర్థిని ప్రతిపాదించాలని జెడ్పీటీసీ సభ్యులను కోరడంతో.. పోరుమామిళ్ల జడ్పిటిసి సభ్యులు ముత్యాల ప్రసాద్ చెన్నయ్య, వేముల జడ్పీటీసీ కోకటం వెంకట బయపురెడ్డిలు బి. మఠం జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల రామగోవింద రెడ్డి పేరును ప్రతిపాదించడంతో పాటు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు.తదుపరి ఏ ఒక్క అభ్యర్థి పేరును కూడా ప్రాదేశిక సభ్యులు ప్రతిపాదించకపోవడం, వైఎస్ఆర్సిపికి చెందిన ప్రాదేశిక సభ్యుల కోరం కూడా సరిపడా ఉండడంతో బి.మఠం మండలానికి చెందిన ముత్యాల రామ గోవిందా రెడ్డిని వైఎస్ఆర్ జిల్లా పరిషత్ చైర్మన్ గా జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించడం జరిగింది. అనంతరం వైఎస్ఆర్ జిల్లా పరిషత్ చైర్మన్ గా ముత్యాల రామ గోవింద రెడ్డితో.. జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది.అమలులో వున్న శాసనం, రాజ్యాంగం పట్ల శ్రద్ధతో స్వీకరించ బోవు బాధ్యతలను సత్యనిష్టతో భగవంతుని సాక్షి గా నిర్వహిస్తానని జడ్పీ చైర్మన్ గా ఎన్నికైన ముత్యాల రామ గోవిందరెడ్డితో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రమాణ స్వీకారం చేయించారు.అంతకుముందు ఉదయం 10 గంటలకు బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి సభ్యుడు ముత్యాల రామ గోవిందరెడ్డి జడ్పీ సీఈఓ ఓబులమ్మకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట కడప ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఆర్.వి రమేష్ యాదవ్, యం వి.రామచంద్రారెడ్డి,డిసీ గోవింద రెడ్డి,ఇతర నేతలు పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 50 మంది జెడ్పీటీసీ సభ్యులుండగా ఇందులో పులివెందుల జెడ్పీటీసీ, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలు ఖాళీ ఏర్పడగా ప్రస్తుతం జిల్లా పరిషత్లో 48 మంది జెడ్పీటీసీ సభ్యులున్నారు. వారిలో గోపవరం మండల జెడ్పీటీసీ జయరామిరెడ్డి మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా అందరూ వైఎస్సార్సీపీ నుంచి ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులే వుండడంతో జడ్పిటిసి అధ్యక్ష ఎన్నిక లాంఛన ప్రాయంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, జిల్లా పరిషత్ కో ఆప్షన్స్ సభ్యులు,జడ్పిటిసి సభ్యులు , తదితరులు, పాల్గొన్నారు.

# సిఎం, డిప్యూటీ సీఎంలను కలిసిన జర్మన్ పారిశ్రామిక వేత్త స్టీఫెన్

## తాటి, ఇత కల్లుతో వైన్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని వినతి

## పాల్గొన్న మంత్రి పొన్నం, పీసీసీ చీఫ్ బొమ్మ



కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):తెలంగాణ రాష్ట్రంలో తాటి, ఈత చెట్ల నుండి వచ్చే కల్లుతో వైన్, ఆరక్ అనుబంధ పదార్థాలు తయారు చేసే పరిశ్రమను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గురువారం అసెంబ్లీలో జర్మన్ ప్రతినిధి స్టీఫెన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క లను కలిసారు.గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రొఫెసర్ జానయ్య కాంబోడియా స్టడీ టూర్ వెళ్ళినపుడు ఈ పరిశ్రమ ఎంతో ఆర్థికంగా ఎంతో మందికి ఉపాధికి అవకాశాలు కల్పిస్తుందని, అందుకోసమే తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు స్టీఫెన్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు తెలంగాణ లో కల్లు ఆధారిత పరిశ్రమల్లో భాగంగా తాటి ఈత చెట్ల నుండి వైన్, ఆరక్ తయారు చేసే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని జర్మన్ ప్రతినిధి స్టీఫెన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లతో కలిసి ముఖ్యమంత్రిని కలిసిన స్టీఫెన్ ఈ పరిశ్రమ తెలంగాణాలో ఏర్పాటు చేయడం వల్ల గీత కార్మికులు వృత్తి పరమైన ఆర్థికాభివృద్ధిని పొందడమే కాకుండా, వాల్యూ అడిషన్, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనీ వివరించారు. తెలంగాణ కల్లు యూరప్ కి ఎగుమతి స్థానికంగా కల్లు దుకాణాల ఏర్పాటు గీత కార్మికులకు కనీసం ఆదాయం పెంపుదల ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు మార్కెటింగ్ విస్తరణ తో పాటు రీసెర్చ్ డెవలప్మెంట్ విభాగం ఏర్పాటు చేయడంతో అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. తాటి, ఈత మొక్కలు త్వరగా పెరిగి అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాల తయారుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు.ఈ సమావేశంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పారిశ్రామిక వేత్త రోహిత్ పాల్గొన్నారు.

# జేఏసీ ముంజాల బిక్షపతిని జాతరకు ఆహ్వానించిన శ్రీకాంత్ గౌడ్



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 27 (భారత శక్తి) : బోలోని పల్లి గ్రామంలో నిర్వహించే పోచమ్మ తల్లి బోనాల జాతరకు ములుగు జిల్లా జేఏసీ అధ్యక్షుడు ముంజల బిక్షపతి గౌడ్ ను గురువారం జాతరకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేసిన తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ శ్రీకాంత్ వెంట మల్లంపల్లి మండల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గోల్కొండ రాజు, అనిల్, నాగరాజు, అల్లం ఓదెలు, ఎల్పి రామ్, గుండె మీది వెంకటేశ్వర్లు ఉన్నారు.

# మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలి: జేసీ అదితి సింగ్



కడప, మార్చి 27(భారత శక్తి ) : మత సంప్రదాయాలను గౌరవిస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో భక్తి భావంతో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకునేలా జిల్లా శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని జేసీ అదితి సింగ్ తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగల నిర్వహణపై జేసీ అదితి సింగ్ అధ్యక్షతన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, కడప మున్సిపల్ కమీషనర్ మనోజ్ రెడ్డి, కడప, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చిన్నయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ శాంతియుత ఆనంద వాతావరణంలో, ఒకరి మతాచారాలను మరొకరు గౌరవించుకుంటూ భక్తి శ్రద్ధలతో రంజాన్, ఉగాది, శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించుకుకోవాలని శాంతి కమిటీ సంఘం సభ్యులను ఆదేశించారు. అందు కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పండుగ ఏర్పాట్లు, ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో.. మజీద్ లు, ఈద్గాలు, దేవాలయాల వద్ద ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రార్థనలు, పూజలు జరిగేలా చూడాలన్నారు. పండుగ వేడుకల సమయంలో ఆలయాలు, మజీద్ ల అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారమివ్వలన్నారు. అనవసరమైన విషయాలను అత్యుత్సాహంతో సోషల్ మీడియాలలో పోస్తూ చేయడం వంటి చర్యలను అరికట్టేలా శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో పోలీసు శాఖ అప్రమత్తంగా వుండాలన్నారు. పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగ వేడుకలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతిభద్రతలకు, మతసామరస్యానికి ఇబ్బంది కలగకుండా ప్రార్థనలు, పూజలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను శాంతి కమిటీ సభ్యులు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ దినాల్లో నిరంతర నీటి సరఫరా, విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబందిత స?ల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై పలువురు శాంతి కమిటీ సంబుల అభిప్రాయాలను జేసీ స్వీకరించారు.సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు, పోలీసు శాఖ, వివిధ శాఖల అధికారులు, మైనారిటీ దేవాదాయ శాఖ అధికారులు, పలువురు అలయ అర్చకులు, మౌజమ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పి.ఎఫ్, ఈఎస్ఐ క్రమం తప్పకుండా చెల్లించాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):వారధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ క్రమం తప్పకుండా చెల్లించాలని సొసైటీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ వారధి సొసైటీ పదవ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగింది. సొసైటీ చైర్ పర్సన్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వారధి సొసైటీ 2015 లో ప్రారంభమైందని అన్నారు. ఇప్పటివరకు 85 వేల 129 మంది ఉపాధి, ఉచిత శిక్షణ కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. వారధి సొసైటీ ఆరు జిల్లాల పరిధిలో సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు. సొసైటీలో ఉన్న ఉద్యోగులందరికీ క్రమం తప్పకుండా ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ చెల్లించాలని సూచించారు. 2 వేల 997 మంది ఈ సంస్థ ద్వారా ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది 186 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రజల అవసరాల కోసం వారధి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు సంస్థ వార్షిక ఆదాయవ్యయాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ శ్రీధర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, సంస్థ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు: ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగేలా భూషణ్.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 27:

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు మరియు జిల్లా ప్రజలకు రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. రంజాన్ అనేది శుభ్రత, భక్తి, ఉపవాసం, ప్రార్థనలు, సహనం, దానధర్మాలు, పరస్పర ప్రేమకు ప్రతీకగా నిలిచే పవిత్ర మాసం.

ఒక్క నెల రోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షల అనంతరం, చందమామ దర్శనంతో రంజాన్ పండుగను ఎంతో ఆనందంగా, భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు.ఈ పవిత్ర రంజాన్ సందర్భంగా అందరి జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐక్యత నిండాలని మనసారా కోరుకుంటున్నాం. మత, మతాంతర భేదాలు లేకుండా సమాజంలో ప్రేమ, సహనము, సౌభ్రాతృత్వం పెరిగేలా ఈ రంజాన్ పండుగ అందరికీ స్ఫూర్తి కలిగించాలని ఆకాంక్షిస్తున్నాం.రంజాన్ పండుగ ప్రత్యేకతల్లో ఒకటైన జకాత్ (దానం) ద్వారా దరిద్రుల సహాయానికి ముస్లిం సోదరులు ముందుకు వచ్చి, సమాజంలోని వెనుకబడినవారికి సహాయంగా నిలుస్తారు. ఇదే స్ఫూర్తితో, మానవతా విలువలను పెంపొందించుకుంటూ, సర్వ మానవాళి మేలు కోరే హృదయంతో మనమందరం ముందుకు సాగుదాం.ఈ పవిత్ర పండుగ సందర్భంగా ప్రేమ, క్షమ, ఐక్యత వర్ధిల్లాలని, ప్రతి ఇంటా సంతోషం, సుఖశాంతులు వెల్లివిరియాలని మనసారా ప్రార్థిస్తూ, ముస్లిం సోదరులకు "ఈద్ ముబారక్!"

# అరులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలి

## -తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మానకొండూర్ తహశీల్దార్ కు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి అజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇళ్ల స్థలాలు, రైతు భరోసా, మహిళలకు 2500, గ్యాస్ 500,గ్రామీణ ఉపాధి కార్మికులకు 12,000,అమలు చేయాలని తహశీల్దార్ వివరించారు.. ప్రభుత్వ అధికారులకు వచ్చే సంవత్సరం గడిచిన, రాష్ట్ర ప్రభుత్వం హామీలన్నీ అమలు చేయాలని లేనియెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు,రవీందర్ ,మల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.





# బ్యాంక్ ఖాతాలో నలుగురు నామినీలు

ఢిల్లీ: బ్యాంకు ఖాతాదారులు ఒక్కో ఖాతాకు నలుగురు వరకు నామినీలను నియమించుకునేందుకు అవకాశం కల్పించే బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు, 2024ను పార్లమెంట్ ఆమోదించింది. ఈ బిల్లును గత డిసెంబరులో లోక్ సభ ఆమోదించగా, రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. నగదు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల సమయంలోనే నామినేషన్ వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. లాకర్ల విషయంలోనూ ఇదే నిబంధన వర్తిస్తుంది. ఇప్పటికే బీమా పాలసీలు, ఇతర ఆర్థిక సాధనాల్లో ఈ విధానం అమల్లో ఉంది.

సబ్‌స్టాన్షియల్ ఇంటరెస్ట్ పరిమితి పెంపు

'సబ్‌స్టాన్షియల్ ఇంటరెస్ట్' పరిమితిని ఒక వ్యక్తికి రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచారు. రూ.5 లక్షల పరిమితిని 6 దశాబ్దాల క్రితం నిర్ణయించారు. ఒక బ్యాంక్ వాటా మూలధనంలో 10 శాతానికి సమానమైన (అప్పట్లో గరిష్ఠ విలువ రూ.5 లక్షలు) వాటా కలిగిన వ్యక్తి- కుటుంబాన్ని సబ్‌స్టాన్షియల్ ఇంటరెస్ట్ కలిగిన వారుగా లెక్కిస్తారు. వీరికి రుణాల మంజూరులో కొన్ని అదనపు నిబంధనలుంటాయి. ప్రస్తుత విలువలను పరిగణనలోకి తీసుకుని, ఈ మొత్తాన్ని పెంచారు.

ఎగవేతదార్లపై కఠిన చర్యలే

రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిస్తూ బ్యాంకుల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) గణనీయంగా తగ్గినా, ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అయిదేళ్లలో బ్యాంకు మోసాలకు సంబంధించి 912 కేసులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేపట్టిందని, ఇందులో కొన్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు సంబంధించినవీ ఉన్నాయని వెల్లడించారు.

వసూలు ప్రక్రియ ఆగదు: 'రైట్-ఆఫ్' అంటే రుణాలను మాఫీ చేయడం కాదని ఆమె స్పష్టం చేశారు. సంబంధితుల నుంచి ఆ నిధులను వసూలు చేసే ప్రయత్నాలను బ్యాంకులు కొనసాగిస్తాయని మంత్రి తెలిపారు.

యూపీఐ లావాదేవీల్లో అంతరాయం

ఢిల్లీ: దేశీయంగా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవల్లో బుధవారం దాదాపు గంటసేపు అంతరాయం కలిగింది. చెల్లింపులు జరపలేక ఇబ్బంది పడ్డామని వేలమంది ఖాతాదారులు తెలిపారు. డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్‌లైన గూగుల్ పే, ఫోన్‌పే వినియోగదారులు ఇబ్బంది పడిన వారిలో ఉన్నారు. అరుదుగా తలెత్తే సాంకేతిక లోపాల వల్లే ఇలా జరిగిందని, ఇప్పుడు యూపీఐ లావాదేవీలు యథాతథంగా జరుగుతున్నట్లు నిర్వహణ సంస్థ ఎన్‌పీసీఐ వివరించింది.

: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగింపు రోజైన మార్చి 31న అన్ని బ్యాంకులూ పనిచేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసింది. రంజాన్ పండుగ కావడంతో వచ్చే సోమవారం చాలా రాష్ట్రాల్లో సెలవు రోజుగా ప్రకటించారు. అయినా, ప్రభుత్వ లావాదేవీలను సకాలంలో పూర్తి చేసేందుకు వీలుగా ఆ రోజున బ్యాంకులు పనిచేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన మార్చి 31 (సోమవారం)న ప్రభుత్వ ఆదాయాలు, ఇతర లెక్కలను కచ్చితంగా నమోదు చేయాలి. అందువల్ల ప్రభుత్వ లావాదేవీలను నిర్వహించే అన్ని బ్యాంకులూ ఆ రోజున సాధారణ పని గంటల్లో పనిచేయాలని ఆర్‌బీఐ తెలిపింది. ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయి. వార్షిక ఖాతాల ముగింపు నేపథ్యంలో ఏప్రిల్ 1న బ్యాంకులకు సెలవు ఉంటుంది.

# టెలిగ్రామ్‌లో ఇక గ్రోక్ ఏఐ.. వీరికి మాత్రమే




: బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ అంకుర సంస్థ 'ఎక్స్ఏఐ'. 'గ్రోక్' పేరిట చాట్‌బాట్ సేవల్ని తీసుకొచ్చి యూజర్లను ఆశ్చర్యపర్చింది. ఇప్పటివరకు కేవలం ఎక్స్ యూజర్లకు మాత్రమే పరిమితమైన ఈ సేవల్ని టెలిగ్రామ్ లో అందుబాటులోకి తెచ్చింది. ఎక్కువమంది యూజర్లకు ఈ సర్వీసుల్ని అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది.

కృత్రిమ మేధ (ఆధారిత చాట్‌బాట్‌ల సేవలు అందిస్తున్న సంస్థల మధ్య గట్టి పోటీ నెలకొంది. దీంతో యూజర్లను పెంచుకొనేందుకు ఆయా సంస్థలు కొత్త మోడళ్లను, అద్భుతమైన ఫీచర్లను పరిచయం చేస్తున్నాయి. ఇలా ఏఐ ప్రపంచంలో పోటీని ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా గ్రోక్ ఏఐ టెలిగ్రామ్‌తో చేతులు కలిపింది. ఇప్పటికే టెలిగ్రామ్‌లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయని గ్రోక్ తన 'ఎక్స్' హ్యాండిల్‌లో తెలిపింది. అయితే, ప్రీమియం యూజర్లకు మాత్రమే ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. టెలిగ్రామ్‌లో సెర్చ్ బార్‌లో "%+తీశీసాౖ×%" అని టైప్ చేసి ఈ సర్వీసుల్ని వినియోగించుకోవచ్చు.

మరోవైపు టెలిగ్రామ్ 2024 ఆగస్టు నుంచి చట్టపరమైన సమస్యల్ని ఎదుర్కొంటోంది. టెలిగ్రామ్ ద్వారా హవాలా మోసం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక దాడికి సంబంధించిన సమాచారం షేర్ చేయడం వంటి ఆరోపణల కారణంగా 'టెలిగ్రామ్' వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్ అరెస్ట్ అయ్యారు. అప్పటినుంచి కంపెనీ సవాళ్లు ఎదుర్కొంటోంది. ఇతర ప్లాట్‌ఫామ్‌లు ఏఐని అందిపుచ్చుకొని రాణిస్తున్నప్పటికీ.. ఆ విభాగంలో అడుగుపెట్టకుండా యూజర్లను కోల్పోతోంది. ఇప్పుడు తాజాగా గ్రోక్ ఏఐ ఈ నదుపాయాన్ని ప్రవేశపెట్టి వినియోగదారుల్ని ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ట్రంప్ సుంకాల ప్రకటన.. టాటా మోటార్స్ షేర్లు 6% డౌన్

: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ ( షేర్లు భారీగా కుంగాయి. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 6 శాతం మేర అవి క్షీణించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్ల దిగుమతులపై సుంకాలు విధించడమే ఇందుకు కారణం.

విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం ) విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. వచ్చేవారం ఈ చర్యలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన అమెరికాలో తయారయ్యే వాటిపై మాత్రం ఎలాంటి సుంకం ఉండదని పేర్కొన్నారు. ఈ చర్య యూఎస్ ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ట్రంప్ నిర్ణయంతో ఆటోమొబైల్ షేర్లు భారీగా కుంగాయి. ప్రధానంగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ మాతృ సంస్థ అయిన టాటా మోటార్స్ షేర్లు ఇంట్రాడేలో 6.31 శాతం తగ్గి రూ.663 వద్ద కనిష్ఠాన్ని తాకాయి.




జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు అమెరికా కీలకమైన మార్కెట్. జేఎల్ఆర్ వార్షిక నివేదిక ప్రకారం.. 2024 ఆర్థిక సంవత్సరానికి గానూ కంపెనీ మొత్తం అమ్మకాల్లో 25 శాతం అమెరికా మార్కెట్ నుంచే వచ్చాయి. ఇక సుంకాల నిర్ణయంతో కంపెనీ లాభాలు, మార్జిన్‌లపై ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై పెట్టుబడిదారుల్లో ఆందోళనలు మొదలయ్యాయి. దీంతో ఆటోమొబైల్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. 10:05 గంటల సమయంలో టాటా మోటార్స్ షేర్లు 5.49 శాతం నష్టంతో 669 వద్ద ట్రేడవుతున్నాయి.

# లాభాల్లో ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్ సూచీలు



: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఆటో షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీంతో తొలుత సూచీలు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఆ తరువాత ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో కాసేపటికే లాభాల బాట పట్టాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ (%నావఅవఞ%) 246 పాయింట్లు లాభంతో 77,537 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ (%దీఱటీఎ%) 59 పాయింట్ల లాభంతో 23,546 వద్ద ఉన్నాయి.

సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎంఅండ్ఎం, ఏషియన్ పెయింట్స్, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ, ఐటీసీ, టీసీఎస్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. జొమాటో, ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్టీపీసీ, టైటాన్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 73.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 3,036 డాలర్ల మార్క్‌ను దాటి ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 85.90 వద్ద కొనసాగుతోంది.

టారిఫ్ భయాలతో అమెరికా మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఎస్అండ్‌పీ సూచీ 1.12 శాతం, నాస్‌డాక్ 2.04 శాతం నష్టపోయాయి. డౌజోన్స్ ఫ్లాట్‌గా ముగిసింది. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియన్ ఏఎస్ఎక్స్ 0.55 శాతం, జపాన్ నిక్కీ 0.93 శాతం నష్టంతో ట్రేడవుతుంటే.. హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 0.81 శాతం, షాంఘై 0.31 శాతం లాభంతో కదలాడుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (%ఖీఱ××౦%) బుధవారం రూ.2,241 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు (%ఔఱ××౦%) నికరంగా రూ.696 కోట్ల షేర్లు విక్రయించారు.



# సంపన్నులు వలస పోతున్నారు

ముంబయి: మన దేశానికి చెందిన అతి సంపన్నుల్లో (సూపర్ రిచ్ ఇండియన్స్) 22% మంది, విదేశాల్లో స్థిరపడాలనుకుంటున్నట్లు కోటక్ ప్రైవేట్-ఈవై నిర్వహించిన సంయుక్త సర్వే తెలిపింది. ఇక్కడ జీవన పరిస్థితులతో పోలిస్తే మెరుగైన జీవన ప్రమాణాలు, సులభతర వ్యాపార వాతావరణం ఉన్న దేశాలకు వారు అక్కడకు వెళ్లాలనుకుంటున్నారని వివరించింది. విదేశీ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఏటా 25 లక్షల మంది భారతీయులు ఇతర దేశాలకు వలస వెళుతున్నారు. ఈ నివేదిక ప్రకారం..

150 మంది అధిక నికర విలువ కలిగిన సంపన్నులు (అల్ట్రా హెచ్ఎన్ఐలు - రూ.25 కోట్లకు పైగా ఆస్తులు కలిగినవారు) అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో స్థిరపడాలనుకుంటున్నారు. గోల్డెన్ వీసా పథకం అమలు చేస్తున్న యూఏఈ కూడా వారిని ఆకర్షిస్తోంది.

ప్రతి అయిదుగురు కోటీశ్వరుల్లో ఒకరు విదేశాలకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. భారతీయ పౌరసత్వాన్ని కొనసాగిస్తూనే, ఆతిథ్య దేశంలో శాశ్వత ప్రాతిపదికన నివసించాలనుకుంటున్నారు.

మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలు, విద్య, లైఫ్‌స్టైల్ వంటివి.. సంపన్నులు విదేశాల్లో స్థిరపడాలనుకునేందుకు ప్రేరణ కలిగిస్తున్నాయి. వ్యాపార కార్యకలాపాలు సులభతరంగా నిర్వహించే వీలుండటంతో, వెళ్లాలనుకుంటున్నామని సర్వేలో పాల్గొన్న 66.66% మంది తెలిపారు.

పిల్లల ఉన్నత చదువుల కోసమూ చాలా మంది ఆయా దేశాలకు మారాలనుకుంటున్నారు. వలస నిర్ణయాన్ని 'భవిష్యత్తు కోసం పెట్టుబడి'గా పరిగణిస్తున్నారు.

సంపన్నుల వలస నిర్ణయాన్ని దేశం నుంచి మూలధనం తరలిపోయినట్లుగా చూడకూడదని, అటువంటి కార్యకలాపాలపై పరిమితులు ఉండటంతో ఒక వ్యక్తి నివాసం మారినా, మనదేశం నుంచి డబ్బు బయటకు వెళ్లకుండా ఉంటోందని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రెసిడెంట్ గౌతమి గవాంకర్ వెల్లడించారు. భారతదేశంలో నివసిస్తున్న ఒక భారతీయ పౌరుడు ఏడాదికి 2,50,000 డాలర్లు (సుమారు రూ.2.15 కోట్లు) మాత్రమే తీసుకెళ్లగలడని, అదే ప్రవాస భారతీయులకైతే 10 లక్షల డాలర్ల (సుమారు రూ.8.6 కోట్ల) వరకు అనుమతి ఉందని తెలిపారు. దీనివల్ల మూలధనం తరలిపోకుండా ఉంటుందన్నారు.

# జైప్రకాశ్ అసోసియేట్స్‌పై అదానీ ఆసక్తి

ఢిల్లీ: దివాలా ప్రక్రియ ద్వారా జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్)ను స్వాధీనం చేసుకునేందుకు అదానీ గ్రూప్ ఆసక్తి ప్రదర్శిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జేపీ గ్రూప్‌నకు చెందిన ప్రధాన సంస్థ జేఏఎల్.. సిమెంట్, విద్యుత్, హోటళ్లు, నిర్మాణ, స్థిరాస్తి వ్యాపారాల్లో ఉంది. ఈ సంస్థపై దివాలా ప్రక్రియ కొనసాగుతోంది. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అలహాబాద్ బెంచ్ గత ఏడాది జూన్ 3న దివాలా స్మృతి-2016 కింద జేఏఎల్‌పై కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించింది. జేఏఎల్‌ను కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్ ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) ప్రదర్శించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

రూ.55,493 కోట్ల రుణ బకాయిలు: 2025 ఫిబ్రవరి 20 నాటికి బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు జేఏఎల్ రూ.55,493.43 కోట్లు చెల్లించాల్సి ఉంది. రుణదాతల బృందం ఇటీవల తమ రుణాలను నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఆర్‌సీఎల్)కు బదిలీ చేసినట్లు జేఏఎల్ తెలిపింది. రుణదాతల్లో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎల్ఐసీ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఐఎఫ్‌సీఐ, పీఎన్‌బీ, యూకో బ్యాంక్, సౌత్‌ఇండియన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్, సిటీ, స్టాండర్డ్ ఛార్టెర్డ్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, ఎగ్జిమ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఎస్ఆర్ఈఐ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ ఉన్నాయి. ఇవి ఎన్ఏఆర్‌సీఎల్‌కు బదిలీ చేసిన మొత్తం రుణ బకాయిలు ఎంతనేది జేఏఎల్



# అలాంటి నిర్ణయాలు ఎందుకు: పంత్, గిల్ కెప్టెన్సీపై సెహ్వాగ్ విమర్శలు

ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తమ తొలి మ్యాచుల్లో ఓటమిని చవిచూశాయి. పంజాబ్ చేతిలో 11 పరుగుల తేడాతో గుజరాత్ ఓడింది. ఇక దిల్లీ క్యాపిటల్స్‌తో చివరివరకూ పోరాడిన లఖ్‌నవూకు పరాజయం తప్పలేదు. ఈక్రమంలో రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నాడు. ఉప్పల్ వేదికగా ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లఖ్‌నవూ తలపడనుంది. దూకుడుగా ఆడే ఎస్‌ఆర్‌హెచ్‌ను కట్టడి చేయడంలో పంత్ దూకుడైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని సెహ్వాగ్ సూచించాడు.

“తుది జట్టులో ఉన్న బౌలర్లను సరిగ్గా సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత కెప్టెన్‌పై ఉంటుంది. ఒకవేళ అవేశ్ ఖాన్ ఉన్నా సరే శార్దూల్ ఠాకూర్ మాదిరిగా తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు తీసేవాడు కాదేమో. ఇక్కడ దిల్లీ కేవలం ఒక్క ఓవర్‌లోనే గెలవలేదు. చివరివరకూ పోరాడి విజయం సాధించింది. లఖ్‌నవూ మ్యాచ్‌ను చేజేతులా మిస్ చేసుకుంది. తుది జట్టులో లేని వారి గురించి కాకుండా.. ఉన్నవారితో ఎలా గెలవచ్చునేది కెప్టెన్ ఆలోచించాలి. రిషభ్ పంత్ ( చేయాల్సిందదే. సరైన సమయంలో సరైన బౌలర్లను తీసుకురావాలి. ఈ ట్రిక్‌ను పంత్ మిస్ అయినట్లు అనిపించింది” అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు.

“శుభ్‌మన్ గిల్ సారథ్యం స్థాయికి తగ్గట్టు లేదు. అతడు సిద్ధంగా లేడనిపిస్తోంది. ఉత్సాహంగానూ లేడు. ఇలా అనడానికి కారణాలున్నాయి. సిరాజ్ బౌలింగ్ అద్భుతంగా వేస్తున్నప్పుడు.. అతడిని పక్కనపెట్టి అర్షద్ ఖాన్‌ను తీసుకొచ్చాడు. పవర్‌ప్లేలో 21 పరుగులు ఇచ్చాడు. అక్కడితో పంజాబ్ ఇన్నింగ్స్‌కు ఊపు వచ్చింది. ఒకవేళ సిరాజ్‌తో కొనసాగించి ఉంటే.. పరిస్థితి వేరుగా ఉండేది. అతడిని డెత్ ఓవర్లకు తీసుకురావాల్సిన అవసరం లేదు. బౌలర్లను సద్వినియోగం చేసుకోవడంలో గిల్ ఇంకాస్త యాక్టివ్‌గా ఉండాలి” అని సెహ్వాగ్ తెలిపాడు.

# “రూ. 11 కోట్లు పెట్టారు.. అతడిని ఎనిమిదో స్థానంలో పంపిస్తారా?”



3రాజస్థాన్ రాయల్స్‌కు మళ్లీ పరాజయం ఎదురైంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు తొలి విజయం దక్కింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు సంజు శాంసన్ స్థానంలో రియాన్ పరాగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే, వరుసగా రెండు మ్యాచుల్లోనూ ఓడిపోవడంతో పరాగ్ నిర్ణయాలపై ఇప్పుడు విమర్శలు మొదలయ్యాయి. కీలకమైన సమయంలో బ్యాటర్లను పంపించడంలో రియాన్ ఇబ్బందిపడుతున్నట్లు అనిపించిందని మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ వ్యాఖ్యానించాడు. రూ. 11 కోట్లు పెట్టి రిటైన్ చేసుకున్న షిమ్రోన్ హెట్‌మయెర్‌ను ఎనిమిదో స్థానంలో ఆడిస్తారా? అని ప్రశ్నించాడు. కరేబియన్ లీగ్‌లో అతడిని వన్‌డౌన్ లేదా సెకండ్ డౌన్‌లో ఆడించేవాళ్లని గుర్తు చేశాడు.

“ఎందుకు హెట్‌మయెర్‌ను దిగువన పంపిస్తారు. అతడిని రిటైన్ చేసుకోవడానికి ఎంత వెచ్చించారు? రూ.11 కోట్లు పెట్టి మరీ తమవద్ద అట్టి పెట్టుకున్నారు. మరి అతడిని ఎనిమిదో స్థానంలో ఆడిస్తున్నారు. గయానాలో అతడు నాలుగో స్థానంలోపే బరిలోకి దిగేవాడు. అతడిని ఎందుకు ఐపీఎల్‌లో లోయర్ ఆర్డర్‌కు పంపించారు? అతడు ఫినిషర్ అని అనుకుంటున్నారు కదా.. కానీ, ఈ నిర్ణయం అత్యంత చెత్తదే. అతడు కేవలం హిట్టింగ్ మాత్రమే కాకుండా నిలకడగా పరుగులు చేయగల బ్యాటర్. ఇంపాక్ట్ సబ్‌ను పంపించకముందే హెట్‌మయెర్‌ను ఆడించాలి. ఒకవేళ విఫలమైతే అప్పుడు ఇంపాక్ట్‌ను బరిలోకి దింపాలి. తొలి రెండు మ్యాచుల్లో రాజస్థాన్ రాయల్స్ ప్రణాళికలు బాగోలేవు. విభిన్నమైన వ్యూహాలు, నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కనీసం ఐదు లేదా ఆరో స్థానంలో వచ్చినా హెట్‌మయెర్ మరిన్ని పరుగులు చేసేవాడు. శుభ్‌మ్ దూబెను ఇంపాక్ట్‌గా తీసుకురావాల్సిన అవసరమే లేదు. ఆర్చర్ కూడా ఆఖర్లో సిక్స్ కొట్టాడు. వీరంతా త్వరగా ఔటైతే అప్పుడు దూబెను ఆడిస్తే బాగుండేది. ఇలా చేస్తే అదనంగా ఓ స్పిన్నర్‌ను ఇంపాక్ట్ సబ్‌గా తీసుకొనే వెసులుబాటు లభించేది’’ అని డౌల్ వ్యాఖ్యానించాడు.

## కేవలం 7 పరుగులే..

కోల్‌కతా బౌలర్ల దెబ్బకు రాజస్థాన్ 15 ఓవర్లలో 110 పరుగులకే ఆరు వికెట్లను కోల్పోయింది. అప్పటికి క్రీజ్‌లో ధ్రువ్ జురెల్ ఉన్నాడు. అతడితోపాటు హెట్‌మయెర్ (7) బ్యాటింగ్ చేసేందుకు వచ్చాడు. దీంతో కనీసం 160కిపైగా పరుగులు చేసే అవకాశం ఉంది. అదే సమయంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని తీసుకొచ్చిన కేకేఆర్ ఫలితం రాబట్టింది. హెట్‌మయెర్‌ను భారీ షాట్లు కొట్టకుండా అడ్డుకోగలిగింది. చివరికి హర్షిత్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ చివరి బంతికి భారీ షాట్‌కు యత్నించి హెట్‌మయెర్ పెవిలియన్‌కు చేరాడు. అప్పటికి 8 బంతులను ఆడిన హెట్‌మయెర్ కేవలం ఒక్క ఫోర్ మాత్రమే కొట్టాడు. ఆఖర్లో జోఫ్రా ఆర్చర్ (16: 7 బంతుల్లో 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించడంతో రాజస్థాన్ స్కోరు 150 పరుగుల మార్క్‌ను దాటింది.

# మెరుపు స్టంపింగ్.. ఐపీఎల్‌లో ఈ రికార్డు బద్దలవుతుందా?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ () ఎన్నో రికార్డులకు నెలవు. బ్యాటర్ల దూకుడు, బౌలర్ల పదునైన బంతులే కాదు.. స్టంప్స్ వెనుక కీపర్ల చూపే మెరుపు వేగం కూడా. ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన స్టంపింగ్‌ను చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సాధించాడు. ముంబయి ఆటగాడు సూర్యకుమార్ యాదవ్‌ను 0.12 సెకన్లలోనే స్టంపౌట్ చేశాడు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో వేగవంతమైన స్టంపింగ్ రికార్డు చర్చలోకి వచ్చింది. తొలి స్థానం ఎవరిది? అసలు ఈ రికార్డు బద్దలయ్యే అవకాశం ఉందా?

ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన స్టంపింగ్ రికార్డు ధోనీ పేరిటే ఉంది. 2023 ఐపీఎల్ ఫైనల్‌లో గుజరాత్ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను 0.1 సెకన్లలోనే స్టంపౌట్ చేశాడు. సూర్యను ఔట్ చేసిన స్టంపింగ్ ఫాస్టెస్ట్‌లో రెండో స్థానంలో నిలిచింది. మరి ధోనీ రికార్డును ఎవరైనా బీట్ చేసే అవకాశం ఉందా? నిజానికి అంత వేగం యువ కీపర్లకు కూడా కష్టమే. ధోని స్ఫూర్తిగా జితేశ్ శర్మ, ధ్రువ్ జురెల్, జోస్ బట్లర్, హెన్రిచ్ క్లాసెన్, ఫిల్ సాల్ట్, రిషభ్ పంత్, రికల్టన్ చేస్తారేమో చూడాలి.

ఇక్కడే ఓ మాట చెప్పుకోవాలి. అదేదో తెలుగు సినిమాలో చెప్పినట్లు.. ‘ధోనీ రికార్డును కొట్టాలంటే అవతలి వ్యక్తి కూడా ధోనీనే అయి ఉండాలి’. చూద్దాం ఈ ఐపీఎల్‌లో ఇంకా బోలెడు మ్యాచ్‌లున్నాయి. 43 ఏళ్ల ధోనీ తన రికార్డు తనే బద్దలు కొడతాడేమో. అన్నట్లు ప్రపంచ క్రికెట్‌లోనూ ఫాస్టెస్ట్ స్టంపింగ్ రికార్డు కూడా మాహీదే. 2018లో వెస్టిండీస్‌కి చెందిన కీమో పాల్‌ను 0.08 సెకన్లలో స్టంపౌట్ చేశాడు.



# ఒక్క పొరపాటు చేసినా అంతే.. సీఎస్కేతో జాగ్రత్త: ఆర్సీబీని హెచ్చరించిన వాట్సన్

ఐపీఎల్ 2025 (%ఖూా% 2025) సీజన్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంతో మొదలుపెట్టింది. కోల్‌కతాను ఈడెన్ గార్డెన్స్‌లోనే ఓడించింది. ఇక చెపాక్ వేదికగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో ( తలపడనుంది. ఇది సీఎస్కే సొంత మైదానం. ఈ క్రమంలో చెన్నైతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. ఏ ఒక్క పొరపాటు చేసినా ఓటమి తప్పదని ఆర్సీబీని మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ హెచ్చరించాడు. వాట్సన్‌కు గతంలో చెన్నై, బెంగళూరు జట్లతో కలిసి ఆడిన అనుభవం ఉండటం గమనార్హం.

“చెపాక్‌లో ఆర్సీబీకి పెను సవాల్ తప్పదు. సీఎస్కే జట్టులో నాణ్యమైన బౌలర్లు ఉన్నారు. చెన్నైకి దీటుగా సమాధానం ఇవ్వాలంటే బెంగళూరు కూడా సరైన కూర్పుతో బరిలోకి దిగాలి. చెపాక్ బౌలర్లకు స్వర్గధామం. సీఎస్కేను చూస్తుంటే.. ఆ జట్టులో ముగ్గురు స్పిన్నర్లు అశ్విన్, జడేజా, నూర్ అహ్మద్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారు. ఈ పిచ్‌పై వారిని ఎదుర్కోవడం తేలికేం కాదు. ముంబయిపై నూర్‌అహ్మద్ తీవ్ర ప్రభావం చూపించాడు. ప్రతి బంతి వికెట్ ఇచ్చేలా విసిరాడు. వికెట్ తీసేందుకు ఆ ముగ్గురు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఈ విషయంలో ఆర్సీబీకి సవాల్ తప్పదు. చెన్నై బ్యాటింగ్ లైనప్ కూడా బలంగా ఉంది” అని వాట్సన్ వెల్లడించాడు.

## రాజస్థాన్ బ్యాటర్లు ఇబ్బందిపడుతున్నారు..

‘‘ఈసారి ఐపీఎల్‌లో రాజస్థాన్ వరుసగా రెండు మ్యాచుల్లో ఓడింది. ఆ జట్టు బ్యాటర్లు ఇబ్బందిపడుతున్నట్లు అనిపిస్తోంది. కోల్‌కతాతో జరిగిన పోరులో వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీని ఎదుర్కోలేకపోయారు. అదే సమయంలో రాజస్థాన్ బౌలర్లు మాత్రం ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలం కావడం చూశాం. లోతైన బౌలింగ్ లేకపోవడమూ నష్టం చేసింది. కేకేఆర్ ఓపెనర్ క్వింటన్ డికాక్ ఏ సమయంలోనూ ఒత్తిడికి గురికాకుండా తన జట్టును గెలిపించాడు. మొదట్లో ఆచితూచి ఆడి.. అవసరమైనప్పుడు బ్యాట్‌ను ఝుళిపించాడు” అని వాట్సన్ (%హ్జుఅవ ఔఖంశీఅ%) వెల్లడించాడు. రాజస్థాన్ 2008లో విజేతగా నిలిచినప్పుడు వాట్సన్ కూడా ఆ జట్టు సభ్యుడే.

# విరాట్ కోహ్లీని పోలి ఉన్న నటుడు.. ఆశ్చర్యంలో అభిమానులు

: మనిషిని పోలిన మనుషులు మనకు ఎక్కడో ఒక చోట తారస పడుతుంటారు. సాధారణ జనం ఒకరినొకరు పోలి ఉన్నా ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ, అప్పుడప్పుడు సెలబ్రెటీలను పోలి ఉన్న వ్యక్తులు మన కంటపడుతుంటారు. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (లా ఉన్న వ్యక్తులు అప్పుడప్పుడు వార్తల్లో నిలుస్తుంటారు. ఓ సారి కాన్పూర్‌లో భారత్–బంగ్లాదేశ్ టెస్ట్ మ్యాచ్ సందర్భంగా అచ్చం కోహ్లీని పోలి ఉండే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కార్తీక్ శర్మ, విరాట్‌తో సెల్ఫీ తీసుకున్నాడు. అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరిగినప్పుడు అచ్చం కోహ్లీని పోలిన ఓ వ్యక్తి కనిపించాడు.

# సన్‌రైజర్స్‌కు ఎదురుందా?

– హైదరాబాద్: ఐపీఎల్ లో 300 అందుకునే సత్తా ఉన్న జట్లలో మొదటగా వినిపించే పేరు సన్‌రైజర్స్ హైదరాబాద్. రాజస్థాన్ రాయల్స్‌తో మొదటి మ్యాచ్ తర్వాత ఈ సీజన్‌లో ఆ జట్టు త్రిశతకం అందుకోవడం ఖాయమన్న అంచనాలు పెరిగాయి. ఆ ప్రత్యర్థి ఎవరన్నదే తేలాలి. గురువారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో సన్‌రైజర్స్ (అమీతుమీ తేల్చుకోనుంది. ఉప్పల్ స్టేడియంలో తొలి మ్యాచ్‌లో అదరగొట్టిన హైదరాబాద్‌కు వరుసగా రెండో విజయం పెద్ద కష్టంకాకపోవచ్చు. ఊహించినట్లే మొదటి మ్యాచ్‌లోనే ఆ జట్టు బ్యాటింగ్ విశ్వరూపం చూపించింది. అభిషేక్‌శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, నితీశ్‌కుమార్‌రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్‌ల దూకుడుతో ఐపీఎల్‌లో అత్యధిక పరుగుల రికార్డు (287)కు సన్‌రైజర్స్ ఒక్క పరుగు దూరంలోనే నిలిచింది. క్రీజులోకి వచ్చిన ప్రతి ఒక్కరు దంచడంతో 286 పరుగుల భారీస్కోరుతో హోరెత్తించింది. హెడ్ (67), ఇషాన్ (106 నాటౌట్)ల ఊచకోత ప్రత్యర్థి జట్లలో వణుకు పుట్టించింది. అభిషేక్ నుంచి క్లాసెన్ వరకు వరుసగా అయిదుగురు విధ్వంసకర బ్యాటర్లను ఎలా ఎదుర్కోవాలన్నదే ఇప్పుడు ప్రత్యర్థి జట్ల ముందున్న సవాల్. తొలి మ్యాచ్‌లోనే అయిదుగురు ప్రధాన బ్యాటర్లు ఫామ్ చాటుకోవడం అతిపెద్ద సానుకూలాంశం. దుర్భేధ్యమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన సన్‌రైజర్స్‌కు తొలుత బ్యాటింగ్ చేసే అవకాశమివ్వాలంటేనే ఏ జట్టైనా ఒకటికి రెండు సార్లు ఆలోచించుకునే పరిస్థితి కనిపిస్తోంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్, మహ్మద్ షమి, హర్షల్ పటేల్‌కు సిమర్‌జీత్‌సింగ్ జతకలవడంతో సన్‌రైజర్స్ పేస్ మరింత పదునెక్కింది. ఇటు పేస్.. అటు ఆడమ్ జంపా, అభిషేక్‌శర్మల కూడిన స్పిన్‌తో సన్‌రైజర్స్ సమతూకంగా ఉంది.



# సెర్ఫ్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 27: సెర్ఫ్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదటమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు.గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి, సెర్ఫ్ కార్యక్రమాల పై సెర్ఫ్ సీఈఓ డి. దివ్యతో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ, యాసంగి మార్కెటింగ్ సీజన్ లో సెర్ఫ్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకేపి లకు బదిలీ చేయాలని, అదనపు వరి ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్ లకు తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ మహిళా సంఘాలకు అందడం లేదని దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమీషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ఫ్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి. కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. నిర్ధారణ క్యాంపుల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్ధులు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ లకు సూచించారు. డిఆర్డిఓ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమీషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.3 నెలలు ఫించన్ తీసుకోని లబ్దిదారులు వలస వెళ్లినట్లు సిస్టమ్ నమోదు చేస్తుందని అన్నారు. వలస వెళ్లినట్లు నమోదు అయిన వివరాలను అధికారులు పరిశీలన చేసుకొని పెన్షన్ తీసుకోక పోవడానికి గల కారణాలు తెలుసుకోవాలని, లబ్ధిదారులు మరణిస్తే వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టు పనులకు సంబంధించి అవసరమైన కటింగ్ మిషన్, ఇతర పరికరాలు సిద్ధం చేసుకోవాలని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని, జూన్ నెల వరకు ఈ పనులు పూర్తి కావాలని అన్నారు.స్కూల్ యూనిఫామ్ కుట్టు పనులకు సంబంధించి కూలీ క్రింద 50 రూపాయలు మాత్రమే వచ్చినట్లు మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారని, దీనిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పరిశీలన చేసి పెండింగ్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు సమర్పించేలా చూడాలని, ప్రభుత్వానికి సమర్పించిన ప్రతి బిల్లు చెల్లింపు పూర్తవుతుందని అన్నారు.స్వశక్తి మహిళ సంఘాల ద్వారా సృష్టించబడిన స్టిచ్చింగ్ సెంటర్ లు పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల స్థాయిలలో కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ ఉంటుందని ఆయన అధికారులకు తెలిపారు. మహిళలచే చేపట్టే పెట్రోల్ బంక్ లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న హెూటల్ ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని అన్నారు. మహిళా శక్తి మాల్స్ ఏర్పాటు కూడా అవకాశాలు కల్పించాలని అన్నారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.ఇందిరా మహిళా శక్తి బజార్ కింద షాప్స్ ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ లలో ప్రజలకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలని, బజార్ ఎల్లప్పుడూ ప్రజలతో కిటకిటలాడేలా ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంక్ లను మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, సాధారణ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, మరణించిన మహిళా సంఘాల సభ్యుల సరైన డాక్యుమెంట్ లను పరిశీలించి సరైన లబ్ధిదారులకు ఈ సహాయం అందేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి జిల్లాలో ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు మరణించారు, వారిలో ఎంత మందికి ప్రమాద బీమా, సాధారణ భీమా అమలు అవుతుంది పరిశీలించి సంబంధిత లబ్ధిదారులకు సహాయం అందజేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, కామారెడ్డి గతంలో 27 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం మరో 156 కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు పెంచడం జరుగుతుందని తెలిపారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు కావలసిన ఎక్విప్మెంట్ సమకూర్చాలని తెలిపారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలని రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తొలుత ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్ఎస్ఇటిఐ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భవనాన్ని గుర్తించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫారం కుట్టుటకు మాచింగ్ బ్యాచింగ్ చేయాలని తెలిపారు. సదరం క్యాంపుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఎల్డీఎం రవికాంత్, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, మెప్మా పిడి శ్రీధర్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమం, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన అల్ఫోర్స్ దావత్ -ఏ- ఇఫ్తార్



కరీంనగర్, మార్చి 27(భారత శక్తి) :మొహమ్మద్ ప్రవక్త బోధనలు మార్గదర్శకమని, చేసిన సూచనలే అభివృద్ధికి బాటలు వేస్తాయని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో మతసామరస్యానికి ప్రతీకగా ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ దావత్ -ఏ- ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు 30 రోజులు ఉపవాసాన్ని కఠినంగా పాటిస్తూ అల్లా బోధనలు స్మరించుకుంటూ ఉంటారని, ఈ బోధనల ద్వారా సమాజంలో అభివృద్ధితో పాటు శ్రేయస్సును పెంపొందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, ఆర్ బీ వి ఆర్ ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గన్ను మహేశ్వర్ రెడ్డి, ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు వెన్నాం రజితా రెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలంతా సేంద్రియ ఆహారాన్ని అలవాటు చేసుకోవాలి: అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



కరీంనగర్, మార్చి 27(భారత శక్తి):సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యంతో పాటు పోషకాలను అందిస్తాయని కాంగ్రెస్ నాయకులు, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు వారది కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల్లోని ప్రజలందరూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పలు పంటలను వినియోగించాలని సూచించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైతం సేంద్రియ ఆహారానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ... సేంద్రియ ఆహారం పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. సేంద్రీయ ఎరువులను పండించే రైతుల్లో విశ్వాసం నింపుతున్నారని చెప్పారు. ప్రజలందరూ సేంద్రియ ఆహారాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మిల్లెట్స్ చాలా క్రేజ్ ఉందని ఈ మిల్లెట్స్ ద్వారా చాలామందికి రోగ నిరోధక శక్తి పెంపొందించడమే కాకుండా ఆయుష్షును సైతం ప్రభావితం చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టాల్ నిర్వాహకులు మధు, ప్రముఖ సామాజిక కార్యకర్త నాగి శేఖర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ థియరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు:అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 27:తెలంగాణ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు.గురువారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 26 వరకు నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఓపెన్ పదవ తరగతి పరీక్షలు రాసే 655 మంది అభ్యర్థులకు 4 పరీక్షా కేంద్రాలు, 898 మంది ఇంటర్ అభ్యర్థులకు మరో 4 పరీక్షా కేంద్రాలను జిల్లా కేంద్రంలో సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు 8 సిట్టింగ్ స్క్వాడ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాల లోపలికి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఎవరికి అనుమతి లేవని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ గది నందు సీసీ కెమెరా ఏర్పాటుకు జిల్లా విద్యాశాఖ అధికారి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాల తరలింపుకు తగిన బందోబస్తు కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బి.ఎన్.ఎస్. 163 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ షాపులు మూసి వేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎం అత్యవసర మందుల కిట్, ఓఆర్ఎస్ ప్యాకేట్లతో అందుబాటులో ఉండాలని అన్నారు. పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని తెలిపారు. త్రాగునీటి సరఫరా, పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ పనులను మున్సిపల్ అధికారులు చేపట్టాలని అన్నారు.పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలు పోస్టల్ శాఖ ద్వారా డి.ఆర్.డి.సి. సెంటర్ కు పంపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి పరీక్షలను ప్రశాంత వాతావరణం లో నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర వర్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, ఓపెన్ స్కూల్ జిల్లా కన్వీనర్ పాపారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ పార్టీ: తాసిల్దార్ పూర్ణచందర్

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 27: బోనకల్ తహసిల్దార్ ఆఫీస్ నందు ముస్లిం మత పెద్దలతో బోనకల్ తహసిల్దార్ పున్నం చందర్ సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇస్తున్న ఇఫ్తార్ పార్టీ విధి విధానాలను వివరించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రేపు సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో తాసిల్దార్ ముస్లిం మత పెద్దలకు రాష్ట్ర ప్రభుత్వం మన మండలానికి కేటాయించిన 50 వేల రూపాయల నగదును అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ పార్టీ ఇవ్వడం చాలా సంతోషదాయకమని ,ఈ కార్యక్రమాన్ని సోదర భావంతో జరుపుకోవాలని ,ఇఫ్తార్ పార్టీ మతసామర్థ్యానికి ప్రతీక అని కొనియాడారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య సంఘం మండల అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా మాట్లాడుతూ ముస్లింలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని , దీనికి నిధులు కేటాయించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క హాజరుకావాలని సంఘం పక్షాన , వారి వ్యక్తిగత సహాయకులు ద్వారా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున హాజరుకావాలని అదేవిధంగా మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ,అన్ని పార్టీల మండల ప్రతినిధులు , ప్రజా ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం సభ్యులు చాంద్ పాషా, జానీ మియా ,దస్తగిరి, మదర్సాహెబ్ ,బాబు, గఫూర్ ,మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



# రైస్ మిల్లు కార్మికుల సంఘాలు సమ్మెకు సర్వం సమాయుక్తం అవుతూ పోరాటానికి సిద్ధం: ప్రధాన కార్యదర్శి శీతల రోష పతి

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి )మార్చి 27: హుజూర్ నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్ లో గురువారం కార్మిక సంఘాల నాయకులు,కార్మికులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కమిటీ జాయింట్ చర్చలు నిర్వహించారు. గత అక్టోబర్ 31 నాటికి రెండు సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి అవుతున్నా నేటి వరకు చర్చలు ఫల ప్రదం కాలేదని, మధ్యలో పలు దఫాలుగా సుదీర్ఘంగా చర్చలు



జరిగినా ఉన్న వేతనంపై నెలకి మిల్లు యాజమాన్యం 2000 రూపాయలకి అంగీకరిస్తుండగా కార్మికులు 3500రూ.లు చెల్లించాలన్న డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మొత్తం ఐదు నెలలు గడుస్తున్న యాజమాన్యం అగ్రిమెంట్ విషయాన్ని నాన బెట్టడం, ఇతర జిల్లాల గురించి చెప్పటం వెరే పట్టణాల లో పద్ధతులు చెప్పటం ఇలా పొద్దు ఎల్లపుచ్చుకుంటూ సమస్య పరిష్కారం చేయడానికి ముందుకు రాకపోవడం అన్యాయమని అన్నారు. నేడు జరిగిన చర్చలలో యాజమాన్యం కార్మికులు సీరియస్ గా కార్మికుల సమస్యలపై చర్చ జరిగిందని రోషపతి తెలిపారు.ఈనెల 31లోపున మరొక సారి చర్చలు కి పిలిచి ఈనాడు పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలకు అనుగుణంగా వెతనాలు పెంచాలని లేబర్ కమీషనర్ చోరవ తీసుకోవాలని రోషపతి కోరారు.చర్చ,ల లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి లక్ష్మీ నరసింహారావు, గజ్జి ప్రభాకర్ గెల్లి అప్పారావు, మూడు కార్మిక సంఘాలు నాయకులు మరియు టి ఎన్ టి యు సి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండెబోయిన ఎంకన్న యాదవ్, కంకణాల రామయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


# కృత్రిమ దంతం 40 ఏళ్లయినా..

కృత్రిమ దంతాలు (ఇంప్లాంట్) చాలా దశాబ్దాలు.. కచ్చితంగా చెప్పాలంటే 40 ఏళ్లు దాటినా పనిచేస్తున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ గోథెన్‌బర్గ్ పరిశోధనలో వెల్లడైంది. ఒక పన్ను ఊడినచోట కృత్రిమ దంతాన్ని అమర్చుకున్నవారిని సుదీర్ఘ కాలం పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. ఒక్క పన్ను స్థానంలో అమర్చిన కృత్రిమ దంతాలు ఇంతకాలం చక్కగా పనిచేస్తుండటం గొప్ప విషయమని పరిశోధకులు చెబుతున్నారు. ఇవి ఇంకా స్థిరంగా ఉండటమే కాకుండా చుట్టుపక్కల ఎముక కూడా పెద్దగా మారలేదనీ వివరిస్తున్నారు. కాకపోతే ఇంప్లాంట్‌తో పోలిస్తే దాని మీద అమర్చే పన్ను భాగం (క్రౌన్) జీవనకాలం మాత్రం కాస్త తక్కువగా ఉంటున్నట్టు బయటపడింది. దాదాపు 40 ఏళ్ల కాలంలో 60% క్రౌన్లు అలాగే ఉండగా.. మిగతా వాటిని ఒకటి లేదా ఎక్కువ సార్లు మార్చాల్సి వచ్చింది. మంచి ప్రణాళికాబద్ధ సర్జరీ పద్ధతులతో అమర్చిన ఇంప్లాంట్లు, ఇవి కుదురుకోవటానికి తగినంత సమయం ఇచ్చినవి దీర్ఘకాలం మన్నుతున్నట్టూ బయటపడింది.



# పుట్టు గుండె లోపాల శిశువులకు క్యాన్సర్ ముప్పు

గుండె లోపాలతో పుట్టే శిశువులకు, వీరిని కన్న తల్లులకు క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటున్నట్టు తాజాగా తేలింది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన సర్క్యులేషన్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం ఈ విషయాన్ని పేర్కొంది. ఇందులో 2005 నుంచి 2019 వరకూ 35 లక్షలకు పైగా కాన్పులకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించారు. శిశువులను, తల్లులను సగటున పదేళ్లు పరిశీలించారు. ఇందులో తేలిన విషయాలు..



పుట్టినప్పుడు గుండె బాగున్నవారితో పోలిస్తే లోపాలు గల శిశువుల్లో 66% ఎక్కువ క్యాన్సర్లు బయటపడ్డాయి.

ముఖ్యంగా రక్తనాళాలు, గుండె కవాటాల లోపం.. సంక్లిష్ట గుండె జబ్బుతో పుట్టినవారికి క్యాన్సర్ ముప్పు రెండితలు ఎక్కువగా ఉంటోంది.

పుట్టుకతో గుండె లోపాలు ఉన్నవారిని, లేనివారిని పరిగణనలోకి తీసుకొని చూస్తే మొత్తంగా రక్తక్యాన్సర్ (21%), నాన్-హాడ్కిన్ లింఫోమా (11%) ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పుట్టుకతో గుండె లోపాలు గల శిశువులను కన్న తల్లులకు పదేళ్ల అనుశీలన సమయంలో క్యాన్సర్ ముప్పు 17% ఎక్కువగా ఉంటోంది. దీనికి కారణమేంటన్నది నిర్ధరణ కాకపోయినప్పటికీ తల్లికి జన్యు స్వభావం ఉండటం లేదా శిశువుల్లో పుట్టుకతో గుండె లోపాలు, క్యాన్సర్‌కు దారితీసే జన్యుమార్పు కలిగుండటం దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు.


# పిల్లలకు నిద్రలేమి పోటు

తగినంత నిద్రపోని కౌమారదశ (13–19 ఏళ్లు) పిల్లలకు అధిక రక్తపోటు ముప్పు పెరుగుతున్నట్టు పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ అధ్యయనం హెచ్చరించింది. త్వరగా నిద్ర పట్టకపోవటం, పట్టినా మధ్యలో మెలకువ రావటాన్ని నిద్రలేమి సమస్యగా భావిస్తారు. కంటి నిండా నిద్రపోయే పిల్లలతో పోలిస్తే ఈ నిద్రలేమితో సతమయ్యేవారికి, అలాగే నిర్ణీత 7.7 గంటల కన్నా తక్కువసేపు నిద్రించేవారికి అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుండటం ఆందోళనకరం. నిద్రలేమి సమస్య లేకపోయినా 7.7 గంటల కన్నా తక్కువసేపు నిద్రించే పిల్లలకూ సుమారు మూడు రెట్లు రక్తపోటు పెరిగే ప్రమాదముందని తేలింది. కౌమారదశ పిల్లలకు రాత్రిపూట రోజుకు 8–10 గంటల నిద్ర అవసరం కానీ బడికి వెళ్లే విద్యార్థులు సగటున కేవలం 6.5 గంటల సేపు మాత్రమే నిద్రిస్తున్నారని అంచనా. ఇది పిల్లల ఆరోగ్యం మీద విపరీత ప్రభావం చూపుతున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. రక్తపోటు పెరిగితే గుండెజబ్బుల ముప్పు పెరుగుతుందన్న సంగతి తెలిసిందే.



# అల్జీమర్స్‌కు రోజ్‌మేరీ కళ్లెం

మెదడులో అమీలాయిడ్-బీటా, టావ్ ప్రొటీన్లు పోగుపడటం వల్ల అల్జీమర్స్ తలెత్తుతుంది. ఇందులో నాడీ కణాలు క్రమంగా దెబ్బతింటూ వస్తుంటాయి. ఈ ప్రక్రియ నెమ్మదింప జేసే, వెనక్కి మళ్లించే మార్గాల కోసం శాస్త్రవేత్తలు చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు.



తాజాగా స్క్రిప్స్ రీసెర్చ్ పరిశోధకులు రోజ్‌మేరీ మీద నిర్వహించిన అధ్యయనం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. రోజ్‌మేరీలోని కార్నోసిక్ ఆమ్లం విశృంఖల కణాలను, వాపు ప్రక్రియను అడ్డుకుంటుంది. కాకపోతే ఇది స్థిరంగా ఉండదు. త్వరగా ఆక్సిజన్‌తో చర్య జరపటం వల్ల త్వరగా చెడిపోతుంది. అందువల్ల చికిత్సల్లో వాడుకోవటానికి కుదరటం లేదు. ఈ సమస్యను పరిష్కరించటానికి స్క్రిప్స్ పరిశోధకులు కార్నోసిక్ ఆమ్లాన్ని చాలా స్థిరంగా, అందుబాటులో ఉండే విధంగా డైఏసీసీఏ రూపంలోకి మార్చారు. ఇది పేగుల్లోకి వెళ్లాకే జీర్ణమై, రక్తంలో కలుస్తుండటం గమనార్హం. దీన్ని అల్జీమర్స్ గల ఎలుకల్లో పరీక్షించగా జ్ఞాపకశక్తితో పాటు నాడీ కణాల మధ్య అనుసంధానాలూ మెరుగైనట్టు తేలింది. ఫలితంగా విషయగ్రహణ సామర్థ్యం క్షీణించటమూ నెమ్మదించింది. డైఏసీసీఏ మెదడులో వాపు ప్రక్రియనూ గణనీయంగా తగ్గిస్తున్నట్టు బయటపడింది.

# వామ్మో.. భుజం నొప్పి

తల దువ్వుకుంటాం, చొక్కా వేసుకుంటాం, వస్తువులు అటక మీద పెడతాం, కిందికి దించుతాం, పనికిరానివి విసిరేస్తాం, షటిల్ ఆడతాం. రోజూ ఇలాంటి పనులెన్నో అలవోకగా చేసేస్తుంటాం. కానీ భుజం నొప్పి పుడితే? చేయి పైకి లేవటమే కష్టమైతే? భుజం కీలును స్థిరంగా పట్టి ఉంచుతూ.. తేలికగా కదలటానికి తోడ్పడే కండరాల చీలిక (రొటేటర్ కఫ్ టేర్) ఇలాగే వేధిస్తుంది. ఇది క్రీడాకారులు, బలమైన పనులు చేసేవారికే పరిమితం కాదు. ఎవరికైనా రావొచ్చు. కాకపోతే వయోవృద్ధుల్లో ఎక్కువ. దీనికి సర్జరీ అవసరమని చాలామంది భావిస్తుంటారు గానీ మామూలు చీలికలకు ప్రత్యేక వ్యాయామాలతోనే మంచి ఉపశమనం లభిస్తుంది. వీటితో సమస్య ముదరకుండానూ చూసుకోవచ్చు.



భుజం కీలులో నొప్పి, అసౌకర్యానికి దారితీసే ప్రధాన సమస్యల్లో రొటేటర్ కఫ్ చీలిక ఒకటి. మూడు ఎముకలతో కూడిన మన భుజం ఓ బంతి–గిన్నె కీలు. ఇది స్థిరంగా ఉండటానికి రకరకాల నిర్మాణాలు తోడ్పడతాయి. వీటిల్లో రొటేటర్ కఫ్ ముఖ్యమైంది. ఇది కారు స్టీరింగ్ మాదిరిగా భుజం కదలికలను నియంత్రిస్తుంది. నిజానికిది నాలుగు కండరాల సముదాయం. ఇవి ఒకదగ్గర కలిసి, కండర బంధనాలుగా మారి చేయి పైఎముక (హ్యూమరస్) ముందుభాగాన తొడుగులా ఏర్పడతాయి. ఇలా పైఎముక, భుజ ఫలకం (షోల్డర్ బ్లేడ్) రెండింటినీ కలిపి ఉంచుతుంది. దీని మూలంగానే చేయి పైకి లేవటం, పక్కలకు కదలటం సాధ్యమవుతుంది. రొటేటర్ కఫ్ గాయానికి గురైనా, దెబ్బతిన్నా వాచి, నొప్పి పుడుతుంది. కీలు కదలికలూ అస్తవ్యస్తం కావొచ్చు. దీంతో తల దువ్వుకోవటం, బ్రష్‌తో పళ్లు తోముకోవటం, గ్లాసుతో నీళు తాగటం, చొక్కా/జాకెట్ ధరించటం, అటక మీది వస్తువులను అందుకోవటం, వాహనాలు నడటం, కంప్యూటర్ కీబోర్డును వాడటం, ఫోన్ పట్టుకోవటం, బ్యాడ్మింటన్, షటిల్ ఆడటం వంటి పనులు అస్తవ్యస్తమవుతాయి. నిద్ర కూడా దెబ్బతినొచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే– రోజూ చేసే దాదాపు అన్ని పనులకూ విఘాతం కలుగుతుంది.

చికిత్స– రెండు రకాలు

రొటేటర్ కఫ్ చిరిగితే వ్యాయామాలు, మందులతో కూడిన సంప్రదాయ చికిత్సకే ప్రాధాన్యమిస్తారు. భుజం కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలతో కూడిన ఫిజియోథెరపీ, వేడి కాపు లేదా ఐస్ అద్దటం, నొప్పి మందులు, విశ్రాంతి చాలావరకూ మేలు చేస్తాయి. కొందరికి కార్టికోస్టిరాయిడ్ ఇంజెక్షన్లూ అవసరమవ్వచ్చు. సర్జరీతో పోలిస్తే ఇలాంటి సంప్రదాయ చికిత్సలో కోత ఉండదు, త్వరగా కోలుకుంటారు. ఖర్చూ తక్కువే. క్రమం తప్పకుండా వీటిని చేస్తే మూడు నెలల్లోనే తిరిగి మామూలు స్థితికి చేరుకునే అవకాశముంది.

సర్జరీ: పెద్ద చీలికలు గలవారికి వ్యాయామాలు అంతగా ఉపయోగపడకపోవచ్చు. చీలిక మరమ్మతు ఆలస్యం కావొచ్చు, పెద్దగానూ అవ్వచ్చు. ఇలాంటివారికి షోల్డర్ ఆర్థ్రోస్కోపీ శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఇందులో చిరిగిన కండరాలను కలిపి, మరమ్మతు చేస్తారు. కొందరికి పైఎముక ముందు భాగాన్ని కొద్దిగా గీకాల్సి ఉంటుంది కూడా. పెద్ద, లోతైన చీలికల గలవారికి సర్జరీ ఉపయోగపడుతుంది. శ్రమతో కూడిన పనులను త్వరగా చేసుకోవటానికి వీలవుతుంది. అయితే శస్త్రచికిత్స నుంచి కోలుకోవటానికి ఎక్కువ సమయం పట్టొచ్చు. కొందరికి కీలు బిగుసుకోవచ్చు, మరింత కఠిన ఫిజియోథెరపీ అవసరపడొచ్చు. అందువల్ల ఎవరికి ఏ చికిత్స సరిపోతుందనేది చీలిక తీవ్రత, వయసు, చేసే పనులను బట్టి డాక్టర్లు నిర్ణయిస్తారు.

కారణమేంటి?

సాధారణంగా భుజం కీలు చీలిక పెద్ద వయసులో కనిపిస్తుంటుంది. అలాగని చిన్న వయసులో రాకూడదనేమీ లేదు. ఇది చాలావరకూ చిన్నగానే మొదలవుతుంది. క్రమంగా పెద్దదవుతూ వస్తుంది. దీనికి రకరకాల కారణాలు దోహదం చేస్తుంటాయి. ప్రమాదవశాత్తు కింద పడినప్పుడు చేయి పూర్తిగా ముందుకు చాచి ఉండటం లేదా మరీ బరువైన వస్తువులను ఉన్నట్టుండి పైకి ఎత్తటం, బలంగా విసరటం వంటి వాటితో కండరం చిరగొచ్చు. వయసు మీద పడే క్రమంలోనూ చీలిక ఏర్పడొచ్చు. నిజానికి చాలామందిలో చూసేది ఇదే. కండరాలకు రక్త సరఫరా తగ్గటమూ కారణమే. దీంతో మరమ్మతు ప్రక్రియ దెబ్బతిని, చీలిక ఏర్పడుతుంది. ఎక్కువగా ఉపయోగించే చేయిలో ఇది ప్రధానంగా కనిపిస్తుంటుంది. ఒకే పనిని మాటిమాటికీ చేయటం వల్ల (బరువులు ఎత్తటం, బేస్‌బాల్, టెన్నిస్ ఆడటం) పడే ఒత్తిడి దీనికి కారణం. ఒక భుజం కండరాల్లో చీలిక ఏర్పడితే రెండో వైపునా సమస్య తలెత్తే అవకాశం ఎక్కువ.

జాగ్రత్తలు పాటించాలి

కండర చీలిక మరీ ముదరకుండా, రోజువారీ పనులను తిరిగి మామూలుగా చేసుకోవటానికి కొన్ని జాగ్రత్తలు పాటించటం మంచిది.

తల మీదికి బరువులు ఎత్తటం, విసరటం మానెయ్యాలి. చొక్కా/జాకెట్ ధరించేటప్పుడు చేతులు పూర్తిగా పైకెత్తకుండా చూసుకోవాలి. తగినంత బలం చేకూరేంతవరకూ బరువులను ఎత్తకూడదు.

భుజం పట్టీ, కైనీసియో టేప్ వంటివి భుజం పనితీరు మెరుగయ్యేలా, నొప్పి తగ్గేలా చేస్తాయి.

నొప్పి తగ్గటానికి వేడి కాపు లేదా ఐస్‌తో అద్దటం మేలు చేస్తాయి.

భుజం కండరాలు పైపైన చీలటం వల్ల తలెత్తే నొప్పులకు పిజియోథెరపీలో భాగంగా చేసే అల్ట్రాసౌండ్, లేజర్, సూపర్ ఇండక్షన్ వంటి చికిత్సలు ఉపయోగపడతాయి.

ఫిజియోథెరపీ ఇలా..

రొటేటర్ కఫ్ చిరిగినవారికి ప్రత్యేకమైన వ్యాయామాలు ఎంతగానో మేలు చేస్తాయి. చేసే పనుల తీరును మార్చుకోవటం, కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలతో మంచి ఫలితం కనిపిస్తుంది. నొప్పి తగ్గటానికి, రోజువారీ పనులు సరిగా చేసుకోవటానికివి తోడ్పడతాయి. వీటిని ఎవరికివారు ఇంట్లోనూ చేసుకోవచ్చు. వీటిని ఒక్కోటి 10 సార్లు చేయాలి.

భుజ ఫలకాలు వెనక్కి

నిటారుగా నిల్చొని భుజాలను వెనక్కి లాగాలి. భుజ ఫలకాలను వీపు మధ్యలో దగ్గరకు వచ్చేలా అదిమి, కాసేపు అలాగే ఉండాలి.

భుజాలు గుండ్రంగా

నిటారుగా నిల్చొని, చేతులు కిందికి వేలాడ దీయాలి. భుజాలను వెనక్కి గుండ్రంగా తిప్పాలి.

భుజ ఫలకాలు కిందికి

తిన్నగా నిల్చొని భుజ ఫలకాలను కిందికి నొక్కాలి.

చేయి తిప్పటం

బల్ల మీద ఒక అరచేయి ఆనించి, ముందుకు వంగాలి. కిందికి వేలాడిన చేయిని పెండ్యులమ్ మాదిరిగా ముందుకూ వెనక్కీ, తర్వాత పక్క భాగాలకు కదిలించాలి. అలాగే సవ్యంగా, అపసవ్యంగా గుండ్రంగా తిప్పాలి.

చేయి ముందు నుంచి లేపటం

గోడకు వీపు ఆనించి నిల్చొని, చేయిని కిందికి తిన్నగా చాచాలి. తర్వాత కింది నుంచి తల మీది వరకూ పైకి లేపాలి.

# రక్తంలో డిమెన్షియా జాడ

ఒక రకమైన నిద్ర సమస్య గలవారిలో డిమెన్షియా ముప్పును ముందుగానే గుర్తించే రక్త పరీక్షను మెక్‌గిల్ యూనివర్సిటీ పరిశోధకులు రూపొందించారు. నిద్రపోతున్నప్పుడు సాధారణంగా కండరాలు అచేతనంగా ఉంటాయి. అందుకే కలలు వస్తున్నా కదలం. కానీ ఇడియోపతిక్ రెమ్ స్లీప్ బిహేవియర్ డిజార్డర్ (ఐఆర్‌బీడీ) గలవారు మాత్రం కలలకూ శారీరకంగా స్పందిస్తుంటారు. తన్నటం, అరవటం వంటివి చేస్తుంటారు. ఇలాంటివారికి పార్కిన్సన్స్, మెదడులో ఆల్ఫా–సైన్యూక్లీన్ ప్రొటీన్ పోగుపడటం వల్ల వచ్చే లెవీ బాడీ డిమెన్షియా ముప్పూ పొంచి ఉంటుంది. ఈ రకం డిమెన్షియాలో జ్ఞాపకశక్తి, విషయగ్రహణ సామర్థ్యం తగ్గుతుంది. భ్రాంతులకూ లోనవుతుంటారు. పార్కిన్సన్స్‌లో మాదిరిగా అసాధారణ కదలికలూ వేధిస్తుంటాయి. డిమెన్షియా లక్షణాలు ఆరంభం కావటానికి ముందే గుర్తించగలిగితే అప్రమత్తం కావొచ్చు. భవిష్యత్తు ప్రణాళికను తీర్చిదిద్దుకోవచ్చు. ఇందుకు తాజా రక్త పరీక్ష తోడ్పడగలదని భావిస్తున్నారు. నిజానికి ఈ పరీక్షను అల్జీమర్స్‌ను గుర్తించటానికే రూపొందించారు. ఇది ఐఆర్‌బీడీ గలవారిలో డిమెన్షియాను పట్టుకోవటానికీ తోడ్పడుతుండటం విశేషం. అల్జీమర్స్ జీవ సూచికలుగా భావించే రెండు ప్రొటీన్లను విశ్లేషించటం ద్వారా ఈ పరీక్ష పనిచేస్తుంది.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy